


తెలుగు జాతీయ దినపత్రిక
# అక్షర విజేత
నిజం నిర్భయం నిష్పక్షం
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక




హైదరాబాద్ సంపుటి:05 సంచిక :217 ఎడిటర్ : బి. అనిల్ కుమార్ పేజిలు : 12, వెల. 6రూ/ మంగళవారం- 10 - ఫబ్రవరి - 2026

# రాష్ట్రంలో భానుడి భగభగలు



రాష్ట్రంలో భానుడి భగభగలు మొదలు
- కావలిలో గరిష్ఠంగా 35 డిగ్రీలు
ఏపీలో ఎండలు మొదలయ్యాయ్ - శీతాకాలం
పూర్తి కాకముందే ప్రతాపం చూపుతున్న భానుడు

అమరావతి : శీతాకాలం పూర్తి కాకముందే రాష్ట్రంలో భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతోంది. ఆదివారం రాష్ట్రంలో సాధారణం కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగతా..2లో

# అన్నమయ్య జిల్లాలో బర్డ్ ఫ్లూ కలకలం.. 24 వేల కోళ్ల మృతి



సదుం మండలంలోని మూడు గ్రామాల్లో 24 వేల కోళ్ల మృతి
భోపాల్ ల్యాబ్ పరీక్షల్లో వైరస్‌గా నిర్ధారించిన అధికారులు
ప్రభావిత గ్రామాల్లో అప్రమత్తమైన అధికార యంత్రాంగం
ఆందోళన వద్దు, జాగ్రత్తలు పాటించాలన్న నిపుణులు

అమరావతి : ఏపీలోని అన్నమయ్య జిల్లాలో బర్డ్ ఫ్లూ వైరస్ మరోసారి తీవ్ర కలకలం సృష్టిస్తోంది. సదుం మండలంలోని మూడు గ్రామాల్లో వేలాది కోళ్లు అంతుచిక్కని రీతిలో మరణించడం స్థానికంగా ఆందోళనకు దారితీసింది. అధికారిక లెక్కల ప్రకారమే దాదాపు 24 వేలకు పైగా కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ పరిణామంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమై నివారణ చర్యలు చేపట్టింది. వివరాల్లోకి వెళితే.. మిగతా..2లో

## బండి సంజయ్, గంగుల తీరుతో కరీంనగర్ అవినీతిమయమైంది



2

- ★కరీంనగర్ కార్పొరేషన్ లో బీజేపీ, బీఆర్ఎస్ ఒప్పందం కుదర్చుకున్నాయన్న పొన్నం
- ★రెండు పార్టీల అవగాహనతో అభ్యర్థుల ఎంపిక జరిగిందని ఆరోపణ
- ★పదేళ్లలో కరీంనగర్ నిర్లక్ష్యానికి గురయిందని విమర్శ

హైదరాబాద్: కేంద్ర మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పై తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. వీరి తీరుతో కరీంనగర్ అవినీతిమయమయిందని అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ఎంఐఎంతో

## బీఆర్ఎస్ నాయకులు ఇష్టారీతిన
# మాట్లాడుతున్నారని ఆగ్రహం



2లో

- ఆయన దేశానికి ప్రధానమంత్రి కాబట్టి బడాబాయే అన్న రేవంత్ రెడ్డి
- ఈగిల్ టీమ్‌కు చెప్పవలసి వస్తుందేమోనన్న ముఖ్యమంత్రి

హైదరాబాద్:(విజేత) : నరేంద్ర మోదీ దేశానికి ప్రధానమంత్రి కాబట్టి ఆయన కచ్చితంగా బడాబాయినే అని, ముఖ్యమంత్రి చోటాబాయి అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీని బడాబాయి అన్నారు కదా అని ఒక మీడియా ప్రతినిధి ప్రశ్నించగా, ముఖ్యమంత్రి స్పందించారు. ప్రధాని కాబట్టి ఆయన బడాబాయే అని చెప్పారు. ఇంగ్లీష్‌లో బిగ్ బ్రదర్ అంటారని, తాను హిందీలో చెప్పానని అన్నారు. 'మీరు టీ న్యూస్ జర్నలిస్టు అయినంత మాత్రాన మీ ముఖంలో నేను కేసీఆర్‌ను చూడను కదా. జర్నలిస్టుగానే చూస్తాను. అలాగే ప్రధానిని ప్రధానిగానే చూస్తాను.. ఆయన పెద్దన్నే' అని అన్నారు. మీ సారంతా ఇంగ్లీష్ నాకు రాదంటూ టీన్యూస్ జర్నలిస్టును ఉద్దేశించి ముఖ్యమంత్రి సరదాగా అన్నారు.

### ఈగల్ టీమ్‌కు చెప్పాలేమో

పదేళ్లు తెలంగాణను పాలించిన బీఆర్ఎస్ చేసిందేమీ లేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఈ పదేళ్లు నిధులు, అధికారం వారి చేతిలోనే ఉందని, అప్పుడేం చేశారని ప్రశ్నించారు. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించాలని రావడం విడ్డూరంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావుల చేతుల్లోనే కీలక శాఖలు ఉన్నాయని గుర్తు చేశారు. వారు ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేయలేదని అన్నారు.

## అన్న ఎన్టీఆర్‌ను, చంద్రబాబును చూశాం కానీ
# ఇలా ఎవరూ మాట్లాడలేదు

- ❖రేవంత్ రెడ్డిలా ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి మాట్లాడలేదన్న కేటీఆర్
- ❖కేసీఆర్‌ను, కార్యకర్తలను తిడితే ఊరుకునేది లేదని హెచ్చరిక
- ❖రెండేళ్ల తర్వాత పాతాళంలో దాక్కున్నా ఊరుకునేదని వ్యాఖ్య



2లో

హైదరాబాద్: (విజేత) : అన్న ఎన్టీఆర్‌ను, ఆ తర్వాత చంద్రబాబు, వైఎస్సార్, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్‌లను చూశామని, కానీ రేవంత్ రెడ్డి లాంటి ముఖ్యమంత్రిని మనం చూడలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. హామీల గురించి అడిగితే 'లాగులో తొండలు విడిచిపెడుతా', 'గుడ్లు పీకి గోటీలు ఆడుతా', 'పేగులు తీసుకుని మెడలో వేసుకుంటా' అని అంటున్నారని, కానీ ఇంతమంది ముఖ్యమంత్రులను మనం చూసినా వారెవరూ ఇలా మాట్లాడలేదని అన్నారు. భూపాలపల్లి, పరకాలలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాను రద్దు చేయనని ముఖ్యమంత్రి చెబుతున్నారని, అసలు ఆయన రద్దు చేయడానికి,

## డిజిటల్ మోసాల కేసులను ఎదుర్కోవడానికి
# SOPని రూపొందించండి



2

- ★డిజిటల్ మోసాలపై సుమోటోగా సుప్రీం కోర్టు విచారణ
- ★అనుమానాస్పద లావాదేవీలపై కస్టమర్లకు బ్యాంకులు అప్రమత్తం చేయాలని ఆదేశం

ఢిల్లి : దేశంలో డిజిటల్ మోసాల ద్వారా రూ.54వేల కోట్లకు పైగా సొమ్ము దోపిడీకి గురికావడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది ముమ్మాటికీ "పచ్చి దోపిడీ, డెకాయిటీ" అని వ్యాఖ్యానించింది. ఇలాంటి కేసులను ఎదుర్కోవడానికి

## మావోయిజంతో వినాశనమే,
# మార్చి 31 కల్లా అంతం చేస్తాం

- మావోయిస్టులకు అమిత్ షా డెడ్‌లైన్- బస్తర్ ముఖచిత్రం మారుస్తామని హామీ
- ఆదివాసీ బిడ్డల చేతిలో ఆయుధాలు చూడలేకపోతున్నామని వ్యాఖ్య



ఢిల్లి : '(విజేత) : 'మావోయిజం ఏ సమాజానికి ఎప్పుడూ మేలు చేయలేదు. అది అడుగుపెట్టిన ప్రతిచోటా వినాశనం తప్ప అభివృద్ధిని కాంక్షించలేదు. కొలంబియా, పెరూ, కంబోడియా వంటి దేశాల చరిత్రే ఇందుకు నిదర్శనం. అందుకే చెబుతున్నా, మార్చి 31 నాటికి దేశం నుంచి నక్సలిజాన్ని సమూలంగా తుడిచిపెడతాం." అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా కేంద్రం జగదల్‌పూర్ లో సోమవారం జరిగిన 'బస్తర్ పాండుమ్-2026' ముగింపు ఉత్సవాల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ, నక్సల్స్ అంతానికి డెడ్‌లైన్ విధించారు.

### తుపాకీకి తుపాకీతోనే బదులు

అమిత్ షా తన ప్రసంగంలో మావోయిస్టులకు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. "మేము ఎవరితోనూ యుద్ధం చేయాలనుకోవడం లేదు. మా పోరాటం మా గిరిజన సోదరసోదరీమణుల రక్షణ కోసమే. కానీ ఎవరైనా చేతిలో ఆయుధం పట్టుకుంటే, వారికి ఆయుధంతోనే సమాధానం చెబుతాం. ఐఈడీలు అమర్చి అమాయక పిల్లల ప్రాణాలు తీస్తున్నారు. మిగతా..2లో

## సెషెల్స్‌కు భారత్
# భారీ ఆర్థిక చేయూత

## రూ.1500 కోట్ల స్పెషల్ ప్యాకేజీ ప్రకటించిన మోదీ

- సామాజిక గృహ నిర్మాణం, ఆరోగ్యం, రక్షణ, సముద్ర భద్రతకు నిధులు
- కొలంబో సెక్యూరిటీ కాన్‌క్లేవ్‌లో పూర్తి సభ్యత్వం పొందిన సెషెల్స్
- బ్లూ ఎకానమీ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, పునరుత్పాదక శక్తిలో సహకారం విస్తరణ



ఢిల్లి (విజేత) : : హిందూ మహాసముద్ర ప్రాంతంలో వ్యూహాత్మకంగా కీలకమైన సెషెల్స్‌కు భారత్ భారీ ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. దీంతో రెండు దేశాల మధ్య సంబంధాలు బలపడుతున్నాయి. అయితే ప్రధాని నరేంద్ర మోదీ, సెషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ మధ్య దిల్లీలో తాజాగా జరిగిన ద్వైపాక్షిక చర్చల అనంతరం 175 మిలియన్ మిగతా..2లో

## ప్రపంచంలోనే అతిపెద్ద అణు విద్యుత్ కేంద్రాన్ని పునఃప్రారంభించిన జపాన్




2

- ★అణు ఇంధనం వైపు జపాన్ మొగ్గు
- ★దీనికి ప్రధాని సనాయె తకాయిచి ఫుల్ సపోర్ట్

ఢిల్లి : జపాన్ సోమవారం నాడు ప్రపంచంలోనే అతి పెద్ద అణు విద్యుత్ కేంద్రాన్ని తిరిగి ప్రారంభించింది. గతంలో సాంకేతిక లోపం కారణంగా నిలిపివేసిన ప్రక్రియను అధిగమించి, ఈ భారీ ప్లాంట్ మళ్లీ విద్యుత్ ఉత్పత్తికి సిద్ధమైంది. 2011 ఫుకుషిమా విపత్తు తర్వాత ఈ ప్లాంట్‌ను పునఃప్రారంభించడానికి జనవరిలో మొదటిసారి ప్రయత్నించారు. అయితే, మానిటరింగ్ అలారం మోగడంతో భద్రతా కారణాల దృష్ట్యా ఆ ప్రయత్నాన్ని తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చింది. నియిగాటా ప్రాంతంలోని కాషివాజాకి-కరీవా ప్లాంట్‌లోని ఒక రియాక్టర్ సోమవారం మధ్యాహ్నం 2:00 గంటలకు తిరిగి ప్రారంభమైనట్లు టోక్యో ఎలక్ట్రిక్ పవర్ కంపెనీ (టీఈపీసీఓ) ఒక ప్రకటనలో తెలిపింది.

## తెలంగాణలో ముగిసిన
# ఎన్నికల ప్రచారం..

రాష్ట్రవ్యాప్తంగా 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు 11వ తేదీన పోలింగ్
ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 వరకు పోలింగ్
ఈ నెల 13న ఓట్ల లెక్కింపు




హైదరాబాద్ : (విజేత) :తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎల్లుండి పోలింగ్ జరగనుంది. ఈరోజుతో ప్రచారం ముగియడంతో రాష్ట్రంలో మైకులు మూగబోయాయి. ఈ నెల 11న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అనివార్యమైతే ఈ నెల 12న రీపోలింగ్ నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13 ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. గెలిచిన వారు మరుసటి రోజు వార్డు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేస్తారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగనుంది.

## ఏపీలో ఊపందుకున్న సాగునీటి ప్రాజెక్టులు
# 18 నెలల్లోనే రూ.23,793 కోట్ల ఖర్చు

- ●రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు మళ్లీ మంచిరోజులు
- ●ఎన్డీయే ప్రభుత్వంలో తొలి 18 నెలల్లో సాగునీటి రంగంపై రూ.23,793 కోట్లు ఖర్చు
- ●రూ.18 వేల కోట్ల పాత బిల్లులు క్రమేణా చెల్లింపులు



అమరావతి (విజేత) : : రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు మళ్లీ మంచిరోజులు వచ్చాయి. ఎన్డీయే ప్రభుత్వంలో తొలి 18 నెలల్లోనే సాగునీటి రంగంపై ఏకంగా రూ.23,793 కోట్లు ఖర్చు చేశారు. ఏపీలో వివిధ ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. అయితే ప్రాధాన్య క్రమంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలు ఇచ్చే ప్రాజెక్టులను మొదట పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో నిధుల కేటాయింపు, ఖర్చు, పర్యవేక్షణ, అవసరమైన సమస్యలను పరిష్కరించి నిర్దిష్ట గడువులోగా సంబంధిత పనులు పూర్తి చేసేవిధంగా ముందుకువెళ్తున్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఒక్క జలవనరుల శాఖలోనే ఏకంగా రూ.18 వేల కోట్ల బిల్లులు పెండింగులో పెట్టి వెళ్లింది. ఓ వైపు ఈ బిల్లులు చెల్లిస్తూనే మరోవైపు అనేక సాగునీటి ప్రాజెక్టులను గాడిలో పెడుతూ పనుల్లో వేగం సైతం పెంచారు. మిగతా..2లో

మొదటి పేజీ తరువాయి

## అన్నమయ్య జిల్లాలో బర్డ్ ఫ్లూ కలకలం.. 24 వేల కోళ్ల మృతి

సదుం మండలంలోని పుట్టవాండ్లపల్లె, కంభంవారిపల్లె, అమ్మగారిపల్లె గ్రామాల్లోని కోళ్ల ఫారాల్లో గత కొన్ని రోజులుగా కోళ్లు భారీ సంఖ్యలో చనిపోతున్నాయి. దీంతో అనుమానం వచ్చిన పశుసంవర్ధక శాఖ అధికారులు రంగంలోకి దిగారు. మరణించిన కోళ్ల నుంచి నమూనాలను సేకరించి మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఉన్న హై సెక్యూరిటీ యానిమల్ డిసీజ్ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపించారు. ఈ పరీక్షల్లో బర్డ్ ఫ్లూ వైరస్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. అమ్మగారిపల్లె, పుట్టవారిపల్లె గ్రామాల్లో కోళ్ల మృతికి బర్డ్ ఫ్లూనే కారణమని స్పష్టమైందని, కంభంవారిపల్లె నివేదిక రావాల్సి ఉందని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ గుణశేఖర్ పిళ్లై వెల్లడించారు. ఈ పరిణామాలపై జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బర్డ్ ఫ్లూ కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తరఫున నష్టపరిహారం అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు జిల్లా కేంద్రంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. తమ ప్రాంతంలో కోళ్లు గానీ, ఇతర పక్షులు గానీ అసాధారణ రీతిలో మరణిస్తే వెంటనే 70139 14401 లేదా 93982 62752 నంబర్లకు సమాచారం అందించాలని అధికారులు ప్రజలను కోరారు.

కోడి మాంసం తినొచ్చా?.. వైద్యులు ఏం చెబుతున్నారంటే!

మరోవైపు బర్డ్ ఫ్లూ విషయంలో ప్రజలు అనవసరంగా ఆందోళన చెందవద్దని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఈ వైరస్ కోళ్ల నుంచి మనుషులకు సోకే అవకాశాలు చాలా అరుదని స్పష్టం చేశారు. అయితే, మాంసాన్ని 100 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద బాగా ఉడికించి తినడం సురక్షితమని తెలిపారు. ముందుజాగ్రత్త చర్యగా, వైరస్ ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలు కనీసం 10 రోజుల పాటు కోడిమాంసం, గుడ్లకు దూరంగా ఉండటం మంచిదని సలహా ఇస్తున్నారు.

## బీఆర్ఎస్ నాయకులు ఇష్టారీతిన మాట్లాడుతున్నారని ఆగ్రహం

బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తే వచ్చేదేమీ లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కేసీఆర్ ఇప్పటి వరకు సభకు రాలేదని, ఇప్పుడు వార్డుల్లో బీఆర్ఎస్ వారిని గెలిపిస్తే వారు అభివృద్ధిని అడ్డుకుంటారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకుల్లో అహంకారం, విషం చిమ్మడం, విద్వేషపూరిత ప్రసంగాలు, రెచ్చగొట్టే మాటలు తప్ప ఏమీ లేదని అన్నారు. వారు స్థాయి మరిచి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ముఖ్య నాయకులు ఇష్టారీతిన మాట్లాడుతున్నారని, చూస్తుంటే వారి గురించి ఈగల్ టీమ్ గురించి చెప్పాలేమోనని అన్నారు. గంజాయి లేదా కొకైన్ తీసుకుని మాట్లాడుతున్నారా అని అడగాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. మానసిక రోగం, ఉన్మాదంతో అధికారంలో ఉన్నప్పుడు ఫోన్ ట్యాపింగ్ చేశారని అన్నారు. విచారణలో విస్తుపోయే విషయాలు వెలుగు చూస్తున్నాయని అన్నారు. బీఆర్ఎస్ 2014 నుంచి 2022 వరకు బీజేపీ తెచ్చిన ప్రతి చట్టానికి మద్దతు పలికిందని ఆరోపించారు. 2014 నుంచి 2021 వరకు రాజ్యసభలో బీజేపీకి మెజారిటీ లేదని, కానీ రైతు వ్యతిరేక నల్ల చట్టాలు, జీఎస్టీ, నోట్ల రద్దు వంటి చట్టాలకు బీఆర్ఎస్ మద్దతు తెలిపిందని గుర్తు చేశారు. నోట్ల రద్దు అద్భుతమని సభలో కేసీఆర్ చెప్పారని, జీఎస్టీని అభినందించారని అన్నారు. కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును ఏటీఎంగా మార్చుకున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారని, కానీ చర్యలేమీ తీసుకోలేదని అన్నారు.

## అన్న ఎన్టీఆర్‌ను, చంద్రబాబును చూశాం కానీ ఇలా ఎవరూ మాట్లాడలేదు

జిల్లాను ఆయన చేశాడా అని ప్రశ్నించారు. జిల్లాను రద్దు చేస్తే భూపాలపల్లి ప్రజలు వీపు చింతపండు చేస్తారని కేటీఆర్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తిడితే ఊరుకునేది లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. "నీ టైమ్ అంతా రెండేళ్లే. ఆ తర్వాత గులాబీ జెండా ఎగురుతుంది. ఆ తర్వాత నువ్వు పాతాళంలో దాక్కున్నా వదిలి పెట్టం, పొట్టోడా. కేసీఆర్‌తో పాటు మా కార్యకర్తలను అంటే ఊరుకునేది లేదు" అని అన్నారు. తిడితే తనను, ఇతర నాయకులను తిట్టుకోవచ్చని, కానీ కేసీఆర్‌ను, బీఆర్ఎస్ కార్యకర్తలను తిడితే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎంతమంది దేవుళ్లు ఉంటే అంతమంది దేవుళ్లను మొక్కుకున్నా అధికారంలోకి వచ్చాక వదిలి పెట్టేది లేదని అన్నారు. ఆయన పేరు అనుముల రేవంత్ రెడ్డి కాదని, లాగుల తొండల్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేతలు రాష్ట్రంలో పాలన పక్కకు పెట్టి కుంభకోణాలకు తెరలేపారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఇప్పటి వరకు ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని విమర్శించారు. సింగరేణిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బావమరిది కలిసి దోచుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే ప్రజలను ఆ పార్టీ నాయకులు ముంచుతారని హెచ్చరించారు. రూ.4 వేల పెన్షన్, తులం బంగారం, రైతుబంధు పెంపు ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడిస్తే హామీలు అమలవుతాయని ఓటర్లకు సూచించారు.

## బండి సంజయ్, గంగుల తీరుతో కరీంనగర్ అవినీతిమయమైంది

కాంగ్రెస్ పార్టీ రూ. 100 కోట్ల డీల్ చేసుకుందంటూ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. కరీంనగర్ కార్పొరేషన్ లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒప్పందం కుదుర్చుకున్నాయని పొన్నం మండిపడ్డారు. ఈ పార్టీల పరస్పర అవగాహనతోనే అభ్యర్థుల ఎంపిక జరిగిందని ఆరోపించారు. బండి సంజయ్, గంగుల కమలాకర్ తీరుతో జిల్లా అవినీతిమయంగా మారిందని అన్నారు. పదేళ్లలో కరీంనగర్ జిల్లా పూర్తిగా నిర్లక్ష్యానికి గురయిందని చెప్పారు. జిల్లా పరిధిలోని కొండగట్టు, వేములవాడ ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

## డిజిటల్ మోసాల కేసులను ఎదుర్కోవడానికి రూపొందించండి

ఆర్ బీఐ, బ్యాంకులు, టెలికాం శాఖలతో సంప్రదించి, ఒక పక్కా 'స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్' (ఎస్ ఓపీ) రూపొందించాలని కేంద్రాన్ని ఆదేశించింది.

చిన్న రాష్ట్రాల బడ్జెట్ కంటే ఎక్కువే!

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ ఎన్ వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం సుమోటోగా ఈ కేసు విచారణను చేపట్టింది. "బ్యాంకులు కేవలం లాభాపేక్షతో, వ్యాపార ధోరణిలో ఉండి, నేరగాళ్లు సులభంగా దోపిడీ సొమ్మును తరలించడానికి వేదికలుగా మారుతున్నాయి" అని జస్టిస్ బాగ్చీ అన్నారు. 2021 ఏప్రిల్ నుంచి 2025 నవంబర్ మధ్య మన దేశంలో ఏకంగా రూ.52వేల కోట్ల సైబర్ మోసాలు జరిగినట్లు హోంశాఖ నివేదిక పేర్కొన్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇది 'అనేక రాష్ట్రాల వార్షిక బడ్జెట్ కంటే ఇది చాలా ఎక్కువ మొత్తం' అని సీజేఐ సూర్యకాంత్ అన్నారు.

కాగా, ఈ డిజిటల్ మోసాలు బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం వల్ల లేదా నేరగాళ్లతో సహకరించడం వల్ల జరిగి ఉండవచ్చని ధర్మాసనం అనుమానం వ్యక్తం చేసింది. డిజిటల్ అరెస్టుల పట్ల ఆర్‌బీఐ, బ్యాంకులు సకాలంలో స్పందించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది.

సుప్రీంకోర్టు ఆదేశాలు

ఆర్‌బీఐ, టెలికాం శాఖ రూపొందించిన నిబంధనలను పరిగణనలోకి తీసుకుని, ఈ నేరాలను సమర్థవంతంగా అరికట్టడానికి నాలుగు వారాల్లోగా ఒక ముసాయిదా ఒప్పందాన్ని సిద్ధం చేయాలని హోం మంత్రిత్వ శాఖను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. అలాగే దేశవ్యాప్తంగా నమోదైన డిజిటల్ అరెస్ట్ కేసులను గుర్తించాలని సీబీఐని ఆదేశించింది. అలాగే, ఈ కేసుల్లో విచారణ జరిపేందుకు సీబీఐకి అవసరమైన అనుమతులను వెంటనే మంజూరు చేయాలని ఢిల్లీ, గుజరాత్ ప్రభుత్వాలకు స్పష్టం చేసింది. డిజిటల్ అరెస్ట్ బాధితులకు పరిహారం అందించే విషయంలో ఉదారంగా, ఆచరణాత్మక దృక్పథంతో వ్యవహరించాలని సుప్రీంకోర్టు సూచించింది. పరిహారం చెల్లింపుపై ఒక ఫ్రేమ్‌వర్క్ సిద్ధం చేయడానికి ఆర్‌బీఐ, టెలికాం శాఖ సంయుక్తంగా సమావేశం కావాలని ఆదేశించింది.

## ప్రపంచంలోనే అతిపెద్ద అణు విద్యుత్ కేంద్రాన్ని పునఃప్రారంభించిన జపాన్

2011లో సంభవించిన భారీ భూకంపం, సునామీ కారణంగా ఫుకుషిమా ప్లాంట్‌లోని 3 రియాక్టర్లు కరిగిపోయి అణు ప్రమాదం సంభవించింది. దీంతో జపాన్ దేశవ్యాప్తంగా అణు విద్యుత్ కేంద్రాలను మూసివేసింది. అయితే, ప్రస్తుతం శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని జపాన్ నిర్ణయించింది. 2050 నాటికి 'కార్బన్ న్యూట్రాలిటీ' సాధించడానికి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అవసరాలకు పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోవడానికి జపాన్ మళ్లీ అణుశక్తి వైపు మొగ్గు చూపుతోంది.

రాజకీయ మద్దతు

జపాన్ పార్లమెంటరీ ఎన్నికల్లో ప్రధాని సనాయే తకాయిచి నేతృత్వంలోని సంకీర్ణ కూటమి అఖండ విజయం సాధించింది. మొత్తం 465 సీట్లున్న దిగువ సభకు ఆదివారం ఎన్నికలు జరగగా, అధికార కూటమి మూడింట రెండు వంతులకుపైగా సీట్లు దక్కించుకుంది. ఇప్పటి వరకు అందిన వివరాల ప్రకారం, ఎల్ డీపీ 316 సీట్లలో విజయ దుందుభి మోగించింది. జపాన్ తొలి మహిళా ప్రధాని అయిన తకాయిచి, గత అక్టోబర్ లో పీఎంగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఆమె ఇప్పుడు జపాన్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు అణు విద్యుత్తును ఉత్పత్తిని చేయాలని నిర్ణయించి, దాన్ని ప్రోత్సహిస్తున్నారు.

త్వరలోనే వాణిజ్య కార్యకలాపాలు!

జనవరి 21న ప్రారంభించిన ఒక రియాక్టర్, కేబుల్‌లోని విద్యుత్ ప్రవాహంలో స్వల్ప మార్పుల వల్ల అలారం మోగడంతో మరుసటి రోజే దానిని నిలిపివేశారు. అయితే ఆ మార్పులు సురక్షిత పరిమితిలోనే ఉన్నాయని, భద్రత దృష్ట్యా అలారం సెట్టింగులను మార్చామని టెప్కో (టీఈపీసీఓ) అధికారులు తెలిపారు. మార్చి 18 లేదా ఆ తర్వాత సమగ్ర తనిఖీ ముగిశాక పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. వాస్తవానికి కాషివాజాకి-కరీవా ప్లాంట్‌లో మొత్తం ఏడు రియాక్టర్లు ఉండగా, ప్రస్తుతం ఒక దానిని మాత్రమే

# రాష్ట్రంలో భానుడి భగభగలు

మొదటి పేజీ తరువాయి

కావలిలో అత్యధికంగా 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలోని దక్షిణ కోస్తాలో రాబోయే 2 రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2-3 డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. రాయలసీమలోని జిల్లాల్లో మాత్రం కనిష్ఠ ఉష్ణోగ్రతలు 2-4 డిగ్రీలు తగ్గొచ్చని పేర్కొంది. బాపట్ల, నరసాపురం, కావలి, ఒంగోలు తదితర ప్రాంతాల్లో సాధారణం కంటే 2-4 డిగ్రీలు ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఆంధ్రప్రదేశ్ లోని ఉత్తర కోస్తా జిల్లాలు, కేంద్రపాలిత ప్రాంతం యానాంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2-3 డిగ్రీలు సాధారణం కంటే ఎక్కువగా, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 2-4 డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని అంచనా వేస్తోంది. గత ఏడాది కూడా: గత ఏడాది కూడా ఫిబ్రవరి నెల మొదటి వారంలోనే ఎండలు విజృంభించాయి. అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సగటు ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి. ఏటా మార్చి-ఏప్రిల్‌లో మంట పుట్టించే ఎండలు ముందే చుక్కలు చూపించాయి. ఫిబ్రవరి మొదటి వారం దాటకముందే, శివరాత్రికి శివ శివ అంటూ చలి సెలవు తీసుకోక ముందే సూర్యుడు చెలరేగి పోయాడు. అప్పట్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి. అసాధారణ వేడి ఉక్కపోతే ఉక్కిరిబిక్కిరి చేశాయి.

### అమెరికాలోని 10 రాష్ట్రాల్లో ట్రంప్ 'ఎమర్జెన్సీ' ప్రకటన- 14వేలకు పైగా విమానాల రద్దు

శరీరాన్ని చల్లబర్చుకోవడానికి: ప్రస్తుతం గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35డిగ్రీలకు మించి నమోదవుతున్నాయి. మరో ఐదారు డిగ్రీలు పెరిగితే అడుగు బయటకు పెట్టే పరిస్థితి ఉండదు. చలికాలంలో కాస్త రిలాక్స్ కోసం టీ, కాఫీ తీసుకోవడం సహజమే. ఎండాకాలంలో ఉపశమనం ప్రకృతి సిద్ధమైన పానీయాలు తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. టీ, కాఫీ బదులు పళ్ల రసాలు, పానీయాలు తీసుకోవడం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుందని చెబుతున్నారు.

### "లంబసింగి"లో అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు - దేశంలో శీతల గ్రామం ఎక్కడుందో తెలుసా?

ఎండాకాలంలో ఎక్కడెక్కడో పని చేసుకొని ఇంటికి వచ్చేసరికి అలసట వచ్చేస్తుంది. చిన్న చిన్న పనులకే నీరసపడిపోతుంటాం. అలవాటు ఉన్న వాళ్లు అలసట బారి నుంచి ఉపశమనం పొందడానికి టీ, కాఫీ తీసుకుంటారు. కానీ వేసవిలో వేడి పదార్థాలు పెద్దగా రుచించవు. కాస్త చల్లచల్లగా ఏవైనా పళ్లరసాలు తీసుకుంటే బాగుంటుంది అనిపిస్తుంది. సహజ పానీయాలైన పళ్ల రసాలను తీసుకోవడమే మంచిదని, తద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయని, అలసట దూరమవుతుందని నిపుణులు సూచిస్తున్నారు. కొబ్బరి నీళ్లు: వేసవి దాహార్తి తీర్చుకోవడంలో చాలా మంది కొబ్బరి నీళ్లకే మొగ్గు చూపుతారు. ప్రకృతి సిద్ధమైన కొబ్బరి నీళ్లు శరీరానికి ఎంతో మేలు చేయడంతో పాటు శరీరాన్ని నాజూగ్గా ఉంచడంలో సహకరిస్తాయి. బాగా అలసటగా అనిపించినప్పుడు కొబ్బరి నీళ్లలో నిమ్మరసం, తేనె, పుదీనా లేదా కొత్తిమీర, సబ్జా గింజలు వేసుకుని తాగితే చాలు. నోటికి రుచిగా ఉండడంతో పాటు అలసటను తగ్గించడంలో కొబ్బరినీళ్లు మేలు చేస్తాయి.

# స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 'కు అడ్డుపడే చట్టాలను సవరిద్దాం

మొదటి పేజీ తరువాయి

చర్యలు చేపడుతున్నట్లు సీఎం తెలిపారు. ప్రపంచం గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ వైపు మళ్లుతోందని, అమరావతి కేంద్రంగా రెండేళ్లలో క్వాంటం కంప్యూటర్లు ఇక్కడి నుంచే తయారు చేస్తామని, ప్రపంచానికి అందిస్తామని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ఏఐ, క్వాంటం కంప్యూటర్లు, డేటా సెంటర్లతో పెనుమార్పులు వస్తాయన్నారు. ప్రతినెలా 8న కేపీఐల ఆధారంగా జీఎస్‌డీపీ రూపొందించాలని అధికారులుకు సూచించారు. 2019-24 మధ్య ఆర్థిక క్రమశిక్షణ దెబ్బతీశారన్న చంద్రబాబు, జీతాలు కూడా మొదటి తేదీకి ఇవ్వలేని పరిస్థితి ఉండేదని దుయ్యబట్టారు. ఇప్పుడు జీతాల చెల్లింపులను గాడిలో పెట్టడంతో పాటు సూపర్ సిక్స్ పథకాలు కూడా అమలు చేయాల్సి ఉందని తేల్చిచెప్పారు. అల్లూరి జిల్లాలో లంబసింగి కుంకుమ పువ్వు ఉత్పత్తి అయితే అది దేశవ్యాప్త న్యూస్ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏలూరు దగ్గర కోకో సిటీ కూడా ఏర్పాటు అవుతుందని తెలిపారు. కాఫీ సాగు పెంచటంతో పాటు అరకు కాఫీ బ్రాండ్ ను కూడా బాగా ప్రమోట్ చేయాలని కోరారు. బ్యాంకర్లు చారిటీ కోసం రుణాలు ఇవ్వరు: ప్రతీ ఐదేళ్లకూ జీఎస్డీపీ, తలసరి ఆదాయం రెట్టింపు అయ్యేలా ప్రణాళికలు చేపట్టాలని సూచించారు. తలసరి ఆదాయం ప్రజల జీవన ప్రమాణాలకు ప్రతీకగా నిలుస్తుందని వెల్లడించారు. కీ-పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల విషయంలో జాగ్రత్తగా అంచనాలు వేయాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి నుంచి తీసుకునే సమాచారం ఒకటికి రెండు మార్లు పరిశీలన చేసుకోవాలన్నారు. గత పాలకులు చేసిన అప్పుల కారణంగా 14 శాతం వడ్డీ చెల్లిస్తున్నామని ధ్వజమెత్తారు. ఏపీ క్రెడిట్ రేటింగ్ పెంచుకుని వడ్డీ తగ్గించుకునేలా రుణాల రీషెడ్యూలు చేస్తున్నామని సీఎం వెల్లడించారు. బ్యాంకర్లు ఎవరూ చారిటీ కోసం రుణాలు ఇవ్వరని వ్యాఖ్యానించారు. నిర్దేశించుకున్న లక్ష్యాలు పూర్తి చేసే విషయంలో ఎలాంటి రాజీలేదు. సాంకేతికంగా ముందంజలో ఉన్నామే కానీ ఎక్కడా వెనుకబడి లేము. ప్రతినెలా 8న కేపీఐల ఆధారంగా జీఎస్‌డీపీ రూపొందించాలి. 19 నెలల్లో అగాధం, అంధకారం నుంచి రాష్ట్రాన్ని బయటపడేశాం. మూడు నెలలకోసారి ప్రభుత్వ ప్రగతి పనుల పురోగతిపై బేరీజు వేస్తున్నాం. సంక్షేమ పథకాలు అవసరమా? అనే చర్చ సరి కాదు. పేదలను ఆదుకునేందుకు సంక్షేమ పథకాలు అవసరమే. నెలవారీగా సమీక్షలు చేస్తూ క్షేత్రస్థాయిలో పనులు బేరీజు వేసుకోవాలి. కలెక్టర్లు, ఇన్‌ఛార్జ్ మంత్రులు క్షేత్రస్థాయిలో పనులు జరిగేలా చూడాలి. ఏపీలో కార్యక్రమాలు, టెక్నాలజీ వినియోగం ఎలా ఉందో అంచనా వేయాలి చట్టాలన్నీ సవరించుకుని అనవసరమైనవి తొలగించనున్నట్లు సీఎం తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు అడ్డుపడే చట్టాలను అసెంబ్లీలో సవరిద్దామన్నారు. ప్రస్తుతం వృద్ధిరేటు 9.88 శాతం ఉండగా త్వరలో డబుల్ డిజిట్ సాధించాలని సీఎం ఆదేశించారు. సాగునీటి కోసం ఇప్పటివరకూ రూ.24 వేల కోట్లు ఖర్చు చేశామని, విశాఖలో గూగుల్‌తో పాటు ఇతర సంస్థలు డేటా సెంటర్ల ఏర్పాటు చేస్తున్నాయని, విద్యుత్ రంగంలో ట్రూఅప్ నుంచి ట్రూడౌన్ చేసే పరిస్థితికి వచ్చినట్లు ఆయన వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల బాటలో నడుస్తుందన్నారు. రూ.వెయ్యి కోట్లతో రోడ్ల మరమ్మతులు, మరో రూ.3 వేల కోట్లతో నిర్మాణాలు చేపట్టినట్లు సీఎం వివరించారు. వచ్చే మూడేళ్లలో మోస్ట్ లివబుల్ సిటీగా అమరావతిని మారుస్తామని స్పష్టం చేశారు. మార్చిలోపు ఆ సమస్యలు తీర్చాలి: రైతులకు గిట్టుబాటు ధర కింద రూ.1100 కోట్లు ఖర్చు పెట్టినట్లు చంద్రబాబు తెలిపారు. అస్తవ్యస్తం చేసిన రెవెన్యూ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు సమస్యలు పడుతున్నామన్నారు. ఆనాటి సీఎం ఇంటి పక్కన హెలిప్యాడ్ కోసం ప్రైవేటు వ్యక్తి స్థలం ఇవ్వకపోతే అతని ఇంటిని 22ఏ కింద పెట్టారన్నారు. దానిపై ఫిర్యాదు చేస్తే పరిశీలిస్తున్నట్లు సీఎం వివరించారు. ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర నిర్వహిస్తున్నామని, గుట్టలుగా పేరుకుపోయిన అక్రమాల చెత్తను మార్చిలోపు తొలగించాలి సీఎం అధికారులకు సూచించారు. కొందరు మంత్రులు, అధికారులే కాదు అందరూ పనిచేస్తే మంచి ఫలితాలు అందుతాయని సీఎం సూచించారు. ప్రభుత్వ పాలసీల వల్ల అనుకున్న లక్ష్యాలను నెరవేరుస్తున్నామని, సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ప్రాధాన్యంగా సాగుతున్నట్లు సీఎం పేర్కొన్నారు.

# ఏపీలో ఊపందుకున్న సాగునీటి ప్రాజెక్టులు - 18 నెలల్లోనే రూ.23,793 కోట్ల ఖర్చు

మొదటి పేజీ తరువాయి

2014-19 మధ్య రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు స్వర్ణయుగంగా పేర్కొంటారు. ఎందుకుంటే ఆ ఐదు సంవత్సరాల్లోనే రూ.11 వేల కోట్ల వరకు నీరు ప్రగతి పనులకు, మరో రూ.50 వేల కోట్లకు పైగా జలవనరుల శాఖకు ప్రభుత్వం ఖర్చు చేసింది. ప్రస్తుతం మళ్లీ ఆ దిశగా పనులు ఊపందుకున్నాయి. కుప్పానికి తొలిసారి నీరు : హంద్రీ-నీవా కాలువ రాయలసీమలోని ఉమ్మడి జిల్లాల్లో పరుగులు తీస్తుంది. కృష్ణా వరద జలాలను 738 కిలోమీటర్ల వరకు తీసుకెళ్తుంది. కేవలం 2,200 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న ఈ కాలువను వెడల్పు చేయడంతో పాటు లైనింగు పనులు సైతం చేసి దాని ప్రవాహ సామర్థ్యం 3,850 క్యూసెక్కులకు పెంచారు. ఈ పనుల కోసం రూ.3,500 కోట్లను ఖర్చు చేశారు. ఈ కాలువ ద్వారా రాయలసీమలోని జిల్లాలకు ఈ సంవత్సరం 43 టీఎంసీలకు పైగా జలాలను విడుదల చేశారు. అందుభాగంగా కుప్పానికి మొదటిసారి నీటిని అందించారు. పునరావాసానికి రూ. వెయ్యి కోట్లు : అదేవిధంగా వెలిగొండ ప్రాజెక్టు మొదటిదశ పూర్తి చేయాలంటే ఇంకా నిర్మాణ పనులకోసం రూ.2,000 కోట్లకు పైగా ఖర్చు చేయాల్సిఉంది. అలాగే పునరావాసానికి దాదాపు రూ. వెయ్యి కోట్లు కావాలి. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక టన్నెళ్ల తవ్వకాల్లోని పెండింగు పనులతో పాటు లైనింగు పనుల వేగాన్ని సైతం పెంచారు. హెడ్ రెగ్యులేటర్ పనులను చేస్తున్నారు. 18 నెలల్లో 3,708 మీటర్ల మేర టన్నెల్ లైనింగు పూర్తయింది. ఫీడర్ కాలువ మరమ్మతులు లైనింగు కోసం ఏకంగా రూ.456 కోట్లు విడుదల చేశారు. ఎన్డీయే ప్రభుత్వంలో వెలిగొండపై ఇప్పటివరకు రూ.571 కోట్లను ఖర్చు చేశారు. పోలవరం ఎడమ కాలువ పనులు సైతం వేగవంతమయ్యాయి. ఈ ప్రాజెక్టులో గత వైఎస్సార్సీపీ హయాంలో ఒక్క శాతం పనులు కూడా చేయలేదు. ఓ వైపు ప్రధాన డ్యాం నిర్మిస్తున్నా ఎడమ కాలువ పనులు చేయకపోతే ఎలాంటి ఉపయోగం ఉండదు. ఎన్డీయే ప్రభుత్వంలో రూ.1,226 కోట్లతో కాలువలో వివిధ ప్యాకేజీలకు టెండర్లు పిలిపించి పనుల వేగాన్ని పెంచారు. ఇప్పటివరకు రూ.900 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. 'జిందాల్' సహకారంతో అక్కడ స్టాప్ లాగ్ : అలాగే 2024 ఆగస్టు నెలలో తుంగభద్ర ప్రాజెక్టులో 19వ గేటు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ప్రాజెక్టుల మరమ్మతుల నిపుణుడు కన్నయ్యానాయుడిని పిలిపించి రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడింది. చివరికి 'జిందాల్' సహకారంతో అక్కడ స్టాప్ లాగ్ గేటును యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేశారు. దీంతో నీళ్లు వృథా కాకుండా అడ్డుకోగలిగారు. అక్కడ 33 గేట్ల కాలపరిమితి ముగిసిపోవడంతో కొత్తగా గేట్లు ఏర్పాటు చేసేందుకు రూ.55 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. పనులు సైతం ప్రారంభమయ్యాయి. గత వైఎస్సార్సీపీ హయాంలో కాలువ, నది వరద కట్టలకు ఎలాంటి మరమ్మతులు లేవు. ప్రాజెక్టుల నిర్వహణకూ నిధులు కూడా ఇవ్వలేదు. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం ధవళేశ్వరం బ్యారేజి, తుంగభద్ర డ్యాం, శ్రీశైలం రిజర్వాయర్, మైలవరం, గుండ్లకమ్మ, సోమశిల, గోరకల్లు, కండలేరు, అవుకు వంటి ప్రాజెక్టుల మరమ్మతులకు తొలి విడతగా రూ.610 కోట్లతో పనులు చేపట్టింది. అదేవిధంగా కాలువల పూడిక తీత, కాలువల లాకులు, నిర్వహణ, ఇతర నిర్మాణాల నిర్వహణ, మరమ్మతులకు సంబంధించి గడిచిన 2 సంవత్సరాల్లో 11,359 పనులకు రూ.878 కోట్లు కేటాయించింది. ఇప్పటికే రూ.400 కోట్లను సైతం వరకు ఖర్చు చేశారు. చింతలపూడి ఎత్తిపోతల పనులకు జాతీయ హరిత ట్రైబ్యునల్ నుంచి ఎలాంటి అనుమతులు లేవు. తాజాగా సుప్రీంకోర్టు తీర్పుతో ఈ ఇబ్బందులు తొలిగాయి.

# సెషెల్స్‌కు భారత్ భారీ ఆర్థిక చేయూత

మొదటి పేజీ తరువాయి

అమెరికన్ డాలర్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించారు. ఆ నిధులతో సెషెల్స్‌లో అభివృద్ధి, భద్రత, మౌలిక సదుపాయాల రంగాల్లో కీలక ప్రాజెక్టులు చేపట్టనున్నారు.

### సెషెల్స్ భారత్‌కు కీలక సముద్ర పొరుగుదేశం

అయితే ఆరు రోజుల భారత పర్యటనలో భాగంగా హెర్మినీ మోదీతో సోమవారం మధ్యాహ్నం విస్తృతంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా వాణిజ్యం, ఆర్థికాభివృద్ధి, సముద్ర భద్రత, సస్టైనబిలిటీ, వాతావరణ మార్పులకు అనుగుణ చర్యలు వంటి అంశాల్లో సహకారాన్ని పెంచుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. సెషెల్స్ భారత్‌కు కీలక సముద్ర పొరుగుదేశమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

### భౌగోళిక సంబంధమే కాదు!

"భారత్- సెషెల్స్ బంధం భౌగోళిక సంబంధమే కాదు, చరిత్ర, విశ్వాసం, భవిష్యత్ దృష్టితో కూడిన భాగస్వామ్యం. సెషెల్స్ అవసరాల ప్రకారం అభివృద్ధి సహకారం అందిస్తున్నాం" అని మోదీ తెలిపారు. ప్రకటించిన 175 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.15,87,43,37,500) ప్యాకేజీ ద్వారా సామాజిక గృహ నిర్మాణం, ఈ-మొబిలిటీ, వృత్తి శిక్షణ, ఆరోగ్య సేవలు, రక్షణ, సముద్ర భద్రత రంగాల్లో ప్రాజెక్టులు అమలు చేయనున్నట్లు ప్రధాని చెప్పారు.

### ఇరు దేశాల సంబంధాల్లో ప్రధాన స్తంభాలు

రక్షణ సహకారం, సముద్ర భద్రత ఇరు దేశాల సంబంధాల్లో ప్రధాన స్తంభాలని మోదీ స్పష్టం చేశారు. సెషెల్స్‌ను కొలంబో సెక్యూరిటీ కాన్‌క్లేవ్‌లో పూర్తి సభ్యదేశంగా స్వాగతించారు. దీని వల్ల హిందూ మహాసముద్రంలో శాంతి, స్థిరత్వం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. బ్లూ ఎకానమీ రంగంలో భాగస్వామ్యాన్ని విస్తరించేందుకు నిర్ణయం తీసుకున్నారు. సముద్ర పరిశోధన, డేటా షేరింగ్, సామర్థ్యాభివృద్ధి రంగాల్లో భారత్ తన నైపుణ్యాన్ని పంచుకోనుంది. పునరుత్పాదక శక్తి, వాతావరణ అనుకూల పరిష్కారాల్లో కూడా సహకారం పెంచాలని నిర్ణయించారు.

### అ అంశాల్లో ఒప్పందాలు ఖరారు

డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో భారత్ సాధించిన విజయాలను సెషెల్స్‌తో పంచుకుంటామని ప్రధాని మోదీ చెప్పారు. చౌకగా నాణ్యమైన ఔషధాల సరఫరా, ఆరోగ్య మౌలిక సదుపాయాల అభివృద్ధి, మెడికల్ టూరిజం ప్రోత్సాహం వంటి రంగాల్లో కలిసి పనిచేయనున్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాలు పలు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఫార్మాకోపీయల్ సహకారం, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు, డిజిటల్ పరిష్కారాల జ్ఞాన భాగస్వామ్యం, ఆహార సరఫరా ఒప్పందాలు తదితర అంశాల్లో ఒప్పందాలు జరిగాయి.

### గాంధీజీ సిద్ధాంతాలు భారత్ సెషెల్స్ భాగస్వామ్యానికి మార్గదర్శకం

ప్రజల మధ్య సంబంధాలే ఇరు దేశాల బలమని మోదీ అన్నారు. సెషెల్స్‌లో నివసిస్తున్న భారతీయులు అక్కడి సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. తరతరాలుగా స్నేహబంధాన్ని వారు మరింత బలపరుస్తున్నారని తెలిపారు. పర్యటనలో భాగంగా అధ్యక్షుడు హెర్మినీ రాజ్‌ఘాట్‌లో మహాత్మా గాంధీకి నివాళులు అర్పించారు. గాంధీజీ సిద్ధాంతాలు భారత్ సెషెల్స్ భాగస్వామ్యానికి మార్గదర్శకంగా ఉన్నాయని విదేశాంగ శాఖ పేర్కొంది.

### దౌత్య సంబంధాలకు 50 సంవత్సరాలు

కాగా, 2025 అక్టోబరులో పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత హెర్మినీకి ఇదే తొలి భారత పర్యటన. అంతేకాకుండా ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలకు 50 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంలో ఆయన పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. తాజా ఆర్థిక ప్యాకేజీ, కొత్త ఒప్పందాలతో భారత్ సెషెల్స్ దేశాల మధ్య సంబంధాలు మరింత బలపడుతూ కొత్త దశలోకి అడుగుపెడుతున్నట్లు తెలుస్తోంది.

# మావోయిజంతో వినాశనమే, మార్చి 31 కల్లా అంతం చేస్తాం

మొదటి పేజీ తరువాయి

పాఠశాలలను, ఆసుపత్రులను తగులబెడుతున్నారు. ఇంతటి క్రూరత్వం ఎక్కడి నుంచి వచ్చింది? సాయుధ పోరాటాన్ని ప్రభుత్వం ఉక్కుపాదంతో అణిచివేస్తుంది" అని ఆయన తేల్చిచెప్పారు.

### ఆడబిడ్డల చేతుల్లో తుపాకులా?

నక్సల్స్ దళాల్లో ఉన్న గిరిజన యువతుల గురించి అమిత్ షా ఆవేదన వ్యక్తం చేశారు. "మావోయిస్టుల్లో ఇంకా మిగిలి ఉన్నవారిలో చిన్న వయసు గిరిజన బాలికలు కూడా ఉన్నారు. వారి చేతుల్లో తుపాకులు చూడటం బాధాకరం. వారి ముందు ఇంకా ఎంతో జీవితం ఉంది. వారంతా ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాలి. లొంగిపోయిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. వారికి ఎలాంటి హానీ జరగదు" అని భరోసా ఇచ్చారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'పునరావాస విధానం' దేశంలోనే అత్యుత్తమమైనదని ఆయన కితాబిచ్చారు.

### అభివృద్ధి పథంలో బస్తర్

మావోయిస్టుల వల్ల దశాబ్దాలుగా నష్టపోయిన బస్తర్ ప్రాంతం ఇప్పుడు అభివృద్ధి వైపు పరుగులు పెడుతోందని షా పేర్కొన్నారు. "మావోయిస్టులు దశాబ్దాల పాటు స్కూళ్లను మూసివేసి, ఒక తరాన్ని చదువుకు దూరం చేశారు. కానీ ఇప్పుడు బస్తర్ మారుతోంది. మూసివేసిన బడులు తెరుచుకుంటున్నాయి. రోడ్లు వేస్తున్నాం. మొబైల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నాం. పోస్టాఫీసులు, బ్యాంకులు ప్రతి 5 కిలోమీటర్లకు ఒకటి చొప్పున ఏర్పాటు చేస్తున్నాం. డిసెంబర్ 2027 నాటికి బస్తర్ ప్రాంతంలోని 7 జిల్లాల్లోని ప్రతి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పిస్తాం" అని హామీ ఇచ్చారు. వచ్చే ఐదేళ్లలో దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన గిరిజన ప్రాంతంగా బస్తర్‌ను మారుస్తామన్నారు.

### వరాల జల్లు

గిరిజనుల ఆర్థికాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలను షా వివరించారు. "గిరిజనుల నుంచి క్వింటాల్ వరిని రూ.3,100కు కొనుగోలు చేస్తాం. ప్రతి ఇంటికీ వంట గ్యాస్ సిలిండర్, కుళాయి నీటి కనెక్షన్ ఇస్తాం. ఇంద్రావతి నదిపై కొత్త సాగునీటి ప్రాజెక్టుల ద్వారా దంతెవాడ, బీజాపూర్, సుక్మా జిల్లాల్లో 2.75 లక్షల హెక్టార్లకు నీరు అందిస్తాం. బస్తర్‌లో 118 ఎకరాల్లో కొత్త పారిశ్రామిక



వాడను ఏర్పాటు చేసి గిరిజన యువతకు ఉపాధి కల్పిస్తాం. అడ్వెంచర్ టూరిజం, హోమ్‌స్టేలు, గ్లాస్ బ్రిడ్జిల ద్వారా పర్యాటకాన్ని పెంచుతాం" అని చెప్పారు.

### రాష్ట్రపతి భవన్‌కు ఆహ్వానం

బస్తర్ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పడమే ప్రధాని మోదీ లక్ష్యమని షా అన్నారు. తుపాకులు, పేలుడు పదార్థాలు బస్తర్ గుర్తింపు కాదని, ఇక్కడి సంస్కృతే అసలైన గుర్తింపు అని ఉద్ఘాటించారు. 'బస్తర్ పాండుమ్' ఉత్సవాల్లోని 12 విభాగాల్లో గెలుపొందిన టాప్-3 విజేతలను రాష్ట్రపతి భవన్‌కు ఆహ్వానిస్తామని, అక్కడ వారు తమ కళలను ప్రదర్శించి విందులో పాల్గొంటారని ప్రకటించారు. పోలీసుల త్యాగాలను స్మరిస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

# 7వ వార్డులో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**విజేత,పరకాల :** పరకాల మున్సిపాలిటీలోని 7వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పావుశెట్టి సునీల్ గెలుపు కోసం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల సమస్యలపై అవగాహన కలిగి, వార్డు అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లే సత్తా ఉన్న నాయకుడు పావుశెట్టి సునీల్ అని అన్నారు.గెలుపు దిశగా ధీమాగా అడుగులు వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి సునీల్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, వార్డు అభివృద్ధి సాధనకై హస్తం గుర్తుకు ఓటు వేసి సునీల్‌ను గెలిపించాలని ప్రజలను ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి కోరారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని, 7వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధి చేయడానికి వస్తున్న ఆశీర్వదించండి

### కాంగ్రెస్ పార్టీ బలపరిచిన 14 వ వార్డు అభ్యర్థి తాళ్ల శ్రీశైలం.





**విజేత, ఇబ్రహీంపట్నం :-** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ 14 వ వార్డు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి తాళ్ల శ్రీశైలం గౌడ్ వార్డు ప్రజలందరూ "హస్తం" గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. శేరిగూడ వాసిగా మీ బిడ్డగా మీ ముందుకు వస్తున్న, అభివృద్ధి చేయడానికి వస్తున్న ఆశీర్వదించండి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అనునిత్యం ప్రజాసేవకై ప్రజాప్రతినిధిగా ఉన్న నన్ను కౌన్సిలర్ గా గెలిపిస్తే పెద ప్రజల కోసం విద్య, వైద్యం, చేయూత, అభివృద్ధి మా ప్రధాన లక్ష్యం ప్రతి 3 నెలలకు ఒకసారి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి, పరీక్షలు, అవసరమైన మందులు పంపిణీ. ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న నిరుపేద విద్యార్థులకు ఉచిత నోట్ బుక్స్, బ్యాగులు, పెన్నులు ఉచిత పంపిణీ, అర్హులైన నిరుపేద ఆడబిడ్డల వివాహ కానుకగా మా సొంత నిధులతో "సరస్వతి కళ్యాణ లక్ష్మి" పథకం ద్వారా 20,116 /- ఆర్థిక చేయూత, మీ ప్రమాదవశాత్తు గాని, సహజ మరణం గాని జరిగిన నిరుపేద కుటుంబాలకు 10,000/- ఆర్థిక చేయూత. టీ వార్డులో ఉన్న డ్రైనేజ్ మరియు సీసీ రోడ్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించడం, మీ వార్డులో వీధి దీపాలు, విద్యుత్ స్థంభాల మరమ్మతులు చేసి, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు చేయడం, 3 వార్డులో ఉన్న దేవాలయాలు, మసీదు సుందరీకరణకు సహకారం, యువతకు క్రీడా కార్యకలాపాల కోసం పూర్తి సహకారం అందించడం. స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహాయ సహకారాలు ఎల్లప్పుడూ మీ అందుబాటులో ఉంటూ నీకోసం సేవ చేయడానికి వస్తున్న హస్తం గుర్తుపై ఓటు వేసి నన్ను అత్యధిక భారీ మెజారిటీతో గెలిపించాలని వార్డు వేడుకున్నారు.

# చిన్నారిపై అత్యాచార ఘటన దిగ్భ్రాంతికి గురిచేసింది..

### ఎమ్మెల్యేగండ్ర సత్యనారాయణ రావు..



**విజేత:జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** జయ శంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం పొనగండ్ల గ్రామానికి చెందిన చిన్నారిపై జరిగిన అత్యాచార ఘటన దిగ్భ్రాంతికి గురి చేసిందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని మరియు వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అభం శుభం తెలియని చిన్నారిపై ఈ ఘటన జరగడం అత్యంత హేయమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే అన్నారు. నిందితులకు త్వరలోనే చట్టపరంగా కఠిన శిక్షపడేలా చూడాలని జిల్లా ఎస్పీకి సూచించారు.

# అభివృద్ధి చేసే పార్టీని గెలిపించండి..

### ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి



**విజేత దేవరకద్ర :** అభివృద్ధి చేసే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా చివరి రోజు కావడంతో సోమవారం. ఆయన దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులతో, నాయకులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించి పట్టణ ప్రవీదుల గుండా తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. అనంతరం పాత బస్టాండ్ దగ్గర ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన రెండేళ్లలో రాష్ట్రంలో ఎంత అభివృద్ధి చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకు ఒకటి ఒకటి నెరవేర్చుకుంటూ వస్తున్నామన్నారు. దేవరకద్ర ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు గెలిచిన తర్వాత ఎవరు కదలను మున్సిపాలిగా ఏర్పాటు చేస్తానని చెప్పి మున్సిపాలిటీగా ఏర్పాటు చేసి 30 కోట్ల నిధులతో దేవరకద్ర రూపురేఖలను మారుస్తున్నానన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం దేవరకద్రను అభివృద్ధి చేయక రైల్వే బ్రిడ్జిని, ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేసి దేవరకద్రను రెండు గ్రాములుగా చీల్చారు. దీంతో పట్టణ ప్రజలు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రైల్వే అధికారులతో మాట్లాడి రైల్ గేటు దగ్గర అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం కి ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు బలపరిచిన మున్సిపల్ కౌన్సిలర్లను గెలిపించుకుంటే దేవరకద్ర మున్సిపాలిటీ మరింత అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, మాటి జెడ్పిటిసి లక్ష్మీకాంత్ రెడ్డి, మండల నాయకులు గోవర్ధన్ రెడ్డి అంజన్ కుమార్ రెడ్డి హనుమంత్ రెడ్డి, పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# "కబళిస్తోన్న పేదరికం.?

### జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ సెక్రటరీ డాక్టర్. వడ్డేపల్లి హనుమంతు



**విజేత, హైదరాబాద్ ప్రతినిధి :** జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ సెక్రటరీ డాక్టర్. వడ్డేపల్లి హనుమంతు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాలతో పాటు భారత్‌ను పట్టి పీడిస్తోన్న భూతం పేదరికం. 147కోట్ల దేశ జనాభాలో నేటికీ 28 శాతం మంది పేదరికంలోనే మగ్గుతున్నారని ఇటీవలి అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. భారత్ జిలుగు వెలుగుల గురించి మనం వినని రోజంటూ వుండదు. 'ఇండియా ఈజ్ నాట్ పూర్. ఇండియన్స్ ఆర్ పూర్' అనేవారట మాజీ రక్షణమంత్రి కృష్ణమీనన్. భారత్ పేద దేశం కాదని, భారతీయులే పేదవారని ఆయన అభిప్రాయం. పేదరికం ఎంతటి సామాజిక రుగ్మత అంటే-అది మనిషిని సహజ హక్కులను, జీవితానందాలను పరాయీకరించి, లోలోపలి నుంచి ధ్వంసం చేస్తుంటుంది. ఆ ఊబి నుంచి బయటపడే అవకాశం లేక ఆత్మహత్యే శరణ్యమన్న ధోరణిలోకి నెట్టివేస్తుంది. దేశంలో గతేడాది 1.7లక్షలకు పైగా ఆత్మహత్యలు నమోదయ్యాయి. వాటిలో 40శాతం పేదరికం, సంబంధిత కారణాలే ప్రధానమైనవి. 'పేదరికం అత్యంత హింసాత్మకమైనది, అది జీవితాలను నాశనం చేస్తుంది' అంటారు నెల్సన్ మండేలా. దీనికి తాజా ఉదాహరణే పార్వతీపురం మన్యం జిల్లాలో ఆత్మహత్యకు పాల్పడిన ఓ దళిత కుటుంబం. పేదరికం, ఆర్థిక ఇబ్బందులే దీనికి కారణం. ఓ నిరుపేద వృద్ధురాలు ఆస్పత్రిలో చనిపోతే..చెత్త తీసుకెళ్లే రిక్షాలో మృతదేహాన్ని తరలించిన హృదయ విదారక ఘటన కూడా ఇదే జిల్లాలో చోటు చేసుకుంది. ఆకలి, జీవన ఒత్తిళ్లు ఒక కుటుంబాన్ని ఎలా నిస్తేజంగా మార్చుతాయో, నిశ్శబ్దంగా వారి ప్రాణాలనే ఎలా మింగేస్తున్నాయో..ఈ ఆత్మహత్యలు ధ్రువీకరిస్తున్నాయి. 'పాత ప్రపంచం మరణిస్తూ, కొత్త ప్రపంచం జనిస్తున్న ఈ సంధి కాలంలో రాక్షసులు రాజ్యమేలుతున్నారు. అని వందేళ్ల క్రితం అన్న ఆంటోనియో గ్రాంసీ మాటల ప్రాసంగికత నేటికీ వర్తిస్తుంది. దేశంలో పేదరికం గణనీయంగా తగ్గిందని ప్రపంచబ్యాంక్, వాస్తవిత మరో విధంగా వుంది. ప్రస్తుత కాలం భారతీయ మహా కుబేరులకు స్వర్ణయుగంగా మారింది అని 2026 అంతర్జాతీయ అసమానతల నివేదిక చెబుతోంది. అంతేకాదు..బ్రిటిష్ పాలన నాటికంటే ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరిగాయని కూడా ఈ నివేదిక వెల్లడించింది. దేశ సంపదలో సగానికి పైగా సంపద కేవలం 10శాతం మంది కుబేరుల దగ్గర పోగుబడిందని 'బ్లూమ్ వెంచర్స్' అనే పెట్టుబడుల సంస్థ నివేదించింది. మేడిపండు చూడు మేలిమై వుండు' అన్న చందంగా పేదలు మరింత పేదలు కావడానికి, మధ్య తరగతి వర్గం పేదరికంలోకి జారిపోవడానికి ప్రధానకారణం..వ్యవసాయ క్షీణత, నిరుద్యోగం, విద్య, వైద్యం అత్యంత ఖరీదైనవిగా మారడం అని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ ఆకలి సూచీ-2025లో భారత్ 102వ స్థానంలో నిలవడం ఆందోళన కలిగించే విషయం. ఈ గణాంకాలు దేశంలోని పేదరికానికి అద్దం పడుతున్నాయి. కొద్దిమందిగా వున్న కార్పొరేట్లకు లక్షల కోట్ల రాయితీలిస్తున్న సంక్షేమ పథకాలను కుదించడమో లేదా రద్దు చేయడమో చేస్తున్నారు. గ్రామీణ పేదలకు పని హక్కుగా వున్న గ్రామీణ ఉపాధి పథకాన్ని రద్దు చేయడంతో మరింత ఆకలి కేకలు పెరుగుతాయి. అభివృద్ధి చెందుతున్న భారత్ వంటి దేశాల్లో ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, సామాజిక సమస్యలు పేదరికానికి కారణమౌతున్నాయి. ఇవి ఒకదానితో ఒకటి ముడిపడి వుంటాయి. గత కొన్ని దశాబ్దాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదరిక నిర్మూలనకు అనేక ప్రణాళికలు రూపొందిస్తున్నా, వాటి ఫలాలు, ఫలితాలు పేదలకు చేరడంలేదు. అట్టడుగు వర్గాలు, పేదలు పేదరికం ఊబిలో కూరుకుపోతునే వున్నారు. సంపన్నుల ఆదాయం రెట్టింపవుతూనే వుంది. ఫోర్బ్స్ ఇండియా లెక్క ప్రకారం దేశంలోని టాప్-25 బిలియనీర్ల సంపద సగటున దేశవ్యాప్తంగా వున్న పేదల సంపదకన్నా అనేక రెట్లు ఎక్కువ. సమాజం ఎంత సంపద సృష్టించిందన్నదే కాదు, ఆ సంపద అవకాశాలను ఎంత న్యాయంగా పంచిందన్నదే సమాజాన్ని అంచనా వేసే ప్రమాణం అంటారు ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్యసేన్. ఇలాంటి సంక్షోభ సమయంలోనూ తీవ్ర పేదరిక రహిత రాష్ట్రంగా కేరళ నిలవడం విశేషంగా చెప్పాలి. కాలే కడుపుకు గరిటెడు గంజి, జారే సిగ్గుకు మూరెడు పాతా, ఎల్లర కందే చల్లని రోజులు, వెలిసే విధమును వెదకండీ, అంటాడు రాయప్రోలు. దేశంలో సృష్టించబడుతోన్న సంపద పేదలకు చెందాలి. అందుకు అవసరమైన మార్గాలను వెతకాలి.. జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ సెక్రటరీ డాక్టర్. వడ్డేపల్లి హనుమంతు తెలిపారు.

# ప్రజాసేవ కోసమే ప్రత్యక్ష రాజకీయాలోకి ఏకు దివ్య -విద్య సాగర్





**విజేత,పరకాల :** ఏకు దివ్య -విద్య సాగర్ లకు పెద్దలంటే గౌరవం;చిన్నలంటే ఆప్యాయత ప్రజలంటే ప్రేమ దట్ ఇస్ ఏకు విద్య -దివ్య సాగర్ 4వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కౌన్సిలర్ ఏకు దివ్య -విద్య సాగర్ చేతి గుర్తుకే మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించగలరు అని ఇంటిటికి ప్రచారం నిర్వహించిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 4వ వార్డు లో పది సంవత్సరాలలో ఒక్క ఇల్లు ఒక్క రేషన్ కార్డు ఇవ్వని టిఆర్ఎస్ బిజెపి పార్టీలకు ఎందుకు ఓటు వేయాలి ప్రజలు గమనించాల్సిందిగా కోరుతున్నామని,ప్రజా సంక్షేమమే ముందుకు పోతున్న కాంగ్రెస్ పార్టీ - పది సంవత్సరాలలో ప్రజాసేవను మరిచిన బిజెపి బిఆర్ఎస్ పార్టీ ఇందిరమ్మ ఇల్లులు రేషన్ కార్డులు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు ఆసరా పింఛన్లు ఉచిత గ్యాస్ ఫ్రీ బస్ నిత్యవసరాలలో సంక్షేమ పథకాలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ- ముందు కూడా మరిన్ని సంక్షేమ పథకాలు ప్రజల కోసం అందించనున్న కాంగ్రెస్ పార్టీ కాబట్టి ప్రజల వైపు ఉన్న కాంగ్రెస్ పార్టీ 4వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఏకు -దివ్య విద్య సాగర్ చేతి గుర్తుకే మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించగలరు.ప్రజా సమస్యలు తెలిసియున్న ఏకు దివ్య -విద్య సాగర్ ఆ సమస్యలు పరిష్కరించే శక్తి ఉన్న 4వవార్డుఅభ్యర్థి ఏకు దివ్య -విద్య సాగర్ చేతి గుర్తుకే మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించగలరు.4వవార్డులో ఏ సమస్య అయినా పరిష్కారం నాతో పాటు ఏకు దివ్య తోనే సాధ్యం కాబట్టి 4 వ వార్డు ప్రజలారా ఒక్కసారి ఆలోచన చేయండి ఏకు దివ్య -విద్య సాగర్ మంచితనం సహాయం చేసే గుణం ఎవరిని నొప్పించే తత్వం కాదు చిన్న పెద్ద కులం మతం ధనిక పేద అని తేడా లేకుండా అందరికీ సేవ చేసే గుణం ఏకు దివ్య -విద్య సాగర్ ది టిఆర్ఎస్ బిజెపిలకు ఓటు వేస్తే మన కండ్ల మనమే పొడుచుకున్న వారమైతాం కాంగ్రెస్ పార్టీ ద్వారానే 4వ వార్డు అభివృద్ధి సాధ్యం ప్రజలారా 4వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఏకు దివ్య -విద్య సాగర్ మర్చిపోకుండా చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించండి- ఏకు దివ్య -విద్య సాగర్ 4వ వార్డు ప్రజలను మరిచిపోడు అభివృద్ధి పరుస్తాడన్నారు.ఈ కార్యక్రమం లో 4వార్డ్ ఇంచార్జి బుర్ర దేవేందర్ గౌడ్, అధ్యక్షులు బొచ్చు కుమార్,ఇందిరామ్మా కమిటీ సభ్యులు వీర్ల నర్సయ్య,ఎస్.కే యాకుబ్ పాషా,ఎం.డి రజియా సుల్తానా,గొల్లపెల్లి శంకర్ గార్లు,వార్డ్ సభ్యులు,యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పరభాష పోరుకై "పరాశక్తి"

ప్రస్తుత కాలంలో వస్తున్న సైన్మాలు ఎట్లున్నాయో కొత్తగా చెప్పనవసరం లేదు. పక్కా కమర్షియల్ అనడంలో ఏమాత్రం సందేహం లేదు.. చివరికి పక్కా కమర్షియల్ పేరుతోనూ కమర్షియల్ సినిమా వచ్చింది. ఈ తరంలో సమాజం ఒకటి ఉందని గుర్తించే సినిమా కావాలంటే అరుదే అనుకోవాలి. పెద్ద పెద్ద నటులు సైతం సందేశాత్మక చిత్రాలకు దూరం అవడమూ బాధాకరమైన విషయమే. అయితే ప్రకృతి పాజిటివ్ వైపరీత్యమేమో తెలియదు కానీ పాత ఉద్యమాల జ్ఞాపకాలను రివైజ్ చేసి సినిమాలు వస్తున్నాయంటే మంచి విషయమే. దేశ ప్రజలకు తెలిసిన విషయం... ప్రస్తుత జనరేషన్ లోనూ కొనసాగుతున్న వివాదంపై సైన్మా తీయడం శుభపరిణామమే. హిందీభాషను బలవంతంగా రుద్దడం అంశంపై ఇప్పటికే చాలా రాష్ట్రాలు పోరాటాలు చేశాయి.. అందులో ముఖ్యంగా ముందున్న పోరాటం తమిళనాట హిందీభాష వివాదం. భాష అంటే శబ్దమో, అక్షరాలు కాదు.. అది జాతి సంస్కృతి, గుర్తింపు, భాషకోసం వందలాది మంది ప్రాణాలు అర్పించారు. అందులో తమిళనాడులో భాషా యుద్ధ వీరుడు రాజేంద్రన్.. ఇప్పటికీ తమిళనాడులోనే కాదు, ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక లాంటి హిందీ మాట్లాడని రాష్ట్రాల్లోనూ ఆయన విగ్రహాలు ఉన్నాయి. అయితే ప్రత్యేక్షంగా జరిగిన పోరాటాన్ని పరాశక్తి అనే పేరుతో సినిమా రూపంలో సమాజానికి చూపించే ప్రయత్నం జరిగింది. అన్ని భాషాల్లోనూ డబ్బింగ్ జరిగింది. శివకార్తికేయన్ హీరోగా, శ్రీలీల కథానాయకగా, సుధా కొంగర డైరెక్షన్ చేశారు. తమిళంలో ఆధారంగా చిత్రీకరించింది. మన తెలుగు రాష్ట్రాల్లోనూ విడుదల కావాల్సింది కానీ కొందరు పెద్దపెద్ద నటుల చిత్రాలు ఉండటంతో థియేటర్లలో రిలీజ్ కాకుండా ఓటీటీలో విడుదలైంది. హిందీని అధికార భాష చేయాలన్న నిర్ణయానికి దక్షిణాదిలో ముఖ్యంగా తమిళనాడులో జరిగిన ఉద్యమం ఆధారంగా తెరకెక్కిన ఈ సినిమా పరాశక్తి (పరభాషపై శక్తివంతంగా పోరాటం చేయాలనే అంశం)

**ప్రత్యేక్ష కథాంశం:** ప్రధానిగా జవహర్ లాల్ నెహ్రూ కొనసాగుతున్న రోజుల్లో రైల్వే ఉద్యోగ ప్రకటనను ప్రాంతీయ భాషా పత్రికల్లో ఇవ్వకుండా హిందీ ప్రతికల్లో మాత్రమే ఇవ్వడంతో దక్షిణాదిలో కొంత ఆవేశాగ్రహాలు వెల్లువెత్తాయి. చెల్లయన్(శివకార్తికేయన్ పాత్ర) ఆధ్వర్యంలో పురాణాపూర్ గ్యాంగ్ ఓ రైలుకు నిప్పుంటించి దగ్ధం చేస్తుంది. అలా కట్ చేస్తే... కొన్ని రోజులకు రైల్వే ఇంజన్‌లో బొగ్గు వేసే ఉద్యోగంలో శివకార్తికేయన్(చెల్లయన్) చేరతాడు. అలా కొనసాగుతూ ఉండగా ప్రధాని ఇందిరాగాంధీ టైమ్?లో మళ్లీ హిందీ ఉద్యమం రిపీట్ అవుతుంది. ఆ ఉద్యమంలో కాలేజీలో చదువుతున్న శివకార్తికేయన్ తమ్ముడు చిన్నదురై (నటుడు అథర్వ మురళీ) ఉద్యమంలో చురుగ్గా ఉంటాడు. దాన్ని తెలుసుకొని అడ్డ పడతాడు శివకార్తికేయన్. ముందు జరిగిన ఉద్యమంలో ఎన్నో ఇబ్బందుల్లో చిక్కుకుంటాడు శివకార్తికేయన్, ఉద్యమానికి ప్రణాళిక, మద్దతు, కుటుంబ వ్యవహార విషయాలను బేరేజు వేసుకొని బలమైన ఉద్యమం కోసం ఎదురుచూస్తుంటాడు కార్తికేయన్.. అందుకే ఆవేశం, ఉద్రేగపూరితమైన ఉద్యమాలతో ప్రాణాలు నష్టపోవడమే కాక ఫలితం రాదు అని తమ్ముడు (చిన్నదురై) చేస్తున్న ఉద్యమానికి అడ్డుగా శివకార్తికేయన్ (చెల్లయన్) ఉంటాడు.

**విశ్లేషణాత్మక వివరణ:** వాస్తవ ఘటనల నేపథ్యంలో తెరకెక్కిన సినిమా. హిందీని అధికార భాష చేయడం పట్ల జరిగిన ఉద్యమాల్లో కొందరు ప్రాణాలు కోల్పోయారు. ఆ వీరుల త్యాగాన్ని తక్కువ చేయలేం కాదూ..? తమిళనాడులో జరిగిన ఉద్యమాన్ని కథగా తీసుకున్నారు డైరెక్టర్ సుధా కొంగర. కథకు తెలుగు, కన్నడ, మలయాళ ప్రజలతో పాటు ఉత్తరాది నుంచి మద్దతు లభించింది. ఉద్యమం ఎక్కడ మొదలైంది అనేది కాదు.. ఇప్పుడు దక్షిణాది ఐక్యమత్యంమే మహాబలం అనే సందేశాత్మకం ఎంతో విలువైంది... కన్నడ (కర్ణాటక), మహారాష్ట్ర (మరాఠీ), వెస్ట్ బెంగాల్ (బెంగాలీ)లోనూ ఈ ఏడాది భాషపై ఎన్నో ఉద్యమాలు జరిగాయి. ప్రస్తుతానికి మాతృ భాషను విడిచి పరాయి భాష (హిందీ) రుద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రత్యేక్ష సంఘటనలపై తీసిన సినిమాలో ఉద్యమాన్ని మరింత రగిలించే సన్నివేశాలుంటే ఇంకా బాగుండేదేమో...

**వాస్తవ రూపం:** హిందీభాష వివాదంపై తీసిన పరాశక్తి సినిమాపై వివాదమూ కనిపించింది. అదేంటంటే హిందీభాషపై పోరాటం విషయంలో తెలుగువాళ్లను అవమానించేలా డైలాగులు ఉన్నాయని మండిపాటు... నిజానికి తెలుగువాళ్లు వేరే ప్రాంతానికి వెళ్తే ఏ రకమైన గౌరవం ఉండేదో తెలిసిన విషయమే. తెలుగువారంటే చిన్నచూపు.. నిజానికి హిందీ వ్యతిరేక ఉద్యమం 1960లో తమిళనాడుతో జరిగింది. ఆ టైమ్ లోనూ హిందువులకు దగ్గరగా ఉండేలా గోల్టీ అనే పదాన్ని వాడింద్రు... గోల్టీ అంటే చోరీ (దొంగ) అని ప్రాచుర్యం మాత్రమే.. కానీ తమిళభాషలో తెలుగును రివర్స్ గా పిలుస్తారు. తెలుగు-గులుతె.. ఇది భాష విధాన పర్యం... అది కాస్త గుల్టీగా మారింది. మనం ఇంగ్లీషును తెలుగులోకి తర్జుమా చేస్తే ఎట్లా నిర్మిస్తమో... తెలుగును తమిళంలోకి తర్జుమా చేస్తే అదే విధానం.. కానీ ఈ పదం కొత్తగా దొంగ అంటూ ప్రాచుర్యంలోకి రావడంతో తెలుగువాళ్లు కొంత ఆగ్రహానికి గురైయ్యారు... దీన్ని అవకాశంగా తీసుకున్న సెంట్రల్ సెన్సార్ బోర్డు కావాలనే అభ్యంతరం తెలిపి ఆధారిత అంశాలను కట్ చేయమని సూచించింది. గుల్టీ అనే పదం సినిమాకు మెయిన్ పాయింట్.. అంటే తెలుగువాళ్లు (ఆంధ్రోళ్లు) అని తెలపడం... దాన్నే తొలగిస్తే సినిమాలో ఫ్లో పోతుంది. ఇదే కాకుండా కేంద్రానికి వ్యతిరేకంగా ఉన్న మరో 25కు పైగా సన్నివేశాలను కట్ చేయమని ఆదేశాలు జారీ చేసింది.

**మనస్సును కదిలించే భావం:**

సోషల్ మీడియాలో పరాశక్తిని తెలుగువాళ్లు బాయ్ కట్ చేయాలంటూ విమర్శలు చేస్తున్నారు. ఇది సరైనది కాదు... ఏదైనా ఒక అంశాన్ని కట్టినట్లు చూపించాలంటే ఎంతోకొంత క్రియేటివిటీ చేయాలి.. కానీ ప్రత్యేక్షంగా జరిగిన విషయం.. కొత్త తరానికి ఇది స్ఫూర్తిగా ఉండాలనే తీసిన చిత్రం మాత్రమే. ఇందులో కొన్ని సన్నివేశాలు ఉద్యమ కాలంలో జరిగిన సంఘటనలే.. మిగతా భాషారాష్ట్రాలు ఇలానే చేయాలని కాదు... తమిళనాడులో ఉద్యమం మొదలైనప్పుడు పరిస్థితి వేరు.. ఇప్పుడు పరిస్థితి వేరు... అర్థవంతమైన విమర్శలు పరిష్కార మార్గాలను చూపుతాయి.. తమిళ రూపంలో వచ్చిన ఐక్యత చిత్రానికి తెలుగురాష్ట్రాల నుంచి మద్దతు ఉంది.. తెలంగాణ నుంచి స్పష్టమైన మద్దతు ఉంది. కానీ ఆంధ్ర ప్రభుత్వం నుంచే కొంత వెనుకంజ కనిపించింది. తమిళనాడుకు తెలంగాణ కంటే ఆంధ్రా బంధమే దగ్గర అని చెప్పాలి. తమిళనాడు, ఆంధ్రకు ఎప్పటి నుంచో విడదీయరాని సంబంధాలు ఉన్నాయి. ఇప్పటికీ ఆంధ్రాలో కొన్ని జిల్లాల్లో తమిళ సాంప్రదాయాలు కొనసాగిస్తుంటాం.. అలాంటిది ఆంధ్ర ప్రభుత్వం పరాశక్తిలాంటి సినిమాను ప్రోత్సాహించకపోయినా పర్వాలేదు కానీ విమర్శలను అడ్డుకోకపోవడం బాధాకరం. కేంద్ర కూటమిలో ఉండి అధికారాన్ని కొనసాగించేందుకు మౌనం పాటిస్తే తల్లిలాంటి మాతృభాషకు ప్రభుత్వమే తూట్లు పొడిచినట్లవుతుంది. హిందీకి కొత్త బంధుత్వంలో ఉన్న కూటమి ప్రభుత్వం నుంచి హిందీ వ్యతిరేక ఉద్యమానికి పోత్సాహాన్ని ఆశించిడం అందని ద్రాక్షేలానే కనిపిస్తోంది. ఇప్పటికైనా వాస్తవ ఉద్యమాన్ని విస్తృతం చేసుకోకపోతే తల్లిపాలు లాంటి జాతి జాగృతిని విడిచి డబ్బాపాలు లాంటి మోసపూరితమైన సమాజంలోకి నెట్టవేయబడతాం... పట్ట. హరిప్రసాద్, రైటర్ ఫోన్:8790 84 3009

# పాఠశాల అభివృద్ధికి దాతల చేయూత: గ్రామస్తుల హర్షం

**విజేత: రఘునాథ్ పల్లి,:** చిన్నబి బడి (ఎం. పి. పి. ఎస్.) పునర్నిర్మాణంలో భాగస్వాములైన మీసాల శేఖర్ మరియు శివరాత్రి స్వామి. రఘునాథ్ పల్లి మండలం లోని ఖీలో షాపురం పరిధిలోని చిన్నబి బడి (ఎం. పి. పి. ఎస్) ప్రాథమిక పాఠశాల పునర్నిర్మాణ పనుల్లో భాగంగా పాఠశాల అభివృద్ధికి గ్రామ వాస్తవ్యులు మీసాల శేఖర్ మరియు శివరాత్రి స్వామి గారు ముందుకు వచ్చి తమ వంతు సహాయాన్ని అందించారు. గ్రామస్తుల ప్రోత్సాహంతో చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తి కావడంతో పాఠశాలకు సరికొత్త శోభ సంతరించుకుంది. కృతజ్ఞతలు తెలిపిన పాఠశాల యాజమాన్యం పాఠశాల అభివృద్ధికి తోడ్పడిన దాతలకు గ్రామ ప్రజల తరపున, పాఠశాల యాజమాన్యం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ జీడికంటి రజిత, గ్రామ సర్పంచ్ శాగ కవిత అశోక్, ఉప సర్పంచ్ బక్క సరిత మల్లేష్ పాల్గొన్నారు.

**పాల్గొన్న ముఖ్యులు:**

**వార్డు సభ్యులు:** సంగి రాజు, శాగ బాలకృష్ణ, రంగు రాజశేఖర్.

**అంబేద్కర్ యువజన సంఘం:** అధ్యక్షులు శాగ అరుణ్, సెక్రటరీ శాగ బాలకృష్ణ.



**ఇతర సభ్యులు:** చీటకోయిల హరీష్, శాగ రంజిత్, రాపక రజిని కుమార్, నక్క సుధాకర్, సిరిటి నర్సింగం తదితరులు పాల్గొన్నారు.

## మొగుళ్లపల్లి గ్రామ అభివృద్ధికి నిరంతరం
## కృషి చేస్తున్న సర్పంచ్ చాట్ల విజయ-రవీందర్



**విజేత: జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** తనను నమ్మి గెలిపించిన ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూ..ప్రజల ఆదరాభిమానాలను చూరగొంటున్న మొగుళ్లపల్లి గ్రామ సర్పంచ్ చాట్ల విజయ-రవీందర్ దంపతులపై ప్రజలు, అధికారులు, మేధావులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు డాక్టర్ రవీందర్ ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో మొగుళ్ళపల్లి సర్పంచ్ స్థానాన్ని బీసీ మహిళకు కేటాయించడంతో..తన సతీమణి చాట్ల విజయను రంగంలోకి దింపి భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా తనను ఎంతో ప్రేమతో నమ్మి ఓట్లు వేసిన ప్రజల రుణం తీర్చుకోవడానికి 24 గంటలకు 18 గంటల పాటు సర్పంచ్ విజయకు తన భర్త డాక్టర్ రవి చేదోడు వాదోడుగా ఉంటూ..రాజకీయంగా రాణించేందుకు కృషి చేస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించారు. సైడ్ డ్రైనేజీలో ఉన్న మురుగు మట్టిని తీసి వేయించడం, రోడ్డుకు ఇరువైపులా ముండ్ల చెట్లను తొలగించి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించడం, వేసవి రాకముందే మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టడం, ప్రజలకు ఉపాధి హామీ పనులు కల్పించడంలాంటి పనులకు శ్రీకారం చుట్టారు. సోమవారం బీసీ కాలనీలో సీసీ రోడ్లకు ఇరువైపులా మొలిచిన ముండ్ల చెట్ల వలన ప్రజలు నరకయాతన పడుతుండటంతో..తన సిబ్బందిని ఆదేశించి ముండ్ల చెట్లను తొలగించారు. దీంతో బీసీ కాలనీ వాసులంతా సర్పంచ్ చాట్ల విజయ-రవీందర్ దంపతులు తీసుకుంటున్న చర్యలను కొనియాడుతున్నారు.

# అధికారం కోసం అభ్యర్థుల ఆరాటం

### సాయంత్రం తో సమాప్తం




**విజేత,కల్వకుర్తి :** నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం తో సమాప్తం కానుంది. కాగా అభ్యర్థులు ఎన్నడూ లేనంతగా అధికారం నాదంటే నాది అంటూ హోరాహోరీగా ప్రచారం కొనసాగిస్తూ అధికారం కోసం ఆరాటపడుతున్నారు. ఓ తెలుగు చలన చిత్రంలో చెప్పిన విధంగానే కొనుక్కోవడం పార్టీల వంతు అమ్ముడుపోవడం ఓటర్ల వంతు అన్నట్టుగానేసభ్య సమాజం తలదించుకునేలా రాజకీయ వ్యవహార శైలిపై పట్టణ ప్రజల పెదవి విరుస్తున్నారు.కుల,మత, ఆర్థిక వ్యవహారాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా వినియోగించుకోవాల్సిన ఓటును ఓటర్లు ఉపయోగించుకున్నప్పుడే ఊరు, వాడ బాగుపడుతుంది అని సామాజిక మాధ్యమాలలో సామాజికవేత్తలు హోరెత్తి నినాదాలు చేసిన చెవిటివాడి ముందు శంఖం ఊదినట్టే అన్న చందంగా పెడచెవిన పెడుతున్నారనేది జగమెరిగిన సత్యం.కాగా ఈసారి మునిసిపల్ చైర్మన్ పదవికి మహిళా రిజర్వేషన్ కావడంతో సతుల కోసం పతుల పరుగులు మాత్రం వర్ణాతీతం.మొత్తం మీద మున్సిపల్ చైర్మన్ పదవి కోసం బరిలో ఉన్న వారిపై పట్టణ ప్రజలు అసంతృప్తి గానే ఉన్నట్లు దిక్కులేని స్థితిలో ఎవరికో ఒకరికి ఓటు వేయాల్సిందే కదా అని పట్టణ ప్రజల వ్యవహార శైలిలో మాట తీరులో కనిపిస్తుంది.

## ప్రాథమిక అభ్యాస అధ్యయనం
## ఎఫ్ఎల్ ఎస్ మోడల్ పరీక్షలు నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి




**విజేత,కరీంనగర్ ప్రతినిధి :** ప్రాథమిక పాఠశాల విద్యార్థుల చదువును అంచనా వేసే అధ్యయనం ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీ లో భాగంగా విద్యార్థులకు మాక్ పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, గోపాలపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. 3వ తరగతి విద్యార్థులతో గణితం, ఆంగ్ల పాఠాలు చదివించారు. ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీ కి సంబంధించిన మోడల్ టెస్ట్ పేపర్లలోని పలు ప్రశ్నలను అడుగుతూ విద్యార్థుల నుండి సమాధానాలు రాబట్టారు. ప్రతి విద్యార్థితో పాఠాన్ని చదివిస్తూ స్పష్టంగా అర్థవంతంగా చదివేందుకు మెళకువలు నేర్పారు. ప్రతి విద్యార్థి నోట్ బుక్ లో రైటింగ్ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీలో భాగంగా జిల్లాలోని ఏ పాఠశాలలోనైనా విద్యార్థులకు ర్యాండడమైజేషన్ విధానంలో పరీక్షలు జరుగుతాయని, అందువల్ల ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధతో ఎఫ్.ఎల్.ఎస్ కి సిద్ధం చేయాలని అన్నారు. విద్యార్థులకు తరచూ మాక్ టెస్టులు నిర్వహించాలని ఆదేశించారు. మండల విద్యాధికారులు ఎప్పటికప్పుడు ఈ అంశంపై సమీక్ష నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. బుధవారం బోధన కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ కఠినమైన పాఠాల పట్ల దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యా సంవత్సరం కొద్దికాలమే ఉన్నందున ప్రతి విద్యార్థి పై శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, మండల విద్యాధికారి వాసవి పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

### సర్పంచ్ విద్యాధర్



**విజేత గజ్వేల్ :** పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా 'సాక్షి' స్టడీ మెటీరియల్ను ఉచితంగా అందజేయడం అభినందనీయమని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ చింతల విద్యాధర్ ముదిరాజ్ సూచించారు.జగదేవపూర్ మండలం లోని వట్టిపల్లి గ్రామంలోని ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు 'సాక్షి' సంస్థ సమకూర్చిన గణితం, సైన్స్ సబ్జెక్టుల మెటీరియల్ను పాఠశాల ప్రధానోపాధ్యాయులతో కలిసి గ్రామ సర్పంచ్ చింతల విద్యాధర్ ముదిరాజ్ విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పదోతరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో స్టడీమెటీరియల్ రూపొందించి, ఉచితంగా పంపిణీ చేస్తున్న 'సాక్షి' మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు. గణితం, సైన్స్ సబ్జెక్టులపై బిడియం పోగొట్టి, మరింత పట్టు సాధించేందుకు మెటీరియల్,దోహదపడుతుందన్నారు. పదవ తరగతి విద్యార్థులు ఎలాంటి భయం లేకుండా ఒక ప్రణాళికతోటి చదువుకోవాలని సూచించారు.విద్యార్థులు పేదరికలు అధికమించి విద్యలో రాణించినప్పుడే భవిష్యత్తు బంగారు భవిష్యత్తు అవుతుందని అన్నారు.విద్యార్థులు కష్టపడి కాదు ఇష్టపడి చదవాలని మంచి మార్కులు సాధించాలని పేర్కొన్నారు. 10/10 ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు 5000రూపాయలు అందజేస్తానని తెలిపారు. మెటీరియల్ను సమయాపాలనతో చదివితే చదువులో వెనుకబడిన విద్యార్థులు కూడా మంచి మార్కులు సాధించవచ్చన్నారు. అనంతరం పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీమెటీరియల్ను అందజేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాను, మాజీ సర్పంచ్ పిట్టల సత్యనారాయణ, దుబ్బాసి రమేశ్, చిలుముల మధు, తప్పెట్ల లక్ష్మణ్ మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రాథమిక అభ్యాస అధ్యయనం
## ఎఫ్ఎల్ ఎస్ మోడల్ పరీక్షలు నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి





**విజేత,కరీంనగర్ ప్రతినిధి :** ప్రాథమిక పాఠశాల విద్యార్థుల చదువును అంచనా వేసే అధ్యయనం ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీ లో భాగంగా విద్యార్థులకు మాక్ పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, గోపాలపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. 3వ తరగతి విద్యార్థులతో గణితం, ఆంగ్ల పాఠాలు చదివించారు. ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీ కి సంబంధించిన మోడల్ టెస్ట్ పేపర్లలోని పలు ప్రశ్నలను అడుగుతూ విద్యార్థుల నుండి సమాధానాలు రాబట్టారు. ప్రతి విద్యార్థితో పాఠాన్ని చదివిస్తూ స్పష్టంగా అర్థవంతంగా చదివేందుకు మెళకువలు నేర్పారు. ప్రతి విద్యార్థి నోట్ బుక్ లో రైటింగ్ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీలో భాగంగా జిల్లాలోని ఏ పాఠశాలలోనైనా విద్యార్థులకు ర్యాండడమైజేషన్ విధానంలో పరీక్షలు జరుగుతాయని, అందువల్ల ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధతో ఎఫ్.ఎల్.ఎస్ కి సిద్ధం చేయాలని అన్నారు. విద్యార్థులకు తరచూ మాక్ టెస్టులు నిర్వహించాలని ఆదేశించారు. మండల విద్యాధికారులు ఎప్పటికప్పుడు ఈ అంశంపై సమీక్ష నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. బుధవారం బోధన కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ కఠినమైన పాఠాల పట్ల దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యా సంవత్సరం కొద్దికాలమే ఉన్నందున ప్రతి విద్యార్థి పై శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, మండల విద్యాధికారి వాసవి పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో
## ముదిరాజ్ అభ్యర్థులను గెలిపించండి

### తెలంగాణ -ముదిరాజ్ సామాజిక, న్యాయ వేదిక"

### రాష్ట్ర అధ్యక్షులు శానబోయిన అశోక్ ముదిరాజ్.



**విజేత ములుగు ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో... రాజకీయ పార్టీల గుర్తులపై మరియు స్వతంత్ర అభ్యర్థులు కౌన్సిలర్లుగా పోటీ చేస్తున్న ముదిరాజ్ అభ్యర్థులను గెలిపించాలని, తెలంగాణ ముదిరాజ్ సామాజిక న్యాయ వేదిక" రాష్ట్ర అధ్యక్షులు శానబోయిన అశోక్ ముదిరాజ్ కోరారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ లల్లో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజులను గుర్తించి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో సీట్లు కేటాయించకుండా అధికార కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్ పార్టీలు కుట్రపూరితంగా వ్యవహరించి అత్యధిక ముదిరాజ్ జనాభా గల స్థానాలలో ముదిరాజుల కు పార్టీ బీఫామ్ లు ఇవ్వకుండా మోసం చేశారని ఆరోపించారు. గత సర్పంచి ఎన్నికల్లో కూడా గ్రామాల్లో ముదిరాజులు ఎక్కువగా ఉన్నా గ్రామాల్లో కూడా ముదిరాజ్ వారికి సీట్లు కేటాయించకుండా అధికార కాంగ్రెస్ పార్టీ ముదిరాజులకు అన్యాయం చేశారని ముదిరాజులను బిసి–డి నుంచి బీసీ 'ఎ కు మారుస్తామని ఇచ్చిన హామీని అమలు చేయకుండా మర్చిపోయారని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం లో కీలక పాత్రగా ముదిరాజులు ముందున్నారనే విషయాన్ని మర్చిపోయా రా నీ ఆరోపించారు. రాబోయే రోజుల్లో ముదిరాజు ల ఓట్లతోనే గెలుస్తున్న ఎమ్మెల్యేలు, ఎంపీ లైన రాజకీయ పార్టీల నాయకులు ముదిరాజులకు అన్యాయం చేస్తున్న వారిని ముదిరాజులు గుర్తించబోరని, వారికి వ్యతిరేకంగా ముదిరాజులు పనిచేస్తారని తెలిపారు. ముదిరాజులు, రాజకీయఆర్థిక, సమానత్వం కోసం, మొత్తం సామాజిక న్యాయం కోసం,ముదిరాజ్ లు పోరాటాలకు సిద్ధం కావాలని "తెలంగాణ సామాజిక, న్యాయ వేదిక" రాష్ట్ర అధ్యక్షులు శానబోయిన అశోక్ ముదిరాజ్ పిలుపునిచ్చారు.

## ఎన్నికల బరిలో స్వతంత్ర అభ్యర్థి హోరు



**విజేత బెల్లంపల్లి :** పుర ఎన్నికల ప్రచారం హోరెత్తింది. సోమవారం 3వ వార్డు స్వతంత్ర అభ్యర్థి పత్తిపాక రేణుక ప్రజలతో కలిసి గడప గడప కు తిరుగుతూ విస్తృత ప్రచారం చేపట్టారు. పత్తిపాక కుటుంబ సభ్యులు మూడు సార్లు పుర ఎన్నికల పోరు బరిలో నిలిచి గెలిచారు. వార్డు అభివృద్ధి, సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలు ప్రజలు ఆదరించేలా నిలిచాయి. ప్రచారం సందర్భంగా ప్రజలు ఆమెకు బ్రహ్మరథం పట్టారు. మళ్ళీ పత్తిపాక కుటుంబమే గెలవాలని ప్రజలు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా 3వ వార్డు స్వాతంత్ర అభ్యర్థి పత్తిపాక రేణుక ఆమె భర్త రాజ్ కుమార్ మాట్లాడుతూ వార్డు లో చిన్న చిన్న పనులు మాత్రమే నిలిచి ఉన్నాయని, తమని భారీ మెజారిటీ తో గెలిపిస్తే సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అందాల్సిన సంక్షేమం, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇటేవల కోటి రూపాయలు వార్డు అభివృద్ధికి మంజూరు కాగా, ఎన్నికల లో గెలిచిన అనంతరం చేపట్టాల్సిన పనులను పూర్తి చేస్తామన్నారు.ఏమైనా తెలిసి తెలియక చేసిన తప్పులను మీ కుటుంబ సభ్యులు గా భావించి క్షమించాలన్నారు. మాకు ఎలాంటి వ్యాపారం, విధులు లేవు. కేవలం ప్రజా క్షేత్రం లో ప్రజలకు సేవ చేయడానికే రాజకీయంలో ఉన్నామన్నారు. తమని భారీ మెజారిటీ తో గెలిపిస్తే వార్డు రూపు రేఖలు మారుస్తామన్నారు.

## పోలింగ్ రోజున పబ్లిక్ హాలిడే

### ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**విజేత, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన ఆయా కేంద్రాల్లో నేడు అలాగే పోలింగ్ రోజున బుధవారం, సెలవులు ప్రకటించినట్లు ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు. ఈ నెల 11వ తేదీన బుధవారం రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ నిర్వహించే కేంద్రాల్లో ముందు రోజు అలాగే పోలింగ్ రోజు జిల్లాలోని విద్యా సంస్థలు, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన కార్యాలయాలకు స్థానిక సెలవులు ఉంటాయని పేర్కొన్నారు. చట్ట ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కార్పొరేషన్లు, సంస్థల ఉద్యోగులు, సిబ్బంది ఓటు హక్కు వినియోగించు కునేందుకు పోలింగ్ రోజున ఈ నెల 11వ తేదీన సెలవు వర్తిస్తుందని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలలో బీసీల ఓటు బీసీలకే

### బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు వేముల మహేందర్ గౌడ్..



**విజేత: జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** ఈనెల 11వ తేదీన తెలంగాణ రాష్ట్రంలో జరిగే మున్సిపల్ ఎన్నికలలో రాజకీయ పార్టీలకతీతంగా జనరల్ స్థానాలలో ఎన్నికల బరిలో నిలబడిన బీసీలను గెలిపించాలని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ బీసీ కులస్తులకు పిలుపునిచ్చారు. సోమవారం మహేందర్ గౌడ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 116 మున్సిపాలిటీలలో మూడు కార్పొరేషన్లలో జరుగుతున్న ఎన్నికలలో ఓటు మనదే సీటు మనదే, బీసీల ఓటు బీసీలకే అనే నినాదంతో బీసీ కులస్తులు రాజకీయ పార్టీలకతీతంగా ఓటు వేసి అత్యధిక మెజార్టీతో బీసీ బిడ్డలను గెలిపించి, తెలంగాణ రాష్ట్రంలో బీసీల రాజకీయ ఐక్యతను, సామాజిక చైతన్యాన్ని ప్రదర్శించాలన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలవుతుండగా, 10 శాతం ఉన్న అగ్రకులాలు 50 శాతం జనరల్ స్థానాలలో పోటీ చేస్తున్నారని, జనరల్ స్థానాలు అంటే రెడ్డి, రావులవి కాదన్నారు. 60 శాతం ఉన్న బీసీలకు 28 శాతం రిజర్వేషన్లను కల్పించారని, రిజర్వేషన్లు లేని చోట జనరల్ స్థానాల్లో నిలబడిన బీసీలను గెలిపించడం ద్వారా బీసీలకు రాజకీయంగా న్యాయం జరుగుతుందన్నారు. మొన్న జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలాగానే ఈ మున్సిపల్ ఎన్నికలలో కూడా బీసీలు ఓటు అనే ఆయుధంతో అగ్రకులాలను ఓడించి తెలంగాణలో బీసీల రాజ్యాధికారానికి పునాదులు వేయాలని మహేందర్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

## గెలుపు దిశగా 18 వ వార్డు బిజెపి అభ్యర్థి రచ్చ స్వప్న



**విజేత బెల్లంపల్లి :** బిజెపి పార్టీ 18వ వార్డ్ అభ్యర్థి రచ్చ స్వప్న పార్టీ శ్రేణులతో, వాణిజ్య,వ్యాపారస్తులతో కలిసి విస్తృత ప్రచారం చేపట్టారు. వార్డులో నెలకొని ఉన్న సమస్యలను చేపటాల్సిన అభివృద్ధి గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు.మురికి కాలువలు,అధ్వానమైన రోడ్లు, డ్రైనేజ్,అర్హులైన నిరుపేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు అందకపోవడం అర్హులైన వారికి ఇవ్వకపోవడం,త్రాగునీరు సమస్య,పెన్షన్స్ రాకపోవడం, వీధి దీపాలు వంటి అనేక సమస్యలను ప్రజలు వారి దృష్టికి తీసుకువచ్చారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం లో వార్డ్ ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని తమకు ఒక్క అవకాశం ఇస్తే అహర్నిశలు కృషి చేస్తూ వార్డ్ అభివృద్ధి కోసం పనిచేస్తానని ధీమా వ్యక్తం చేశారు.తనని గెలిపించి బెల్లంపల్లి పట్టణ అభివృద్ధి కోసం సహకరించాలని ప్రజలను కోరారు.

## రాష్ట్రం అభివృద్ధి బిజెపితోనే సాధ్యం

### పాలమూరు ఎంపీ డీకే అరుణ.



**విజేత దేవరకద్ర:** తెలంగాణలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందంటే బిజెపి తోనే సాధ్యమవుతుందని పాలమూరు ఎంపీ డీకే అరుణ అన్నారు. సోమవారం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజు కావడంతో పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్ కుమార్ రెడ్డి, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి వారి ఆధ్వర్యంలో. పట్టణ పురవీధుల గుండా తిరుగుతూ. బిజెపి పార్టీ బలపరిచిన మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలంటూ ప్రచారం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ బిజెపి పార్టీ నిధులతోనే గ్రామాలు ఎంత అభివృద్ధి చెందుతున్నాయి అన్నారు. నటి గ్రామంలో సిసి రోడ్లు డ్రైనేజీ తాగునీరు వీధి దీపాలు బిజెపి నిధులతోనే అభివృద్ధి చెందుతున్న అన్నారు. దేవరకద్ర ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయడంతో పట్టణ ప్రజలు అటు ఇటు వెళ్లడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని రైల్వే అధికారులను కలిపి రైల్వే అండర్ పాస్ బ్రిడ్జికి మంజూరుకు కృషి చేశానన్నారు. మరో 20 రోజుల్లో రైల్వే అండర్ ప్లస్ బ్రిడ్జి పనులను ప్రారంభించడానికి కృషి చేస్తామన్నారు. కనక ప్రతి ఒక్కరు కూడా బిజెపి పార్టీ బలపరిచిన మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు . కార్యక్రమంలో బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు

## కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్
## చెక్కుల పంపిణీ చేసిన ఏలే మల్లికార్జున్



**విజేత,నిజాంసాగర్ :** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం నిజాంసాగర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈరోజు సీఎంఆర్ఎఫ్ సీఎంర్ఫ్ షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు జిల్లా డిసిసి అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ స్వయంగా అందజేశారు. ప్రజా గ్రామాలు గ్రామాల వారిగా పంపించేశారు వడ్డేపల్లి జక్కాపూర్ బంజేపల్లి మల్లూరు సంక్షేమానికి కట్టుబడి అర్హులకు ప్రభుత్వ సహాయాన్ని చేరవేసే క్రమంలో ముందుండి సేవలందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ కుమార్ , నిజాంసాగర్ ఎమ్మార్వో ఎంపీడీవోమెంగారం శ్రీనివాస్ ప్రజా ఫండరీ వివిధ గ్రామ సర్పంచులు మరి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తా

### వార్డు రూపురేఖలు మారుస్తా

### 17వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాగంశెట్టి సత్యనారాయణ



**విజేత బెల్లంపల్లి :** బెల్లంపల్లి 17వ వార్డ్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాగంశెట్టి సత్యనారాయణను మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రజలను కోరారు. సోమవారం 17వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బెల్లంపల్లి పుర పోరులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులందరినీ భారీ మెజార్టీ తో గెలిపించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలన్నారు.. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రజలకు సంక్షేమం అభివృద్ధి జరుగుతుందన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికలో తనను గెలిపిస్తే 17వ వార్డు రూపురేఖలు మార్చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదవారికి సన్న బియ్యం, లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంట్, గ్యాస్ సబ్సిడీ, వంటి అనేక సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. బెల్లంపల్లి పట్టణంలో గత రెండు సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. 200 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ స్కూల్, ట్రాఫిక్ నియంత్రణ కోసం రోడ్ల వెడల్పు, నూతన కూరగాయల మార్కెట్, సీసీ డ్రైన్స్ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపిస్తే 17వ వార్డు ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపెడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో , వార్డ్ ప్రజలు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# శ్రీ రాజరాజేశ్వర ప్రసన్నాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు



**అక్షర విజేత నర్సింహులపేట :** మండల కేంద్రంలో కొలువై ఉన్న శ్రీ రాజరాజేశ్వర ప్రసన్నాంజనేయ స్వామి అతి పురాతనమైన దేవాలయం 2006వ సంవత్సరంలో జీర్ణోద్ధరణ జరిగి దినదిన ప్రవర్ధమానం చెంది భక్తుల యొక్క అచంచలమైన విశ్వాసం చూరగొని ప్రముఖ దేవాలయంగా ప్రసిద్ధి చెందింది, దేవాలయం పునర్నిర్మాణం జరిగి 20 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఫిబ్రవరి 14- 2026 నుండి 16వ తేదీ వరకు జరుగు స్వామి వారి బ్రహ్మోత్సవాల కరపత్రికలను సోమవారం రోజున స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మాలోత్ సురేష్ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. బ్రహ్మోత్సవాల కార్యక్రమాలు14-2-2026 శనివారం ఉదయం 9 - 30 నిమిషాలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, కలశ స్థాపన, ప్రసాద వితరణ 15 - 2-2026 ఆదివారం రోజున ఉదయం 4 - 30 నిమిషాలకు స్వామివారికి అభిషేకాలు అర్చనలు, ఉదయం 8-30 నిమిషాలకు అష్టోత్తర శతకలశ పూజ, ఉదయం 10:30 గంటలకు పూర్ణాహుతి హోమం, రాత్రి 9 గంటలకు స్వామి వారి కళ్యాణోత్సవం జరుగును కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని వచ్చునూరి దేవేంద్ర శర్మ తెలిపారు, ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొల్లం రమేష్, సర్పంచ్ పెదమాముల యాకయ్య, ఉప సర్పంచ్ కాస యాకయ్య, మంచినీళ్ల లక్ష్మీనారాయణ రెడ్డి, వేముల నరసింహారెడ్డి ఎర్ర వెంకట్రాం నర్సయ్య, బొల్లోజు ఉపేంద్ర చారి, దోమల యాదగిరి, ఎస్.కె హసీనా, లెక్కల సంపత్ రెడ్డి, ఏరనాగి వెంకన్న, నేలకుర్తి శారదా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల అన్ని ఏర్పాట్లు పూర్తి

## కలెక్టర్ కె. హేమావతి




**విజేత, సిద్దిపేట ప్రతినిధి :** మున్సిపల్ ఎన్నికల అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ కె. హేమావతి అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన జిల్లాలోని హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నాయని ఎన్నికల పోలింగ్ కు మరియు 13వ ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. 4 మున్సిపాలిటీలలో మొత్తం 72 వార్డులకు ఎన్నికలు జరగనుండగా 176 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామని, 1069 మంది పోలింగ్ సిబ్బందిని నియమించామని, మొత్తం 18 రూట్లను 22 మంది జోనల్ అధికారులను నియమించామని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేస్తున్నామని 31 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి 31 మంది మైక్రో అబ్జర్వర్లను క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేశామని, అన్ని పోలింగ్ కేంద్రాలలో 100% వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. అన్ని మున్సిపాలిటీలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ మరియు రిసెప్షన్ సెంటర్లను ఏర్పాటు చేశామని, పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు పోలింగ్ సిబ్బందికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామని అన్నారు. 13వ తేదీన ఎన్నికల ఓట్ల లెక్కింపుకు గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో 14 టేబుల్స్ మరియు మిగతా మూడు మున్సిపాలిటీలలో 7 టేబుల్స్ చొప్పున ఏర్పాటు చేశామని తెలిపారు ఈ ఎన్నికలలో జిల్లాలోని 4 మున్సిపాలిటీలలో కలిపి మొత్తం 1 లక్ష 1 వేయు 85 మంది ఓటర్లు కలరని వారందరూ ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలీస్ శాఖ ద్వారా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 11వ తేదీన ఉదయం 07:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు మున్సిపల్ ఎన్నికలు జరగనున్న జిల్లాలోని ఈ 4 మున్సిపాలిటీలలోని ఓటర్లంత తప్పకుండా తమ ఓటు హక్కును 100 శాతం వినియోగించుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు.

# పొడిచన్ పల్లి లో ఉన్నత పాఠశాలలో ఘనంగా స్వయంపాలన



**విజేత,పాపన్నపేట :** పాపన్నపేట మండలంలోని పొడిచన్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వయంపాలన దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలిగా కీర్తన, ఎంఈఓ గా తేజస్విని, డిప్యూటీ డిఈఓ గా పరమేశ్వర్, డిఈఓ గా సాయి చరణ్ గౌడ్, కలెక్టర్ గా పావని, ఉపాధ్యాయులుగా పిఈటీ లు గా విద్యార్థులు వ్యవహరించారు. విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి వారికి పాఠాలు భోదించారు. పాఠశాల లో తమకు ఈరోజు ఎదురైన అనుభవాలను పంచుకున్నారు. భవిష్యత్ లో ఉన్నత స్థానాలలో తాము ఉంటామని తెలియజేసారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఇంచార్జి ఎంఈఓ ఎ.ప్రతాపరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్ గౌడ్, మాధవరెడ్డి,కె. కిషన్, పి. భద్రయ్య, జి. భవానీప్రసాద్, డి. గన్ను, సుబ్బారావు, కొడపాక శివశంకర్, శివలింగం గౌడ్, చంద్రకాంత్,డాక్టర్ బి. దేవయ్య, శశికళ పి డి మహిపాల్ , పాషా లు బహుమతులు అందించారు.

# రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే -- మంత్రి మహమ్మద్ అజారుద్దీన్

## ఖేడ్ అన్ని మున్సిపాలిటీల కంటే అభివృద్ధిలో ముందుంటుంది ఎంపీ,ఎమ్మెల్యే





**విజేత: నారాయణఖేడ్ :** నారాయణఖేడ్ మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా ప్రచారం చివరి రోజు అయిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరఫున ఎన్నికల ర్యాలీ నిర్వహించడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రచారానికి విచ్చేసిన రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ తీవ్రంగా ఆరోపించారు. సోమవారం నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ్ రెడ్డి, మున్సిపల్ ఇంచార్జి గజేల కాంతం, ఉమ్మడి జిల్లా మాజీ ప్రణాళిక సంఘం సభ్యులు నాగేష్ శెట్కార్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్ శెట్కార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, పీసీసీ సభ్యులు కే. శ్రీనివాస్, శంకరాయ్యస్వామి తదితర నాయకులు పాల్గొన్నారు. మంగళపేట్ భవాని మత మందిరం నుంచి శివాజీ చౌక్ వరకు జాతీయ రహదారిపై భారీ రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రజలకు చేయి ఊపుతూ అభివాదం చేశారు. వార్డు సభల్లో స్థానికులతో ప్రత్యక్షంగా మాట్లాడిన మంత్రి, కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వార్డు సభ్యులను భారీ మెజారిటీతో గెలిపించి అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. ప్రజలను తప్పుదోవ పట్టించే బీఆర్ఎస్, బీజేపీ తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ విజయదుందుభి మోగిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు అడిగిన ప్రశ్నలకు సానుకూలంగా స్పందించిన మంత్రి, తన దృష్టికి వచ్చిన సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీలోని 15 వార్డుల సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రీడా భారత్



క్రీడలు సమాజంలో ఒక అంతర్భాగంగా మారాయి. ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడంలో మరియు ఆర్థిక వ్యవస్థకు ఒక ముఖ్యమైన దాతగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం క్రీడలకు బడ్జెట్ పెంచింది. ప్రపంచ స్థాయి సౌకర్యాల నిర్మాణంపై దృష్టి పెట్టింది.క్రీడా సంస్కృతిని ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంది . కొత్త ఖేలో ఇండియా మిషన్ ప్రారంభించబడింది. అందులో భాగంగానే గ్రాస్ రూట్స్ టాలెంటును పెంపొందించడం, కోచ్ ల అభివృద్ధి, పోటీలు, క్రీడాశాస్త్రం, ఎలైట్ అథ్లెట్ లకు శిక్షణ, ఆధునిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుంది.

**కర్తవ్యలలో ప్రాధాన్యం.....**

కేంద్ర బడ్జెట్లో ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ మూడు కర్తవ్యాలను ప్రకటించారు.మొదటి కర్తవ్యం ప్రకటించిన అంశాల ప్రకారం మౌలిక సదుపాయాలు కల్పించడంలో భాగంగా క్రీడా సాధనాల ముడి పదార్థాల రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారు. రెండో కర్తవ్యం లో ఖేలో ఇండియా మిషన్ లో క్రీడాభివృద్ధిని ఒక ప్రత్యేక అంశంగా పరిగణించారు.

**గతం కంటే మెరుగ్గా....**

2026 27 కేంద్ర బడ్జెట్ లో క్రీడలు మరియు యువజన మంత్రిత్వ శాఖకు మొత్తం 4479.8 కోట్లు కేటాయించారు.గత ఏడాది(2025 26)లో 3794.30 కోట్లు కేటాయించగా ప్రస్తుతం దాన్ని 18 శాతం పెంచారు. అంటే 1133.34కోట్లు పెంచారు.

**కేటాయింపులు**




1) స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా =917.38 కోట్లు.
2) ఖేలో ఇండియా 924.35 కోట్లు
3) క్రీడా పరికరాల తయారీకి 500 కోట్లు.
4) నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్= 425 కోట్లు
5) కామన్వెల్త్ గేమ్స్ = 50 కోట్లు (2025-26=28.05కోట్లు)
6) క్రీడాకారుల ప్రోత్సాహకాలు =40కోట్లు (2025-26=28 కోట్లు)

క్రీడాకారుల శిక్షణ మరియు వసతుల కోసం క్రీడారంగాన్ని మార్చడానికి 10 సంవత్సరాల కాల పరిమితితో కేలో ఇండియా ప్రారంభించారు.

దేశ వస్తువుల తయారీ ప్రోత్సహించడంపై దృష్టి పెట్టారు క్రీడా సమైక్యలకు క్రీడాకారులకు ప్రోత్సాహాలను పెంచారు.

**ఒలంపిక్స్ లక్ష్యం**

2036 ఒలంపిక్స్ కు ఆతిథ్యం ఇవ్వడం భారత్ ను అత్యున్నత 10 క్రీడా దేశాల్లో ఒకటిగా నిలపడం లక్ష్యం గా పెట్టుకొని, నూతన బడ్జెట్ లో దార్శనికతను కనబరిచారు.ఈ బడ్జెట్ కేటాయింపులు భారతదేశం యొక్క క్రీడా ప్రతిష్టను పెంచడానికి దోహదపడుతుందని చెప్పవచ్చు శ్రీను బాబు రాసూరి, విశ్లేషకులు, ఉస్మానియా యూనివర్సిటీ .

# ఆశతో కాదు ఆశయంతో వస్తున్న ఆశీర్వదించండి

## పాలకుడిగా కాదు సేవకుడిగా పనిచేస్తా.

## బిజెపి పార్టీ బలపరిచిన 17వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి ముత్యాల శ్రీలత మహేందర్.

**విజేత, ఇబ్రహీంపట్నం :-** ఒక అవకాశం ఇవ్వండి మీకు పాలకుడిగా కాదు సేవకుడిగా పనిచేస్తానని బిజెపి పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి ముత్యాల శ్రీలత మహేందర్ అన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలో ఆయన గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. 17 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా మీ ముందుకు వచ్చాను. నాకు ఒక అవకాశం ఇవ్వాలని, నేను పాలకుడిగా కాదు సేవకుడిగా పనిచేస్తానని, బిజెపి కమలం పువ్వుకు గుర్తుకు ఓటు వేసి నన్ను గెలిపించాలని ప్రజలను కోరారు. గతంలో కూడ ఈ వార్డులో కేంద్ర ప్రభుత్వం నిధులతో వార్డు అభివృద్ధి జరిగిందని గుర్తుచేశారు.

**మన వార్డు అభివృద్ధి మా లక్ష్యం.**

మీ అందరి ఆశీర్వాదంతో గెలిస్తే మనవాడును మంచి విద్య, వైద్య, చేయూత, దిశగా ముందుకు తీసుకెళ్తాము. ప్రభుత్వ పథకాలు గ్రామస్తులకు సులభంగా అందేలా సహాయం చేస్తా, ప్రతి మూడు నెలలకు ఒకసారి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి పరీక్షలు అవసరమైన మందులు పంపిణి, వార్డ్ లో ఆట స్థలం కోసం కృషి, అంగన్వాడి కేంద్రం ఏర్పాటు, త్రాగునీటి కోసం ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నం, సిసి రోడ్లు డ్రైనేజీ మంచినీటి సమస్యలు దశలవారీగా పరిష్కరిస్తాం, వృద్ధులు, మహిళలు, వికలాంగులకు ప్రత్యేక గౌరవం భద్రత కల్పిస్తాం, వార్డు మొత్తం సీసీ కెమెరాలు ప్రజల భద్రత మా బాధ్యత, ముఖ్యంగా ప్రతి సమస్యను విని కలిసి పరిష్కరించుకునే నాయకత్వం అందిస్తాం అన్నారు. మున్సిపల్ కు వచ్చే 14 ఫైనాన్స్,



15 ఫైనాన్స్ నిధులను వినియోగించి, ప్రభుత్వపై ఒత్తిడి తీసుకొచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అయన తెలిపారు. 11వ తేదీన జరిగే ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికలలో మీ అమూల్యమైన ఓటును "కమలం" గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో



గెలిపించవలసిందిగా కోరారు.

# బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు దిశగా ప్రచారం



## అభ్యర్థి సబ్బని అరుణ్ ఇంటింటి ప్రచారం

## వార్డ్ ప్రజల నుంచి భారీగా లభిస్తున్న మద్దతు

**విజేత బెల్లంపల్లి :** బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి సబ్బని అరుణ్ గెలుపు దిశగా ప్రచారం జోరుగా నిర్వహిస్తున్నారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సబ్బని అరుణ్ వార్డులో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వార్డులోని ఓటర్లు బిఆర్ఎస్ అభ్య ర్థికే మద్దతు తెలుపుతున్నారు. వార్డులో బిఆర్ఎస్ పార్టీ జెండా ఎగర వేయడం ఖాయమని అభ్యర్థి ధీమా వ్యక్తం చేశారు. బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య మున్సిపాలిటీ పరిధి లో ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి పనులను గుర్తుచేస్తూ ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో 2వ వార్డులో సబ్బని అరుణ్ గెలవడం ఖాయమని ఓటర్లు అభిప్రాయం వ్యక్తం చేశారు.

**గెలిపించండి.. వార్డ్ ను అభివృద్ధి చేస్తా**

తనను ఎన్నికల్లో గెలిపిస్తే 2వ వార్డ్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు. వార్డ్ లో రోడ్లు లేని ప్రతి చోట రోడ్లు వేస్తానని తెలిపారు. వార్డులో నివసించే ప్రతి కుటుంబంలోని ఆడపిల్లల పెళ్లిలకు ఒక అన్నగా, ఆడపిల్ల జన్మిస్తే ఒక మామగా 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేస్తానన్నారు. వికలాంగులకు, వితంతువులకు, వృద్ధులకు, ఒంటరి మహిళలకు అర్హులైన అందరికి ప్రభుత్వ పెన్షన్ ఇప్పిస్తానని, వార్డులోని కుటుంబాలలో ఎవరైన మరణిస్తే దహన సంస్కారాల కోసం వెంటనే 10 వేల రూపాయల ఆర్థిక సహాయం, అవసరమయ్యే ఫ్రీజర్, వాటర్ ట్యాంక్, వైకుంఠ రథంను ఉచితంగా అందిస్తానని పేర్కొన్నారు. మహిళల కోసం స్త్రీశక్తి భవన్, టైలరింగ్, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్, టైపింగ్ లాంటి ఇతర కోర్సులకు సంబంధించిన శిక్షణను ఉచితంగా ఇప్పిస్తానన్నారు. విద్యార్థులు, యువతి యువకుల కోసం అధునాతన గ్రంథాలయాన్ని (లైబ్రరి) నిర్మించి అన్ని రకాల పుస్తకాలు ఉచితంగా అందిస్తానన్నారు. ఆర్ ఓ వాటర్ ప్లాంట్, పంపు (నల్లా) కనెక్షన్ లేని వారికి కనెక్షన్లు, ప్రతి గల్లీ, గల్లికి మురికి కాలువలు (డ్రైనేజి), వీధి దీపాలు ఏర్పాటు, ప్రతి నెల రోజులకొకసారి మెడికల్ క్యాంపు ఏర్పాటు, వార్డులోని ప్రజలందరికి అందుబాటులో ఉండే విధంగా బస్తీ దవాఖానను ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రచారంలో వార్డ్ లోని మహిళలు, యువత, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# కళ్యాణం కమనీయం నూతన వధూవరుల వెండి-బంగారం కష్టాలు!!

## డిజె ఎఫ్ డబ్ల్యు, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్. వడ్డేపల్లి హనుమంతు

**విజేత,హైదరాబాద్ ప్రతినిధి :** డిజె ఎఫ్ డబ్ల్యు, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్. వడ్డేపల్లి హనుమంతు మాట్లాడుతూ మన పెళ్లిళ్లలో ఎంతలేదన్నా తాళిబొట్టు, జత గాజులు, నల్లపూసలు, ప్రధాన ఉంగరం, ఒక నెక్లెస్ సెట్ లేదా లాంగ్ చైన్ సెట్...వరుడి ఒక చైన్, ఉంగరం, చేతి కడియం..ఇలా కనీసం ఒక 20-30 తులాల వరకూ అవసరం. ఇంకా కలిగిన వారు నడుముకు ఒడ్డాలం పెట్టుకుంటున్నారు. ఇప్పుడు దానిగురించి ఎందుకులే కనీస అవసరాలు అయిన ఒక 30 తులాలు తీసుకున్నా కూడా 22 కారెట్ల తో చేయిస్తే ఒక 50 లక్షలు పెట్టాలి.. ఇక పెళ్లి ఖర్చులు సరేసరి...వీటన్నింటినీ తగ్గించుకునే మార్గాలు మన పెద్దలు వెతకాలి.లేదంటే పెళ్లి తరువాత ఇరువురి కుటుంబాలూ కొలుకోడానికి కానీసం మూడేళ్లు పడుతుంది. తోచిన ఖర్చులు తగ్గించుకునే మార్గాలు:

**మొదటిది:** 22 కారేట్ల నుండి 14-18 కారేట్ల కు మారండి. 14 కారేట్ల బంగారం ప్రపంచవ్యాప్తంగా వినియోగంలో ఉన్నదే.. కనీసం 40 శాతం తగ్గుతుంది ఖర్చులో,నేనిక్కడ ఖర్చు అని ఎందుకు అంటున్నాను అంటే ఆభరణాల కొనుగోలు నేను ఖర్చుగానే భావిస్తాను.

**రెండవది:** మన సంప్రదాయం ప్రకారం తాళిబొట్లు వాటి తాడు కనీసం 40 గ్రాములు అవుతుంది. నల్లపూసల గొలుసు కూడా కనీసం 10 గ్రాములు ఉంటుంది. పైగా ఇప్పుడు నూతన జంటలు తాళిబొట్లు వేసుకుని తిరగడం కష్టంగా భావిస్తున్నారు. అదేంటీ అలాంటి అపచారపు మాటలు మాట్లాడుతున్నారు అని అనుకోకుండా జరిగే యదార్థం చెప్తున్నాను. ఈ రెండింటికీ ముడిపెట్టి నార్త్ ఇండియా లో చిన్న నల్లపూసల గోలుసును లకేట్స్ లాగా మంగళ సూత్రాలు సూక్ష్మంగా తయారు చేసుకుని వేసుకుంటే అటు ఫ్యాషన్, మరియు ఇటు సంప్రదాయం రెండూ పాటించిన వారు అవుతారు. రెండూ కలిపి ఒక 10 గ్రామ్స్ లో వచ్చేస్తాయి. అంటే 7 లక్షల ఖర్చు 1-2 లో చూసుకోవచ్చు. పైగా రోజూ వాడినా పెద్ద భయం లేకుండా తిరగవచ్చు. మెడలో త్రాడు కాపాడుకోడానికి మెడనే త్యాగం చేయాల్సిన పని తప్పుతుంది..

**మూడవది:** గోలుసుల చివరన గట్టి కొక్కెలు తగిలించే ఏర్పాటు



చేసుకుంటే పట్టి ఉంచే మెడ పైని భాగం గొలుసు అన్నిటికీ ఒక్కటే వాడుకోవచ్చు. ఇలా నెక్లెస్, లాంగ్ చైన్ లలో వివిధ డిజైన్స్ అలంకరించుకోవచ్చు. అలా ఒక్కో గోలుసుకు 5 గ్రాములు తగ్గుతుంది. పెండెంట్స్ కూడా తగిలించుకోవచ్చు సింపుల్ గా మోడ్రన్ డ్రస్ ల కు మ్యాచింగ్ గా. డైమండ్ పెండెంట్స్ చిన్న పరిమాణం లో ఉన్నా ఎక్కువ అందాన్ని ఇస్తాయి.

**నాలుగవది:** వెండి వస్తువులు. షాప్స్ లో రెడీమేడ్ గా తక్కువ వైట్ లో పెళ్లికి కావాల్సిన వెండి సామగ్రి లభ్యం అవుతుంది. కొన్ని బంగారం పూత ఆభరణాలు వెండితో కూడా తయారు అవుతాయి. అవికూడా అంతే అందాన్ని ఇస్తాయి. పూజా సామాగ్రిని కూడా లెస్ వైట్ తో చేయించు కోవచ్చు. ఇంతకు ముందు నాలుగైదు కిలోలు కొనాల్సిన వారు, ఒకటి రెండు కేజీల తో సమకూర్చుకునే పెళ్లి సామగ్రి ప్యాకేజీ మార్కెట్లో లభ్యం అవుతున్నాయి. ఎవరికైనా ఈ తక్కువ వైట్, ఖర్చు తక్కువ ఎక్కువ మన్నిక,

పెళ్లి ఖర్చులు: ఎంతో ఘనంగా గుర్తుంచుకొనేలా పెళ్లి చేసుకోవడం అందరి కోరిక. వీలైనంత మందిని పిలుచుకోవడం కోసం వారి ఆశీర్వాదాలు కోసం ఘనంగా ఏర్పాట్లు చేస్తుంటారు. ఒక సాధారణ పెళ్లికి కనీసం అన్ని రవాణా, వసతి ఏర్పాటు విందు వినోదం అన్నీ కలిపి 30-50 లక్షలు అవుతున్నాయి. వీటిలో ఎక్కువ మందిని మొహమాటం తో పిలవడం వచ్చిన అతిధులకి ఇరువైపులా ఏర్పాట్లు చేయడానికి ఎన్నో లక్షల అవుతున్నాయి. 200-300 కు మించకుండా అతిధులను తగ్గించుకోవడం మంచిది.. నేడు హై సొసైటీ లలో ఇలా తక్కువ మందితో ఆప్యాయంగా చేసే పెళ్లిళ్లు ముచ్చటగా ఉంటున్నాయి.

ఫోటోలు వీడియోల ప్యాకేజీ లు ఎక్కడో ఉంటున్నాయి. వాళ్ళు చెప్పే కొత్త విషయాలు, ఐడియా లతో కాదనలేక పెద్ద పేకేజీ లు ఒప్పుకుని అటు పెళ్లి చేస్తున్నామో ఫొటో షూట్ చేయడానికి ఇద్దరు హీరో హీరోయిన్ల ను మోస్తున్నామో అర్థం కాదు.. చక్కని స్నేహితుల సహకారం తీసుకుని చాలా వరకు ఫోటోల కార్యక్రమం సొంతంగా నిర్వహించుకోవచ్చు. ముఖ్యమైన ఘట్టాలలో కండిడ్ ఫోటోలు వీడియోలు తీసే ఒకరిద్దరిని వినియోగించి అన్నీ లక్షకు మించని ప్యాకేజీ మాట్లాడుకోవడం మంచిది. ఆల్బమ్ చేయించే జోలికి పోకపోవడం ఉత్తమం. నేటి డిజిటల్ యుగంలో అన్నీ ఎదురు ఉన్న స్మార్ట్ టీవీలో నే చక్కగా చూసుకోవచ్చు.

మెహిందీ, సంగీత్ లాంటి వాటికి చాలా క్లోజ్ ఫ్యామిలి తోనే జరిపుకోవడం ఉత్తమం. ఎందుకంటే మనవాళ్ళు కాకుండా వేరే వాళ్ళకి ఈ డాన్స్ లు అన్నీ కనిపిస్తాయి. అతి గా ఉందని చెవులు కోరుక్కోవడం వింటూనే ఉంటాము. అలాగే విందులలో వందల రకాల వెరైటీ లు ఎందుకు? చక్కని కమ్మని విందు భోజనం చూసుకుని ఒక 10-15 ఐటమ్స్ తో కడుపు నిండా తిని చల్లని ఆశీర్వాదం అందించి భోజన ఏర్పాట్లు చాలు. ఎక్కడా చాట్ లు తిననట్లు, అట్లు పుల్లట్లు చూడనట్లు అలా ఎగబడి పోవడం..ఒక్కొక్కరు కాదు వంద మందికి ఒకేసారి అట్లు పోయడం లాంటివి కాస్త విపరీతంగా నే ఉంటుంది. అక్కడ ప్లేట్స్ పట్టుకుని అంతటి తిరుణాల అవసరమా? పెళ్లిళ్ల ఆశీర్వాదం కోసం అతిథులను సంతృప్తి పరచడం మంచిది. దాని పేరుతో చేసే అతి ఆ వచ్చిన అతిథులకు కూడా అసూయ కలిగేలా చేయడం కొత్త జంటకు మంచిదా? పోనీ ఎవరో ఒకరు అలా చేయగలరు అనుకుంటే మిగిలిన వారు వారిని అనుకరించి అప్పుల పాలవడం ఎవరికోసం.. ఇలా ఉన్నదని అతి చేసే వారు, మధ్య తరగతి బడుగు వర్గాల నిష్టూరం పోల్చుకుంటే ఆశీర్వాదాలు పోయి కష్ట నష్టాలు మిగిలే కంటే, ఖర్చుల ను అదుపులో ఉంచుకుని సొంతానికి సమాజానికి మేలు చేయవచ్చు కదా..డీజే ఎఫ్ డబ్ల్యు, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్. వడ్డేపల్లి హనుమంతు విజ్ఞప్తి చేశారు.

# ప్రజా సేవకు అంకితమవుతా ఆశీర్వదించండి

రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్

సిపిఐ అభ్యర్థి నునావత్ పాండురంగా



**విజేత ఎదులాపురం:** 24వ వార్డులో విస్తృతంగా ప్రచారం చేస్తున్న సిపిఐ అభ్యర్థి నునావత్ పాండురంగా గత 30 సంవత్సరాలుగా డిప్యూటీ కలెక్టర్గా ప్రజలకు సేవలందించి ఉద్యోగవిరమణ చేశాను.ఇప్పుడు ఏదులాపూరం మున్సిపాలిటీ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్న 24వ వార్డు ప్రజలకు సేవలందించాలనే సంకల్పంతో మీముందుకు వస్తున్నా. మీ అమూల్యమైన ఓటును బ్యాలెట్ పేపర్ లో సీరియల్ నెంబర్ 2 కంకికొడవలి గుర్తుపై వేసి నన్ను అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నా ఇందులో భాగంగా గడపగడపకూ తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నాను. ప్రచార కార్యక్రమంలో నాయకులు అజ్మీర రాంమూర్తినాయక్ తెలంగాణ గిరిజన సమైక్య రాష్ట్ర అధ్యక్షులు, బానోత్ రామ్మోటి సీపీఐ జిల్లా సమితి సభ్యులు,ఏదులాపురం, లింగా రమేష్ సూర్యనగర్ ఇన్చార్జి, భూక్యా నాగరాజు చిన్నతండా ఇన్ ఛార్జి,రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల శాంతి భద్రతల నిర్వహణ కోసం 163 సెక్షన్



**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** ఎన్నికల సమయంలో ప్రజల శాంతి భద్రతల నిర్వహణ కోసం 163 సెక్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్టు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తెలిపారు. ఈ నెల 11 న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, భీంగల్ లో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి 163 సెక్షన్ అమలులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో 5 మంది లేదా అంతకంటే ఎక్కువ మంది ప్రజలు గుమి గూడకూడదని, సంబంధిత అధికారుల నుండి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే చట్టబద్ధమైన సమావేశాన్ని నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 9 వ తేది సాయంత్రం 05:00 గంటల నుండి 14వ తేది ఉదయం 10:00 గంటల వరకు అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఎవరైనా ఆదేశాలను ఉల్లంఘించినట్లయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కాంగ్రెస్ హామీలు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైంది

మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి.



**విజేత దేవరకద్ర :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని టిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ముగింపు ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆయన ర్యాలీ కార్యక్రమంలో పాల్గొని ఏర్పాటు చేసిన సభా సమీక్షంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మాయ మాటలను చెప్పి మోసం చేయడం సరికాదన్నారు. గత పది సంవత్సరాలలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సేవలు ప్రజలు ఇప్పటికే మరువలేక పోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మరో రెండేళ్లు మాత్రమే ఉంటుంది మళ్లీ వచ్చేటి బీఆర్ఎస్ ప్రభుత్వమే అని ఆయన అన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో దేవరకద్ర భూత్పూర్ కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రాలలో టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిచి టిఆర్ఎస్ జండా ఎగరవేస్తామన్నారు. ప్రజలు పూర్తిగా గమనించి గత ప్రభుత్వం చేసిన సేవలను గుర్తుపెట్టుకుని ప్రతి ఒక్కరు కూడా కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. దేవరకద్రలో 12 కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల మూలంగా ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలో మద్యం దుకాణాల మూసివేత

ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు, ఐపిఎస్




**విజేత, చేవెళ్ల :** మున్సిపాలిటీలు మరియు మున్సిపల్ కార్పొరేషన్లకు జరగనున్న 2వ సాధారణ ఎన్నికల సందర్భంగా, శాంతిభద్రతల పరిరక్షణ మరియు ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు, ఐపిఎస్ కీలక ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ ఎక్సైజ్ చట్టం, 1968 లోని సెక్షన్ 20 ప్రకారం, కమిషనరేట్ పరిధిలోని ఈ క్రింది ప్రాంతాల్లో మద్యం విక్రయాలపై నిషేధం,విధించడమైనది నిషేధం అమలులో ఉండే ప్రాంతాలు ఆమన్ గల్, ఇబ్రహీంపట్నం, షాద్ నగర్, చేవెళ్ల, శంకర్ పల్లి మరియు మొయినాబాద్ మున్సిపాలిటీల పరిధిలోని అన్ని కల్లు దుకాణాలు, వైన్ షాపులు మరియు రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లు. మూసివేయాలని తెలిపారు శుక్రవారం సాయంత్రం 5.00 గంటల నుండి, ఆదివారం సాయంత్రం 5.00 గంటల వరకు (పోలింగ్ ముగిసే వరకు) మద్యం దుకాణాలు పూర్తిగా మూసివేయబడతయని కౌంటింగ్ రోజున మంగళవారం ఉదయం 06.00 గంటల నుండి, ఓట్ల లెక్కింపు పూర్తయి ఫలితాలు వెల్లడయ్యే వరకు నిషేధం కొనసాగుతుంది. తెలిపారు ఈ నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయని కమిషనర్ ఆఫ్ పోలీస్ హెచ్చరించారు.

# ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలి

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య






**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని తూ.చా తప్పకుండా పాటించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య తెలియజేశారు. కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో నిజామాబాదు డివిజన్ పరిదిలో జరగనున్న సందర్భంగా బందోబస్తు ఏర్పాట్ల విషయమై సోమవారం కమీషనర్ కార్యాలయంలో సంబంధిత పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించే విధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. నిజామాబాదు డివిజన్ పరిధిలో గల సమస్యాత్మకమైన, అతి సమస్యాత్మకమైనటువంటి పోలింగ్ స్టేషన్ ని గుర్తించి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రతీ పోలింగ్ కేంద్రానికి నిర్దిష్ట దూరంలో మార్కింగ్ చేయించి, ప్రచారం గుర్తులను ప్రదర్శించడం నివారించాలని అన్నారు. అవసరాన్ని బట్టి స్ట్రైకింగ్ ఫోర్స్ సేవలను వినియోగించుకొని గుంపులను చెదర గొట్టాలని అన్నారు. ఎన్నికలను ప్రభావితం చేసే డబ్బు, మద్యం, మరే ఇతరములు అక్రమ రవాణా జరగడానికి వీలు లేకుండా అంతర్ రాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దు చెక్ పోస్ట్ లను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. సంబంధిత పోలీసు సిబ్బంది ఆయా ప్రదేశాలపై నిఘా ఉంచి, ముందస్తు సమాచారాన్ని సేకరించి, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేయాలని అధికారులకు తెలియజేశారు. ఎన్నికల రోజు సిబ్బంది తెల్లవారుజామునే తమకు కేటాయించి నటువంటి పోలింగ్ బూతు లో సక్రమమైన విధులు నిర్వహించాలని, ఎన్నికల తర్వాత ఓట్ల లెక్కింపు కార్యక్రమం మొత్తం పూర్తి అయ్యే వరకు ఎవరు ఎలాంటి ప్రలోభాలకు గురి కావద్దని, అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని విధినిర్వహణలో ఎలాంటి లోపాలు ఉన్న అట్టి సిబ్బందిపై తక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ (అడ్మిన్) జి. బస్వారెడ్డి, నిజామాబాదు ఏ.సి.పి బి. ప్రకాష్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం, టౌన్ సి. ఐ శ్రీనివాస్ రాజ్, నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, నిజామాబాద్ సౌత్ రూరల్ సీఐ సురేష్, నిజామాబాద్ రూరల్ ఎస్హెచ్ఓ శ్రీనివాస్, ఎలక్షన్ సెల్ ఇంచార్జ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, సిసిఆర్బి ఇన్స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి







ఎన్నికల విధుల రిటర్నింగ్ అధికారులు కౌంటింగ్ కేంద్రంను కట్టుదిట్టంగా పర్యవేక్షించాలి.

ప్రతి పోలింగ్ కేంద్రానికి సామాగ్రి డిపాజిట్ చేసే వరకు ఆర్వో లు బాధ్యత వహించాలి.

ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, ఓట్ల లెక్కింపు కేంద్రాలను తనిఖీ చేసి, ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్.

**విజేత ఖమ్మం :** మున్సిపల్ ఎన్నికలను పూర్తిస్థాయిలో నిష్పక్షపాతంగా నిర్వహించాలని, ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియను అధికారులు పకడ్బందీగా ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఫిబ్రవరి 11న జిల్లాలో ఐదు మున్సిపాలిటీ లలో నిర్వహించే మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్, పెద్దతండాలోని ప్రియదర్శని కళాశాలలో ఏర్పాటు చేసిన ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, రిషిప్షన్, కౌంటింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ సెంటర్ల లను కలెక్టర్ అనుదీప్ తిరుగుతూ క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిబ్రవరి 10న ఎన్నికల సిబ్బంది అందించే సామాగ్రి పంపిణీకి ముందస్తు ప్రక్రియనుపై దిశానిర్దేశం చేశారు. పోలింగ్ సామాగ్రిని, పోస్టల్ బ్యాలెట్ పత్రాలు, పూర్తి సామాగ్రి ఉందో లేదో ఎలా సరిచూసుకోవడం, బ్యాలెట్ బాక్స్, ఓటర్ లిస్ట్, బ్యాలెట్ పేపర్స్ చెక్ చేసుకోవడం, పోలింగ్ రోజున ఉదయమే సిబ్బంది పోలింగ్ స్టేషన్ వద్దకు చేరుకునేలా విధంగా వాహనాల ఏర్పాట్లుతో రూట్ ఆఫీసర్లు భాధ్యత వహించాలని, ఎన్నికల సామాగ్రి పంపిణీ నిర్ణీత సమయానికి పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకుంటూ, సమయానికి అనుగుణంగా సిబ్బందికి భోజనం ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ**

పెద్ద మున్సిపాలిటీ అయిన ఏదులాపురం నందు ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర కీలకమైనదని, ప్రతీ అంశం పైన క్షుణ్ణంగా అవగాహన చేసుకొని విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు. ఎన్నికల ముందు రోజు ఎన్నికల సామాగ్రి సేకరించడం, బ్యాలెట్ పేపర్స్ ఇవ్వడం, పివో డైరీ నింపడం, అన్ని ఫార్మ్స్ ఎలా నింపాలి, ఏజెంట్స్ సిగ్నేచర్ ఎక్కడ తీసుకోవాలి, పోలింగ్ పూర్తి అయిన తర్వాత బ్యాలెట్ బ్యాక్స్ సీలింగ్, స్టాంగ్ రూం సెంటర్ కు తరలింపు తదితర అంశాల మీద పూర్తి అవగాహన ఉండాలని, ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు వారికి ఏర్పాటు చేసిన చోటనే ఉండేలాగా చర్యలు చేపట్టాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లు పెద్ద వాహనాలు వెళ్లేందుకు వీలుగా ఏర్పాటు చేయాలని, అక్కడ అవసరమైన సదుపాయాలు భోజనం, పోలింగ్ సిబ్బందికి సునాయసంగా తెలిసేలా సైన్ బోర్డ్స్, వాహనాల పార్కింగ్ అవసరమైన స్థలం ఏర్పాటు చేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన పోలింగ్ సిబ్బంది విధులకు హాజరయ్యే విధంగా రిటర్నింగ్ అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. స్టాంగ్ రూం వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఉండాలని, కౌంటింగ్ కేంద్రాల వద్ద నిబంధనల మేరకు అన్ని చర్యలు చేపట్టాలని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు పోలింగ్ బృందాలు చేరుకున్నాయో లేదో రిటర్నింగ్ అధికారి చెక్ చేయాలని, సరైన సమయానికి చేరుకునేలా ఫాలో అప్ చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో అవసరమైన సామాగ్రి పంపిణీ చేసామో లేదో చెక్ చేయాలని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని ముందు పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. పోలింగ్ కు ముందురోజు ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్ద ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం రిటర్నింగ్ అధికారి నవీన్ బాబు, ఖమ్మం రూరల్ తహసీల్దారు రాంప్రసాద్, ఎంపీడివో లు సురేందర్, ఎర్రయ్య, మున్సిపల్ కమీషనర్ మున్వర్ అలీ, ప్రియదర్శిని కళాశాల యాజమాన్యం నవీన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్దే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం

సర్పంచ్ హేమ బాలమ్మ సురేష్



**విజేత గజ్వేల్ :** గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అంతయ గూడెం గ్రామ సర్పంచ్ హేమ బాలమ్మ సురేష్ అన్నారు. సోమవారం జగదేవపూర్ మండలంలోని అంతయ గూడెం గ్రామంలో నూతన గ్రామ గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి గ్రామ సర్పంచ్ హేమ బాలమ్మ సురేష్ కొబ్బరి కాయ కొట్టి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ హేమ బాలమ్మ సురేష్ మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి కేవలం ప్రజా ప్రభుత్వం ద్వారానే సాధ్యమవుతుందని వారు పునరుద్ఘాటించారు. గ్రామాల్లో పాలన ప్రజలకు చేరువ కావాలంటే సొంత భవనాలు ఉండాలని, అందుకే అంతయ గూడెం అధునాతన భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు.గ్రామానికి కావాల్సిన కనీస అవసరాలైన రోడ్లు డ్రైనేజీలు ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడటంలో గ్రామ పంచాయతీల పాత్ర కీలకమని, కొత్త భవనం అందుబాటులోకి వస్తే పాలన మరింత సులభతరం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రతి పేద కుటుంబానికి రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. గ్రామంలో మౌలిక వసతులు ఇండ్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తుందన్నారు. మంజూరైన లబ్ధిదారులు సకాలంలో ఇంటి నిర్మాణం చేపడితే దశలవారీగా 5 లక్షల రూపాయలు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ప్రతి కుటుంబానికి సీఎం రేవంత్ రెడ్డి సంక్షేమ పథకాలు అందుతాయని, గత ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు.గ్రామంలో ఉన్న పలు సమస్యలను తక్షణమే పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు గ్రామ నాయకులు గ్రామస్తులు కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు విద్య తో పాటు ఆరోగ్యం ఎంతో ముఖ్యం

ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్ద పెల్లి కిషన్రావు






**విజేత అదిలాబాద్ ప్రతినిధి:-** కొమురం భీం రెబ్బెన విద్యార్థులు విద్యారంగంలోనే కాకుండా వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రాష్ట్ర ట్రస్మ వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దపల్లి కిషన్రావు అన్నారు మండలంలోని ఎస్ వి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో సోమవారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పాఠశాల కరస్పాండెంట్ విజయ కుమారి ప్రిన్సిపాల్ సంజీవ్ కుమార్లు విద్యార్థుల కోసం అహర్నిశలు కష్టపడుతూ విద్యాబుద్ధులే కాకుండా అన్ని రంగాలలో తీర్చిదిద్దుతూ సమాజంలో ఎంతో మంది విద్యార్థులను ప్రయోజకులను చేశారని అన్నారు తల్లిదండ్రులు ఇంకా సహకరిస్తే అధునాతన కాలంలో విద్యను అందించడానికి ఎస్వీ ఇంగ్లీష్ మేడం యాజమాన్యం మీ ముందు ఉంటుందని పేర్కొన్నారు టిఎస్టియుసి సెంట్రల్ కమిటీ డిప్యూటీ సెక్రటరీ ప్రకాష్ రావు మాట్లాడుతూ ఎస్ వి ఇంగ్లీష్ మీడియం 1997 లో స్థాపించి గోలేట్లో మొట్టమొదటిసారిగా ఎన్నో ఘనవిజయాలు సాధించిన ఘనత ఎస్వీ ఇంగ్లీష్ మీడియం యాజమాన్యానికి ఉందని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లను ఎంతోమందిని తయారు చేశారని ఆయన తెలిపారు రుద్ర మండలంలో ప్రతి కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని సక్సెస్ చేసే ఘనత ఎస్వీ ఇంగ్లీష్ మీడియం యాజమాన్యానికి ఉందని ఫుడ్ ఫేషియల్ అన్నది ఇది ఫస్ట్ టైం చూడడం విద్యార్థులు రకరకాల తిండి పదార్థాలను తేవడం ఎంతో గర్వకారంగా ఉందని తెలిపారు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేసరి కిషన్ గౌడ్ మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం సంజీవ్ కుమార్ ఏ పనిని కూడా పట్టుదలతో చేస్తూ సక్సెస్ అవుతున్నాడని విద్యార్థులలో విద్య తో పాటు అన్ని ఆధునిక రంగంలో నేర్పడంలో ముందంజలో ఉన్నాడని అన్నారు ఫుడ్ ఫెస్టివల్ లో విద్యార్థులు రకరకాల తిను బండరాలను తేవడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో సహకార సంగం మాజీ ఉప చైర్మన్ రంగు మహేష్ గౌడ్ నంబల మార్చ్ సర్పంచ్ చిన్న సోమశేఖర్ ఓడ్నాలవెంకటేశం అలగం ప్రకాష్ రాజేందర్ రవీందర్ కోరిసింగ తిరుపతి హాసిని లతోపాటు పిల్ల ల తల్లిదండ్రులు పాల్గొన్నారు

# “గ్రామపంచాయతీ కార్మికులకు,మూడు నెలలుగా అందని జీతాలు

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలి.

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం ?26,వేల రూపాయలు ఇవ్వాలి.

యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి గంటా శ్రీనివాసరావు డిమాండ్.



**విజేత, ములకలపల్లి :** గత మూడు నెలలుగా గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు చిక్కుల శ్రీను, గంట శ్రీనివాసరావును ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడారు.. గ్రామపంచాయతీ కార్మికులు చాలీచాలని వేతనాలతో కార్మికుల కుటుంబాలు దుర్మార్గమైన జీవితాలను గడుపుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గ్రామపంచాయతీ కార్మికులందరికీ పెండింగ్లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు గ్రామపంచాయతీ కార్మికులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలు నీరుగార్చే పనిచేస్తుందని గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రతినెల మొదటి వారంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పిఎఫ్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల జీతాలు పెంచకుండా నిర్లక్ష్య వైఖరి వహిస్తుందని కార్మికులు కుటుంబాలు పెరిగిన ధరలకు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ప్రభుత్వ ఉద్యోగుల వలె గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించకపోతే సమ్మెబాట పడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పసుపులేటి వెంకటేశ్,వర్క రుక్మధరావు,మేకల రమేష్,వాగ్గేల దారయ్య,గుగులోతు శంకర్,శనగాని శంకర్, వెంకన్న,రాజు, చిట్టిబాబు, రాఘవులు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# మధిర గడ్డపై ప్రచారం చివరి రోజు హోరెత్తించిన గులాబీ శ్రేణులు







ఇచ్చిన హామీలు నెరవేర్చి మధిర ప్రజలను భట్టి ఓట్లు అడగాలి.

కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీ కార్డులకు రెండున్నర ఏళ్లు అయినా అమలు కాలేదు.

కేసీఆర్ పాలనలోనే మధిర పట్టణం అభివృద్ధి

ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజల్ని మోసం చేసిన కాంగ్రెస్ - మాజీ ఎంపీ నామ

**విజేత ఖమ్మం :** మున్సిపల్ ఎన్నికల ప్రచారం చివరి రోజున మధిర పట్టణంలోని 4, 11, 12, 13, 14, 17, 18, 20, 21, 22 వార్డుల్లో బీఆర్ఎస్ తరపున, అలాగే బీఆర్ఎస్ మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థుల కోసం ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ జడ్పీ చైర్మన్, మధిర అసెంబ్లీ ఇంచార్జి లింగాల కమల్ రాజు ఆధ్వర్యంలో, గులాబీ శ్రేణులు కూటమి అభ్యర్థులతో కలిసి ప్రచారాన్ని హోరెత్తించారు. ఈ ప్రచార కార్యక్రమంలో మధిర నియోజకవర్గానికి చెందిన పలు మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ, మధిర మున్సిపాలిటీలో ప్రజలను ఓట్లు అడగడానికి ముందు భట్టి విక్రమార్క శాసనసభ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ కార్డులు ఇచ్చి, మూడు నెలల్లో అధికారంలోకి రాగానే అందులో ఉన్న హామీలన్నింటినీ అమలు చేస్తామని చెప్పిన భట్టి విక్రమార్క, రెండున్నర సంవత్సరాలు గడిచినా ఆ హామీలను ఎందుకు నెరవేర్చలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. మధిర పట్టణంలో జరిగిన ప్రతి అభివృద్ధి పనీ కేసీఆర్ పాలనలోనే జరిగిందని నామ తెలిపారు. 100 పడకల ఆసుపత్రి, ట్యాంక్‌బండ్ నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్, సెంట్రల్ లైటింగ్, సెంట్రల్ డివైడర్, పార్కులు సహా కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు పూర్తి చేశామని గుర్తు చేశారు. మధిర పట్టణంలో తాగునీటి, సాగునీటి సమస్యలు లేకుండా, కరెంటు కష్టాలు తొలగించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల వేళ శంఖుస్థాపనలు, నిధుల మంజూరు పేరుతో హడావుడి చేస్తున్న భట్టి విక్రమార్కకు, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచిన తరువాతే మధిర అభివృద్ధి గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ప్రశ్నించారు. ఆటో కార్మికుల జీవన భద్రత, సంక్షేమంపై కాంగ్రెస్‌కు ఎలాంటి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అలాగే అర్హులైన ప్రతి పేద కుటుంబానికి తప్పనిసరిగా ఇల్లు కల్పించాలని డిమాండ్ చేశారు. మధిర మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున, అలాగే బీఆర్ఎస్ మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థులను ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించి అభివృద్ధి పాలనకు మద్దతుగా నిలవాలన్నారు. మధిర ప్రజలు కేసీఆర్ పాలన -- కాంగ్రెస్ పాలన మధ్య తేడాను గమనించి, కేసీఆర్‌కు మద్దతుగా నిలవాలని, కారు గుర్తుపై ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థులను ఘన విజయం దిశగా నడిపించాలని నామ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

# ఆసిఫాబాద్ కాగజ్ నగర్ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు 712 మంది తో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు -- జిల్లా ఎస్పీ నితిక పంత్

సోమవారం సాయంత్రం 5 గంటల నుండి పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 163 బి.ఎన్.ఎస్.ఎస్ అమలు

ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు



**విజేత అదిలాబాద్ ప్రతినిధి:-** ఈ నెల 11 న జిల్లాలోని ఆసిఫాబాద్ కాగజ్ నగర్ లలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్ తెలిపారు అభ్యర్థులు రాజకీయ పార్టీలు ప్రజలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా పాటించాలని సూచించారు సైలెంట్ పీరియడ్ అమలు పోలింగ్‌కు 48 గంటల ముందు నుండి అనగా సోమవారం రోజు సాయంత్రం 5:00 గంటల నుంచి బుధవారం వరకు సైలెంట్ పీరియడ్ అమల్లో ఉంటుందని ఎస్పీ తెలిపారు ఈ సమయంలో ఎన్నికల సభలు సమావేశాలు ఇంటింటా ప్రచారం లౌడ్‌స్పీకర్ వినియోగం ర్యాలీలు బైక్ ర్యాలీలు పూర్తిగా నిషేధం అని అన్నారు ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక పహారా నిఘా బృందాలు రూట్ మొబైల్ స్ట్రైకింగ్ ఫోర్స్ తో కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు ఈ ఎన్నికల కోసం పోలీస్ ఇతర శాఖల నుండి మొత్తం 712 మందిని నియమించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు సోమవారం సాయంత్రం 5 గంటల నుండి ఎన్నికలు పూర్తయ్యే వరకు జిల్లాలో 163 బి.ఎన్.ఎస్.ఎస్ 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో 100 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా ఆ పైగా వ్యకులు గుంపులు గుమికూడరదని తెలిపారు పోలింగ్‌కు 48 గంటల ముందు నుండి ఏ విధమైన ప్రచార కార్యక్రమాలు ర్యాలీలు సమావేశాలు నిర్వహించడం పూర్తిగా నిషేధం ఎన్నికల ఫలితాలు అనంతరం ఎలాంటి విజయోత్సవ ర్యాలీలకు బైక్ ర్యాలీలకు అనుమతి లేదని ఎన్నికలు పూర్తయిన అనంతరం సంబంధిత అధికారులు నిర్దేశించిన తేదీలలో మాత్రమే విజయోత్సవ సంబరాలు నిర్వహించుకోవచ్చు అని తెలిపారు రెండు మున్సిపాలిటీ పరిధిలో 2 స్టాటిక్ సర్వైలెన్స్ ఎస్ ఎస్ టి టీములు 2 ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు ఎఫ్ ఎస్ టి లు నిరంతరం పనిచేస్తున్నాయని అన్నారు గత ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వ్యక్తులను ఇప్పటికే బైండోవర్ చేసినట్లు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంటుందని అన్నారు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాతంగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకారం అందించాలని ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు

# మావోయిస్టుల కదలికలు కలకలం.. గాలింపు చర్యలు ముమ్మరం



**విజేత అదిలాబాద్ ప్రతినిధి:-** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అటవీ ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలు కలకలం రేపుతున్నాయి మహారాష్ట్రలోని గడ్చిరోలి నుంచి ఓ మావోయిస్టు దళం జిల్లాలోకి ప్రవేశించినట్లు నిఘా వర్గాల సమాచారం దీంతో పోలీసులు గ్రేహౌండ్స్ బలగాలు ఆసిఫాబాద్ తిర్యాణి మండలాల సరిహద్దు అటవీ ప్రాంతాల్లో గాలింపు చేపట్టాయి డోర్లి-పంగిడిమాదారం అటవీ ప్రాంతంలో మావోయిస్టులకు సంబంధించిన కిట్ బ్యాగులు సామగ్రిని గుర్తించారు అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని సహకరించవద్దని పోలీసులు ప్రజలను కోరుతున్నారు

# ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే మున్సిపల్ పోలింగ్, కౌంటింగ్ నిర్వహణ

తెలంగాణ రాష్ట్ర అసిస్టెంట్ ఎలక్షన్ కమిషనర్ ఎం. మకరందు ఐఏఎస్





**విజేత మెదక్ జిల్లా ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనలను కచ్చితంగా అనుసరిస్తూ మున్సిపల్ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలను నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర అసిస్టెంట్ ఎలక్షన్ కమిషనర్ ఎం. మకరందు ఐఏఎస్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అలాగే తూప్రాన్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ మున్సిపల్ పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలను నిర్వహించి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్, అదనపు ఎన్నికల అధికారి నగేష్‌లు అసిస్టెంట్ ఎలక్షన్ కమిషనర్ మకరందును మర్యాదపూర్వకంగా కలసి పూల మొక్క అందజేశారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయచంద్ర రెడ్డి, మున్సిపల్ కమిషనర్, డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# తుర్కపల్లి మండలం ములకలపల్లిలో వైభవంగా శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు



**విజేత :తుర్కపల్లి :** ములకలపల్లి గ్రామంలోకొలువై ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి జాతర, శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు అద్భుత వైభవంతో జరిగాయి. సోమవారం ఉదయం దిష్టికుంభం, స్వామివారి కల్యాణ మహోత్సవం తర్వాత సూర్యోదయ దర్శనం, బలిహారం అగ్నిగుండం, ఎల్లమ్మకు పుట్ట కమ్ముట; మధ్యాహ్నం బండ్ల బోనాలు, సాయంత్రం పుట్ట బంగారం, రాత్రి మల్లన్న స్వామి చరిత్ర భాగవతం---ఇవన్నీ ఘనంగా నిర్వహించి భక్తులు మునిమనసులా ఆనందించారు. అన్నదానాన్ని వెంకటాపూర్ మాజీ సర్పంచ్ కల్లూరి ప్రభాకర్ రెడ్డి భక్తిపూర్వకంగా నిర్వహించగా, రాష్ట్ర ఆర్టీఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేసి ఆలయ నిర్వాహకుల నుంచి ఘన సత్కారం పొందారు. దేవస్థాన కమిటీ చైర్మన్ గుండెబోయిన సాయి యాదవ్, సర్పంచ్ బానోతు భూలి వీరన్ననాయక్, మాజీ సర్పంచ్ ఇమ్మడి మల్లప్ప, ఉపసర్పంచ్ హేమలత సాయి మల్లేష్, పూజారి శిగమూగే మల్లయ్య, గుడి పంతులు బ్రహ్మయ్య, ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, ఎంపీఓ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి కూరేళ్ల నాగరాజు, కమిటీ సభ్యులు బాలు యాదవ్, శ్రీనివాస్, గుండెబోయిన మల్లేశం, ఐలేష్, శివలింగం, గుండెబోయిన భరత్, రాజు, డాక్టర్ బాలయ్య, కసిర బోయిన చంద్రయ్య తదితరులతో గ్రామస్తులు భారీగా పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు.

# ఇంటర్ ప్రాక్టికల్ పరీక్ష కేంద్రం మార్పు

పరీక్షలు యథాతథం



**విజేత పరకాల ప్రతినిధి :** పరకాల మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కేంద్రం కోసం ఈనెల 10,11 వ తేదీలలో పరకాల పట్టణం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్ నెంబర్ 38046 లో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక ప్రాక్టికల్ పరీక్షలు,పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాల కి ప్రక్కన ఉన్న ఎస్వీ జూనియర్ కళాశాల పరకాల లో నిర్వహించబడునని కళాశాల ప్రిన్సిపాల్ కె సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈ నెల 10,11 వ తేదీలలో పరకాల మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాలను కళాశాల తరగతి గదులతో ఏర్పాటు చేసిన సందర్భంగా,జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఏ. గోపాల్ ఆదేశాల మేరకు ఈనెల 10,11 వ తేదీలలో జరిగే ఇంటర్ వార్షిక ప్రాక్టికల్ పరీక్షల సెంటర్ ను, పరకాల లోని ఎస్వీ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేశామన్నారు.ఈ సందర్భంగా ప్రాక్టికల్ పరీక్షలు వ్రాసే 38046,38048,38060,38330,38332 కళాశాల సెంటర్ ల లోని విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించి, సహకరించగలరని పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కే సంపత్ కుమార్ పేర్కొన్నారు..

# మున్సిపల్ ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న ఆర్మూర్ కాంగ్రెస్ ఇంచార్జ్ ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి



**విజేత,ఆర్మూర్ :** 33 వ వార్డు, 20వ వార్డు, 23వ వార్డు,04 వ వార్డులలో ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థుల తో కలిసి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న వినయ్ కుమార్ రెడ్డి 33 వ వార్డులో కౌన్సిలర్ కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి బొగడ మీద రాణి గారి 20 వ వార్డు అరిఫా కనం గారి, 23వ వార్డు చెలిమెల శ్రీనివాస్ మరియు 04 వ వార్డు సరికల సృజన్ గార్ల ఎన్నికల ప్రచారంలో భాగంగా మహిళా ఓటర్లను, యువ ఓటర్లను మరియు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన ఆర్మూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి 33వ వార్డు మరియు 20 వ ,23 వ ,04 వ వార్డుల్లో కాంగ్రెస్ బలపరిచిన గారికి మద్దతు ఇచ్చి భారీగా గెలుపు అందించాలని కోరిన ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి మరియు వారితో పాటు పాల్గొన్న ఆర్మూర్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మరియు ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్ తదితర ఆర్మూర్ పట్టణ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు భారీగా సంఖ్యలో పాల్గొన్నారు.

# ఢిల్లీలో మేరిసిన వరుణ్ ను సన్మానించిన రామకోటి సంస్థ

తెలంగాణ నుండి గజ్వేల్ వాసికి దక్కిన ఘనకీర్తి

భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు



**విజేత గజ్వేల్:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ గ్రామానికి చెందిన ఇంజనీరింగ్ చదువుతున్న ఆయిల వరుణ్ అనే విద్యార్థి ఢిల్లీలో జరిగిన 77వ రిపబ్లిక్ డే పరేడ్ లో తెలంగాణ ఎన్సిసి తరపున పాల్గొనడం తమ గ్రామానికి జిల్లాకు గర్వకారణం అని భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రామకోటి రామరాజు సోమవారం నాడు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గజ్వేల్ నుంచి ఇప్పటివరకు ఢిల్లీ థర్డ్ లో పాల్గొన్నటువంటి వ్యక్తులు ఎవరు లేరని ఇది గజ్వేల్ కె కాక మొత్తం సిద్దిపేట జిల్లాకే గర్వకారణమన్నారు. ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆశీర్వదిస్తూ అభినందించారు. ఈ కార్యక్రమం విద్యార్థి తల్లిదండ్రులు అయిల శ్రీనివాస్ కృష్ణవేణి పాల్గొన్నారు.

# తపస్ జిల్లా మహిళా కన్వినర్ గా డా. పాతూరి స్వప్న శ్రీ



**విజేత, మాసాయిపేట :** మెదక్ జిల్లా తపస్ మహిళా కన్వినర్ గా డాక్టర్. పాతూరి స్వప్న శ్రీ ని ఎన్ను కున్నారు. తపాస్ రాష్ట్రకార్య వర్గం, జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది. డాక్టర్ స్వప్నశ్రీ మాట్లాడుతూ నన్ను గుర్తించి మహిళా కన్వీనర్ గా బాధ్యతలు అప్పగించిన తపస్ నాయకత్వానికి నాతోటి సభ్యులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేయడం జరిగింది.కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ , దుబాశి భాస్కర్, రంగారెడ్డి, ఎల్లం, సిద్దు, జిల్లా కార్య వర్గం పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ సాఫీగా జరగాలి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రాహుల్ రాజ్



**విజేత మెదక్ జిల్లా ప్రతినిధి :** మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా నిర్వహించాల్సిందిగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ ఎన్నికల అధికారులకు స్పష్టం చేశారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరగనున్న నాలుగు మున్సిపాలిటీ ఎన్నికలు ఎలాంటి అంతరాయం లేకుండా సాఫీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏ పనులు పెండింగ్‌లో ఉన్నా ఈ రోజే పూర్తి చేయాలని, రేపు ఉదయం 9 గంటలలోపు ఎన్నికల సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో తప్పనిసరిగా రిపోర్ట్ చేయాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎన్నికల సిబ్బందికి తగినన్ని కౌంటర్లు ఏర్పాటు చేసి సరైన మార్గనిర్దేశనం చేయాలని సూచించారు. ఆర్వోలు, జోనల్ అధికారులు ఎన్నికల సామాగ్రిని సమగ్రంగా పరిశీలించి, పోలీస్ ఎస్కార్ట్ వాహనాలతో పోలింగ్ కేంద్రాలకు బయలుదేరాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బందికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ అధికారులను కోరారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ అవసరమైన పత్రాలను సరిగ్గా నింపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ నగేష్, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# గోల్డ్ మెడలిస్ట్ చదువుకు అడ్డంకులు తొలగించిన ఎమ్మెల్యే కె.పి. వివేకానంద



**అక్షర విజేత, కుత్బుల్లాపూర్ :-** మైక్రోబయాలజీ డిగ్రీలో గోల్డ్ మెడల్ సాధించిన పేద విద్యార్థి శ్రీపతి ఉదయ్ కుమార్‌కు బి.ఆర్.ఎస్. ఎల్.పి. విప్, స్థానిక ఎమ్మెల్యే కె.పి. వివేకానంద సహకారంతో ఆర్థిక చేయూత లభించింది. ఆస్ట్రేలియాలోని ప్రతిష్టాత్మక =వీ×ు యూనివర్సిటీలో మైక్రోబయాలజీ విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుకునే అవకాశాన్ని సాధించిన ఉదయ్ కుమార్, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత విద్యకు ఆటంకం ఏర్పడడంతో ఎమ్మెల్యేని ఆశ్రయించారు.విద్యార్థి అభ్యర్థనకు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కె.పి. వివేకానంద లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ సభ్యులకు విషయం తెలియజేశారు. ఎమ్మెల్యే సిఫారసుకు సానుకూలంగా స్పందించిన లయన్స్ క్లబ్ సభ్యులు సోమవారం ఉదయం రూ.1,30,000 ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చేతుల మీదుగా విద్యార్థికి అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.పి. వివేకానంద మాట్లాడుతూ, తాను సిఫారసు చేసిన కేవలం మూడు రోజుల్లోనే విద్యార్థికి అండగా నిలిచిన లయన్స్ క్లబ్ సభ్యుల సేవాభావం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులోనూ ఇలాగే పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. నియోజకవర్గంలో పేద విద్యార్థులు వైద్య, ఇంజనీరింగ్ తదితర ఉన్నత విద్యను పూర్తిచేసుకునేందుకు తన వంతుగా ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షులు ఆంజనేయులు, డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ విజయ్ కుమార్ శెట్టి, సీనియర్ సభ్యులు చల్లా శ్రీనివాస రెడ్డి, రామేశ్వర్ రెడ్డి, కోలా వెంకటేష్, ముదిరాజ్ శ్రీనివాస్ రెడ్డి, నరసింహులు గౌడ్, బాలరాజు, ప్రవీణ్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలి

రంజాన్ మాసం ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ సమీక్ష





**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** రంజాన్ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా అధికారులతో తన ఛాంబర్ లో సమావేశమై, రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లు, కల్పించాల్సిన సౌకర్యాలపై సమీక్ష జరిపారు. ఎలాంటి ఇబ్బందులు, లోటుపాట్లకు తావులేకుండా జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాలలో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా సమన్వయంతో పని చేయాలని అధికారులకు సూచించారు. ప్రధానంగా ఎక్కడ కూడా తాగునీరు, పారిశుద్ధ్యం వంటి సమస్యలు తలెత్తకుండా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి బాధ్యతలు పురమాయిస్తూ, నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చూడాలని, వీధి దీపాల మరమ్మతులు జరిపించాలన్నారు. బోర్లు, పైప్ లైన్ మరమ్మతులు ఉంటే ముందస్తుగా చేపట్టాలని తెలిపారు. అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ప్రార్థనా సమయాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రార్థనా మందిరాల వద్ద మసీదులు, ఈద్గాల వద్ద పారిశుధ్య సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్య శిబిరాలు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఎక్కడ కూడా శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు డీసీపీ బస్వారెడ్డి, జెడ్పి సీ.ఈ.ఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్ రావు, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బిచ్కుందలో "గందరగోళం" ముమ్మర ప్రచారం చేసిన అంతుచిక్కని "ఓటరు నాడి"..

స్వతంత్ర అభ్యర్థుల బెడద, స్వతంత్ర అభ్యర్థుల హవా కొనసాగేనా...?



**విజేత బిచ్కుంద :** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మున్సిపల్ పరిధిలో 12 వార్డులలో ఎన్నికల్లో భాగంగా అన్ని ప్రధాన పార్టీలో జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. పలుమార్లు వార్డులలో జోరుగా ప్రచారం నిర్వహిస్తున్న బిచ్కుంద అన్ని పార్టీ నాయకులకు గందరగోళం మొదలైంది. ఎంత ప్రచారం నిర్వహిస్తున్న ఓటర్ల నాడి అందుకు లేకపోతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా సర్పంచ్ ఎన్నికల్లో బిచ్కుందలో అధికార పార్టీకి విజయం దక్కలేదు. స్వతంత్ర అభ్యర్థుల విజయం కొనసాగింది. పార్టీలకు అతీతంగా ప్రజల్లో మంచి పేరున్న నాయకులు గెలిచిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఇదేలా ఉంటే స్వతంత్ర అభ్యర్థులు బిచ్కుందలో గట్టిగానే పోటీనిస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థుల బెడద అన్ని పార్టీలకు శాపంలా మారింది. సోమవారంతో ప్రచారం ముగియనుంది, ఇక ఏ పార్టీ ఏ విధంగా ఓటర్ నాడి తెలుసుకుంటుందో, ఎలా విజయకేతనం ఎగరవేస్తుందో వేచి చూడాల్సిందే.

## బీఆర్ఎస్ విజయాన్ని కాంక్షిస్తూ పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ





**విజేత, ఆర్మూర్ :** అగ్రభాగాన పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆర్మూర్ మున్సిపాలిటీ కేంద్రంలోని మొత్తం 36 వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు సోమవారం పట్టణంలో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అన్ని ప్రధాన రహదారుల మీదగా సాగిన ఈ బైక్ ర్యాలీ అగ్రభాగాన బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి పాల్గొనన్నారు. వెంకటేశ్వర కాలనీ నుంచి పెర్కిట్ వరకూ అక్కడి నుంచి మామిడిపల్లి దాకా అక్కడి నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా నల్ల బజార్, పోచమ్మ కమాన్, అంగడి బజార్, జిరాయత్ నగర్ మీదుగా మసీద్ నుంచివడ్డెర కాలనీ, హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఎమ్ జే హాస్పిటల్, వెంకటేశ్వర కాలనీ వరకు ఈ భారీ బైక్ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో బీఆర్ఎస్ పట్టణ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

## బాల్యవివాహాలను అరికట్టాలి

అంగన్వాడీ టీచర్



**విజేత, మెదక్ ప్రతినిధి :** బాల్యవివాహాలను పూర్తిగా అరికట్టాలని, అవి పిల్లలకు చట్టపరంగా మరియు ఆరోగ్యపరంగా అనర్థదాయకమని చేగుంట మండలం పులిమామిడి గ్రామ అంగన్వాడీ టీచర్ తెలిపారు. సోమవారం గ్రామంలో పిల్లల ఎత్తు, బరువు కొలిచే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల ఎత్తు, బరువు కొలిచి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. పిల్లలకు పౌష్టికాహారం అందించేలా చూడాలని, ఫాస్ట్ ఫుడ్‌కు దూరంగా ఉంచాలని సూచించారు. అదేవిధంగా బాల్యవివాహాలు చేయవద్దని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ కమల, గ్రామ సర్పంచ్ రావి పల్లి శ్రీనివాస్ రెడ్డి, సెక్రటరీ సవిత ,వార్డు సభ్యులు గ్రామస్తులు పలువురు మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.



## ఓటింగ్ కోసం 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా చూపవచ్చు

జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి




**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** ఈ నెల 11న జరగనున్న నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వచ్చే సమయంలో 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒక దానిని తమ వెంట తీసుకెళ్లాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఓటర్ కార్డు, ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, ఫోటోతో కూడిన పోస్ట్ ఆఫీస్, బ్యాంక్ పాస్ బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ ద్వారా జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, లేబర్ గుర్తింపు కార్డు, ఇండియన్ పాస్పోర్ట్, ఫోటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వంచే జారీ చేయబడిన ఉద్యోగ గుర్తింపు కార్డు,ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఇచ్చిన అధికారిక గుర్తింపు కార్డు, దివ్యాంగుల గుర్తింపు కార్డు తదితర వాటిలో ఏదైనా ఒక దానిని చూపించి ఓటు వేయవచ్చని కలెక్టర్ సూచించారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకుని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలని కలెక్టర్ కోరారు.

## పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు ఎస్పి రత్నం..

**విజేత దేవరకద్ర :** దేవరకద్రలో జరిగే మున్సిపల్ ఎన్నికల భాగంగా పోలింగ్ కేంద్రాలను సోమవారం అదనపు ఎస్పీ రత్నం తనిఖీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ నిర్వహించే వార్డుల . ఆయన పరిశీలించి మాట్లాడుతూ ఓటర్లు ప్రతి ఒక్కరు కూడా తమ పోలింగ్ కేంద్రాలలోని తమ ఓటును స్వచ్ఛందంగా వేసుకోవచ్చన్నారు. ఎవరు కూడా ఎలాంటి భయమందునకు గురికాకుండా ప్రతి ఒక్కరు కూడా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులుగా, ఎలాంటి గొడవలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఆయన వెంట సిఐ రామకృష్ణ, ఎస్సై బి నాగన్న, తదితరులు ఉన్నారు.

## సైబర్ క్రైమ్ నేరగాళ్ల వేధింపులకుయువ రైతు మృతి

విషాదంలో తిప్పాపురం గ్రామం






**విజేత. వెంకటాపురం. నూగురు :** ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని తిప్పాపురం గ్రామానికి చెందిన కోరం రామారావు. అనే యువ రైతు సైబర్ క్రైమ్ నేరగాళ్ల వల్ల లో చిక్కుకొని వేధింపులు తట్టుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కోరం రామారావు. తిప్పాపురం గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అనుకోకుండా వచ్చిన ఫోన్ కాల్ కి సమాధానం ఇవ్వడంతో. సైబర్ క్రైమ్ నేరగాళ్లు రామారావు నుండి పూర్తి సమాచారం సేకరించారు. విషయం గమనించని రామారావు. సైబర్ క్రైమ్ నేరగాళ్లకు పూర్తి సమాచారం ఇచ్చారు. ఇదే అదునుగా రామారావును వేధించడం ప్రారంభించారు. విషయం చేజారి పోతుందని గమనించిన రామారావు. వెంకటాపురం పోలీసు వారికి సమాచారం అందించారు. పోలీస్ శాఖ వారు. తగు జాగ్రత్తలు చెప్పి. పంపించారు. అయినా కూడా కోరం రామారావుని. సైబర్ క్రైమ్ నేరగాళ్లు. మీ పిల్లలను కిడ్నాప్ చేస్తామని. మీ అమ్మాయికి ప్రభుత్వం నుండి వచ్చే ఏ ఉద్యోగం రానివ్వమని అలా ఎన్నో విధాలుగా బెదిరించడం ప్రారంభించారు. భయపడిన రామారావు ఆదివారం. పురుగుల మందు తీసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వెంకటాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రామారావు మృతి చెందాడు. కోరం రామారావు మృతితో తిప్పాపురం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి విషయం తెలుసుకున్న వెంకటాపురం. ఎస్సై. దర్యాప్తు ప్రారంభించారు.

## పబ్లిక్ మీటింగ్ లో పాల్గొన్న టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్






**విజేత, ఆర్మూర్ :** ఆర్మూర్ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఆరుగురు పాత బస్టాండ్ అంగడి బజార్ పబ్లిక్ మీటింగ్లో పాల్గొని ప్రసంగించిన శ్రీ మహేష్ కుమార్ గౌడ్ మరియు ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి ఆర్మూర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరిన మహేష్ కుమార్ గౌడ్ మరియు వినయ్ కుమార్ రెడ్డి మరియు వారితో పాటు పాల్గొన్న ఏబీ చిన్న మరియు ఆర్మూర్ మున్సిపల్ ఎన్నికలలో బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థులు, ఆర్మూర్ పట్టణనాయకులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 1800 బైక్ లతో భారీ ర్యాలీ చేపట్టిన ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి



**విజేత,ఆర్మూర్ :** ఎమ్మెల్యే బైక్ నడుపుతూ బిజెపి కార్యకర్తలను ఉత్తేజపరిచాడు . ఆర్మూర్ పట్టణంలోని అన్ని వార్డుల తిరుగుతూ బైక్స్ 1800 బైక్ ల పై తిరుగుతూ బిజెపిని గెలిపించాలని 36 వార్డులలో 1800 బైక్ లతో ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని బిజెపి వార్డు కౌన్సిలర్లు బిజెపి అభిమానులు విజయవంతం చేశారు. ఎమ్మెల్యే తదనంతరం మాట్లాడుతూ 36 కౌన్సిలర్లను కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం బైక్ ర్యాలీలతో వార్డులలో తిరుగుతూ బిజెపి అనే నినాదంతో ముందుకు సాగుతూ హిందూత్వ వాదంతో ముందుకు సాగుతూ బిజెపికి ఓటు వేయాలని బిజెపిని మున్సిపల్ ఎలక్షన్ లో జై కేతనం వేయాలని ఆయన తెలిపారు.



## నేటి సమాజంలో మీడియా పత్రికల పాత్ర కీలకం



**విజేత,రాయికల్:** ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా పని చేసేవి మీడియా, పత్రికలని రాయికల్ మండల అభివృద్ధి అధికారి బింగి చిరంజీవి అన్నారు. సోమవారం రాయికల్ పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో న్యూస్ 9 టీవీ మీడియా 2026 క్యాలెండర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేసేవి మీడియా, పత్రికలని, ప్రభుత్వం ప్రవేశపెట్టి ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరవేయడంలో మీడియా పత్రికల పాత్ర కీలకమని అన్నారు. నేటి సమాజంలో మీడియా, పత్రికల పాత్ర కీలకమని, వీటికి స్వేచ్ఛ ముఖ్యమన్నారు. ఎవరికి భయపడకుండా నిర్భయంగా నిస్సంకోసంగా వార్తలు రాసి నిజా నిజాలను నిగ్గు తీర్చాల్సిన అవసరం మీడియా, పత్రికలపై ఉందన్నారు. వార్తల సేకరణలో ముందుంటూ నిత్యం ప్రజలకు అన్ని విషయాలను వేగంగా చేరవేస్తూ ప్రజలను చైతన్య పరుస్తూ సమాజ శ్రేయస్సు కోరి వివిధ విభిన్న కథనాలను ప్రచురిస్తూ సమసమాజ నిర్మాణానికి పాటుపడుతున్నవి మీడియా పత్రికలేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సుష్మ, న్యూస్ 9 టీవీ ప్రతినిధి అనుపురంలింబాద్రిగౌడ్, పాత్రికేయులు చింతకుంట సాయికుమార్, కనికరపు లక్ష్మణ్, గన్నవరం గంగాధర్,వాసం లింబాద్రి, కళ్లెం శ్రీనివాస్, పడాల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## గాగిరెడ్డిపల్లె లో మంచి నీటి సరఫరా పైపులైన్స్ పరిశీలన



**విజేత: చిగురుమామిడి :** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం లోని గాగిరెడ్డిపల్లె గ్రామంలో రాబోవు వేసవికాలం దృష్ట్యా మంచినీటి సరఫరా వ్యవస్థ పై సర్పంచ్ సన్నిల కవిత అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామంలో ఎంపీడీవో విజయ్ కుమార్ ఎంపీఓ ఖాజమైద్దీన్ ఆర్డబ్ల్యూఎస్ ఏఈ జ్ఞానేశ్వరి లతో కలసి పర్యటించి పైప్ లైన్లు, మంచినీటి ట్యాంక్ లను పరిశీలించారు. ప్రజలకు ఇలాంటి ఇబ్బందులు కలగకుండా నేటి సరఫరా చేసేందుకు కృషి చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వడ్లకొండ నరేందర్ రెడ్డి, వార్డు సభ్యులు కూన సురేష్ గట్టు మంజుల,మంద శ్రీనివాస్,సతీష్, బొమ్మగాని వెంకటేశం, కార్యదర్శి సంపత్ తదితరులు పాల్గొన్నారు

## రామంచ లో ఇసుక తవ్వకాలకు అడ్డుకున్న రైతులు



**విజేత :చిగురుమామిడి :** కడెం, మిడ్ మానేరు,తిమ్మాపూర్ డ్యామ్ నీటి నిల్వల్లో పూడికతీత పేరుతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని రామంచ గ్రామ శివారులో ఇరిగేషన్ శాఖ అధికారులు గత మూడు రోజులుగా జేసీబీల సహాయంతో ఇసుక తవ్వకాలకు దారులు ఏర్పాటుచేస్తూ, రామంచ వాగు పరిధిలోని ఇసుకను కొత్తపెల్లి శివారు దాటి తరలించే ప్రయత్నం చేయగా రైతులు తీవ్రంగా నిరసనకు దిగారు.రామంచ గ్రామ సర్పంచ్ కిషన్ రెడ్డి నాయకత్వంలో గ్రామస్తులు, రైతులు సంఘటనా స్థలానికి చేరుకొని ఇరిగేషన్ అధికారుల ఎదుట ఆందోళన చేపట్టారు. ఇసుక తవ్వకాల వల్ల బోర్లు, బావులు ఎండిపోవడమే కాకుండా భూగర్భ జలమట్టం గణనీయంగా తగ్గి, దాదాపు 400 నుంచి 500 ఎకరాల వరకు పంట పొలాలు ఎండిపోతాయంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తమ జీవనాధారం అయిన వ్యవసాయాన్ని కాపాడుకోవడానికి అవసరమైతే ఎంత దూరమైనా వెళ్లేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. సమాచారం అందుకున్న చిగురుమామిడి ఎమ్మార్వో ముద్దసాని రమేష్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. రైతుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని, సమస్యకు పూర్తి స్థాయిలో పరిష్కారం లభించే వరకు ఇసుక తవ్వకాల పనులను తక్షణమే నిలిపివేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ నిరసన కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. భూగర్భ జలాల సంరక్షణతో పాటు పంటల రక్షణే తమ ప్రధాన లక్ష్యమని రైతులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో గ్రామం లోని రైతులు పాల్గొన్నారు

## డబుల్ బెడ్ రూమ్ చిచ్చు,వారిది స్కాం కంపెనీ అని ఆరోపణ



**విజేత, హైదరాబాద్ బ్యూరో:** కంటోన్మెంట్ నియోజకవర్గం మారేడుపల్లి డబల్ బెడ్ రూమ్ల పంపిణీ విషయంలో అధికార కాంగ్రెస్ బిజెపి మధ్య మాటల యుద్ధం సాగుతోంది. స్థానికేతరులకు డబల్ బెడ్ రూములు కట్టబెడుతున్నారని ఆరోపణలు చేస్తూ ఆ సముదాయం వద్ద కార్పొరేటర్ కొంత దీపిక బాధితులతో కలిసి నిరసన తెలిపిన విషయం తెలిసిందే కాగా, ఈ ధర్నాపై స్థానిక కాంగ్రెస్ నాయకుడు డ్రామా కంపెనీ అంటూ ఆరోపణలు చేశారు. అందుకు కార్పొరేటర్ దీటుగా సమాధానం ఇచ్చారు. మాది డ్రామా కంపెనీ అయితే, మీది స్కాముల కంపెనీ అని అమె మండి పడ్డారు. కేవలం ఎమ్మెల్యేకు భజన చేసే బ్యాచ్ అని ఆమె ఎద్దేవా చేశారు పూటకో కండువా మార్చిన మీరు ప్రజలకు ఏం చేశారో, వారే సమాధానం చెబుతామని హెచ్చరించారు. కబ్జాలు చేయడం మీ వంతు అని ఆమె తెలిపారు. కేవలం తమ పబ్బం గడుపుకోవడానికి మాత్రమే ఇలా చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆమె వెల్లడించారు. ఇక డబల్ బెడ్ రూమ్ ల పంపిణీ విషయంలో కార్పోరేటర్ గా లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఏం చేశామో స్థానికులు సమాధానం ఇస్తామని బుద్ధి చెప్పారు. చిల్లర రాజకీయాలు మానుకోవాలని సూచించారు. ప్రజా సమస్యలపై ఐదు ఏళ్లుగా ఏం చేశారో సమాధానం చెప్పేందుకు ప్రజల మధ్యకు రావాలని సవాలు విసిరారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ తాండూరు

## జోన్-2 రీజియన్ -2 డిస్ట్రిక్ట్ -320ఆ 51 వార్షికోత్సవం







**విజేత తాండూరు :** తాండూరు లయన్స్ క్లబ్ ఆఫ్ జోన్-2 రీజియన్ -2 డిస్ట్రిక్ట్ -320ఆ 51 వార్షికోత్సవం చార్టర్ నైట్ మరియు గవర్నర్ అఫిషియల్ విసిట్ సందర్భంగా తేదీ 8-2-2026 సోమవారం సాయంత్రం 8 గంటలకు సల్లా గార్డెన్ నందు నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథి గా డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డా.జీ.మహేంద్ర కుమార్ రెడ్డి,మరియు రీజియన్ చైర్మన్ లయన్ మనోహర్ రెడ్డి ,జోన్ చైర్మన్ లయన్ రాజు భయంకర్ , డిస్ట్రిక్ట్ కేబినెట్ సెక్రటరీ లయన్ తాళ్ళ అంజయ్య, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ రమేష్ చంద్ర పండిట్ పాల్గొనడం జరిగింది, ఇటీవల షాద్ నగర్ లో జరిగిన రీజియన్ మీటింగ్ లో తాండూరు లయన్స్ క్లబ్ కు 14 అవార్డ్స్ రావడం పట్ల అభినందించడం జరిగింది.ఈ కార్యక్రమం లో పెద్దేముల్ మండలం, కందనెల్లి జడ్పీహెచ్ఎస్ కి స్కూల్ కి అల్మారా గవర్నర్ చేతుల మీద హెడ్మాస్టర్ శెట్టి శివ కుమార్, పి డి రాధాకృష్ణ గార్లకు డొనేట్ జరిగింది. స్పాన్సర్ లయన్ శరణ్ బసప్ప,లయన్ గౌరీ శంకర్. తాండూరు లయన్స్ క్లబ్ మెంబెర్స్ అందరు పాల్గొనడం జరిగింది.

# పేకాట స్థావరం పై దాడి

## రూ.13వేలు జప్తు- కేసు నమోదు

**విజేత,పాపన్నపేట :** అటవీ ప్రాంతంలో పేకాట స్థావరం పై పాపన్న పేట ఎస్ఐ, స్పెషల్ పోలీసులు దాడి చేసి రూ.13 వేల నాలుగు వందలు జప్తు చేసి పేకాట రాయుళ్ళ పై కేసు నమోదు చేసినట్లు పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని అన్నారం అటవీ ప్రాంతంలో శంకరంపేట మండలంలోని చందం పేట గ్రామానికి చెందిన ఇరువురు తోపాటు అన్నారం గ్రామానికి చెందిన మరొకరు కలసి పేకాట ఆడుతున్నారన్న విశ్వాసనీయ సమాచారం మేరకు ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ స్పెషల్ పోలీసులు దాడి చేసి 13వేల నాలుగు వందల రూపాయల తోపాటు ముగ్గురిని అదుపులోకి తీసుకొన్నారు. పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు..

# శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ ముద్దం



**విజేత, హైదరాబాద్ బ్యూరో:** శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం శ్రీశైల బ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, అభిషేకాల్లో ఓల్డ్ బోయిన్‌పల్లి 119 డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వారికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ప్రజలందరికీ ఆరోగ్యం, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌తో పాటు ఆయన మిత్రబృందం ఎలకంటి సత్యమూర్తి గుప్తా, గడ్డం నర్సింగరావు, బుర్రి యాదగిరి, విజయ్ కుమార్ రెడ్డి, జంగా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ యాదవ్, వెంకటేష్ యాదవ్, దేవేందర్ రాజు, మోహన్, మధు తదితరులు పాల్గొన్నారు.

# తూప్రాన్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో చివరి రోజు కాంగ్రెస్ నేతల హోరాహోరీ ప్రచారం



**విజేత, హైదరాబాద్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా తూప్రాన్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో చివరి రోజున కాంగ్రెస్ పార్టీ నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, తూప్రాన్ మున్సిపాలిటీ అబ్జర్వర్ బండి రమేష్, గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తుంకుంట నర్సారెడ్డి, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మున్సిపాలిటీలోని 16 మంది కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరపున ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మున్సిపాలిటీల అభివృద్ధి, ప్రజా సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపిశెట్టి దినేష్, గంధం రాజు, అరవింద్ రెడ్డి, నితీష్ గౌడ్, గాదే శివ చౌదరి, హరిప్రసాద్ నాయుడు, కుక్కల రమేష్, వినయ్, శ్రావణ్, అహ్మద్, రాజ్ కుమార్, నవీద ఖాన్, రాకేష్ కిరణ్, బాలు, హర్ష, వాసు, అజయ్, వెంకటేష్ తదితరులు పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

# క్యాతనపల్లి మున్సిపాలిటీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి ఏసిపి రవీందర్



**విజేత రామకృష్ణాపూర్ :** రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్యాతనపల్లి మున్సిపాలిటీ లో ఈనెల 11న జరుగుతున్న 22 వార్డులలో ఎన్నికల నేపథ్యంలో మున్సిపాలిటీ పరిధిలోని 14 పోలింగ్ కేంద్రాలు 45 పోలింగ్ బూతులు ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో సుమారుగా 150 మంది పోలీసులతో పోలీస్ యంత్రాంగం బందోబస్తును నిర్వహించారు. మున్సిపాలిటీలో పోలింగ్ బూత్ల ముందు ఎవరు ఉండరాదని 200 మీటర్ల బయటనే ఉండాలని. ఏ ఇతర ప్రచారాలు గాని చేయడానికి అనుమతి లేదు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏసిపి ఏ రవికుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సిఐ పి రమేష్, మందమరి ఎస్సై గోపతి నరేష్, రామకృష్ణాపూర్ ఎస్సై శ్రీధర్, చుట్టుపక్కల పరిధిలోని ఎస్సైలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 12 దేశవ్యాపిత సార్వత్రిక కార్మిక సమ్మెలో పాల్గొందాం

## గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ల పిలుపు

**విజేత రేవల్లి, వనపర్తి, ప్రతినిధి ;** వనపర్తి జిల్లా గోపాలపేట మండలం పరిధిలోని బుద్దారం గ్రామంలో సమ్మె నోటీస్ ను గ్రామ సర్పంచ్ శేఖర్, పంచాయతీ కార్యదర్శి కాశన్న, ఉప సర్పంచ్ శివాజీ లకు సోమవారం అందజేశారు.కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను ప్రభుత్వాలు ఒక్క కలం పోటుతో వాటిని రద్దు చేస్తున్నారు. కార్మిక సంక్షేమాలు, ప్రయోజనాలను పరిగణలోకి తీసుకుని రూపొందించబడ్డ హక్కులను ఒక్కొక్కటిగా తొలగిస్తున్నారు. అందులో భాగమే 29 కార్మిక చట్టాలను, నాలుగు లేబర్ కోడ్స్ మార్చారు. “తాటి చెట్టు ఎందుకు ఎక్కావని అడిగితే వెనకటికి ఒకడు దూడ గడ్డి కోసం అన్నాడట.” సరిగ్గా నేడు పాలకవర్గాలు బ్రిటిష్ కాలంలో వచ్చిన కార్మిక చట్టాలను నూతనీకరణ చేస్తున్నామని, కార్మికులకు లాభం కలిగే విధంగా సవరిస్తున్నామని ప్రకటిస్తున్నారు. ఇది నిజమా?తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయితీలలో మరియు మునిసిపాలిటీలలో లక్ష మందికి పైగా వున్నారు. పైగా కార్మికులు బడుగు, బలహీన వర్గాల వాళ్లు సేవలందిస్తున్నారు.( గ్రామపంచాయితీలలో కేవలం 9500 రూపాయల వేతనాలను “మల్టీపర్పస్” పేరుతో అన్ని కేటగిరీలకు, ఒకే రకమైన వేతనాలు చెల్లిస్తున్నారు. మున్సిపల్ వర్కర్లకు జీవో । నెంబర్ 60 పీఆర్సీ వేతన సవరణ సంఘం ప్రకారం వేతనాలను చెల్లిస్తున్నారు. “గొర్రె తోక బెత్తెడు” అది పెరగదు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు నిర్దేశించబడ్డ పీఆర్సీ నివేదిక బేసిక్ వేతనం రూ.19 వేలు, వారి సర్వీస్ను బట్టి వేతనాలు పెరుగుతూ వస్తాయి. ఇది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే పీఆర్సీ, కానీ పేరుకు పీఆర్సీ నివేదిక కానీ వాటి యొక్క నిర్దేశాలను “ఔట్సోర్సింగ్” కార్మికులకు వర్తించడం లేదు. ఈ విధంగా చాలీచాలని వేతనాలతో జీవిస్తున్న కార్మిక వర్గానికి ఈ “వేజ్ కోడ్” కొత్తగా ఒరగపెట్టింది ఏమీ లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వారి సర్వీసును బట్టి, పెరిగిన ధరలకు అనుగుణంగా జీతభత్యాలు పెరుగుతూ వస్తున్నాయి. ఈ ఔట్సోర్సింగ్ కాంట్రాక్టు వర్కర్స్ మనుషులుగా కనబడడం లేదా? ఈ నూతనంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్స్ వలన ఒక మనిషి జీవించడానికి (లివింగ్ వేతనం) సరిపడే విధంగా నిర్ణయించే విధానాలు, నిర్ణయాలు లేవు. “వేజ్ కోడ్”లో వేతన నిర్ణయాలలో, కార్మికులకు ఏమీ లాభం జరగడం లేదు. గతంలో ఉన్న వేతన నిర్ణయ హక్కులను మరింతగా కాలరాచే చర్యలుగా పూనుకున్నారు.గ్రామపంచాయితీలో పనిచేస్తున్న కార్మికులకు నేటికీ ప్రభుత్వాలు ఎలాంటి పీఎఫ్, ఈఎస్ఐలు అమలు



చేయడం లేదు. కార్మికులందరికీ “సామాజిక భద్రత” అంటున్న పాలకులారా? లేబర్ కోడ్స్లో ప్రావిడెంట్ ఫండ్ అమలు నుండి తప్పుకోవడానికి, 12 శాతం పీఎఫ్ను 10 శాతం వరకు తగ్గించుకోవచ్చనే అవకాశాన్ని లేబర్ కోడ్లో ఎందుకు కల్పించారు? ఈఎస్ఐ (స్టేట్ ఇన్సూరెన్స్ చట్టం) కార్మికుల బీమా చట్టం, ఇది కార్మికులకు ధీమానిస్తుంది. కానీ నేడు తీసుకొచ్చిన “సామాజిక భద్రత చట్టం” కార్మికుల ధీమాను, రక్షణను గాలిలో దీపంలా మార్చివేశారు. ఈఎస్ఐ కాంట్రిబ్యూషన్ను (కార్మికుడి, యజమాని వాటాను) ఈ లేబర్ కోడ్స్లో ఎందుకు తగ్గించారు. నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతున్న ఈ ఎస్ఐ దవాఖానాలు, మందులు లేక మూత్ర పరీక్షలకు కూడా నోచుకొని పరిస్థితి, కనీసం సౌకర్యాలు కూడా లేని దురావస్థ ఈఎస్ఐ హాస్పిటల్లో నెలకొని ఉందని, తాటికాయ అంత అక్షరాలతో పత్రికలు కోడై కూస్తున్నాయి. అందరికీ “సామాజిక భద్రత” అంటూ మరో ప్రక్క భద్రతనే లేకుండా చేసిన లేబర్ కోడ్స్ను కార్మిక వర్గం తిప్పి కొట్టవలసిన అవసరం ఉంది.కార్మిక వర్గము తమ సమస్యలను, వేతనాలను యజమాన్యాలతో బేరసరాలు జరపడానికి సమ్మె అన్నది ఒక ఆయుధం. పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారము (పాత చట్టాల) 14 రోజుల ముందు నోటీసు ఇవ్వాలి. ప్రభుత్వాలు యజమాన్యాలకు పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం చేకూరే విధంగా మరింత కట్టుదిట్టం చేయడంలో భాగంగా 60 రోజుల ముందు నోటీసు ఇవ్వాలని, ఈ లేబర్ కోడ్స్లో తీసుకొచ్చారు. దీనివలన జరిగేది ఏమిటి? కార్మికులు నేరసారాలు జరపడానికి అవకాశం లేకుండా చేయడమేనా? కాదా? సమ్మె చేసిన, చేయించిన వారిపై శిక్షలు వేయడానికి ఈ లేబర్ కోడ్స్లో రూల్స్ రూపొందించారు.ఇది కార్మిక వర్గానికి ఉరి తాళ్ళు బిగించడమే తప్ప మరొకటి కాదు.తెలంగాణ రాష్ట్రంలో లక్ష మందికి పైగా గ్రామపంచాయితీ, మున్సిపాలిటీలలో పనిచేస్తున్న సిబ్బంది ఉన్నారు. గ్రాట్యుటీ చట్టం 1972 ప్రకారం పదిమంది పనిచేసే ఏ సంస్థ అయినా గ్రాట్యుటీని అమలు చేయాలి. కార్మికులు రాజీనామా చేసినా, తొలగించినా లేదా మరణించిన వారి వారసులకి గ్రాట్యుటీ లభిస్తుంది. ఈనాటి వరకు ఎలాంటి గ్రాట్యుటీని కార్మికులకు అమలు చేయలేదు. “సోషల్ సెక్యూరిటీ” పేరు మీద తీసుకొచ్చిన “లేబర్ కోడ్స్” అసంఘటిత కార్మికులందరికీ అమలు చేయాలన్న నిర్దేశాన్ని ఎక్కడ సూచించలేదు. కానీ గతంలో ఐదు సంవత్సరాల సర్వీస్ ఉంటే । గ్రాట్యుటీ లబ్ది పొందేవారు కానీ, నేడు సంవత్సరానికి గ్రాట్యుటీ చెల్లిస్తారట. ఇది గొప్ప మార్పు అని మాట్లాడుతున్నారు. కానీ “పారిశ్రామిక సంబంధాల కోడ్”లో “ఫిక్స్ టర్మ్ ఎంప్లాయిమెంట్” సిస్టాన్ని అమలు చేస్తున్నారు, అంటే నియమితకాల ఉద్యోగి (శాశ్వత ఉద్యోగి కాదన్నమాట) వారికే సంవత్సరానికే గ్రాట్యుటీ చెల్లించి ఇంటికి పంపడమేనా? ఇదా ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త లేబర్ కోడ్.దేశం మరింత ముందుకు పోవడానికి ఉత్పత్తులు, ఉత్పత్తి రంగాల్లో మరింత పురోగమనం సాధించాలంటే ఎక్కువ గంటలు పనిచేయాలని, సులభతరమైన వాణిజ్య విధానాలు అవసరమని, దానికై పని గంటలు పెంచాలని కోడ్స్లో పేర్కొన్నారు. దాని ఫలితంగా నేడు 10 నుంచి 12 గంటలు పని చేయాలని, రాత్రి వేళల్లో మహిళా కార్మికులు పనిచేయాలని సవరణలు చేశారు. 150 సంవత్సరాల కింద 8 గంటల పనిని సాధించుకున్న కార్మిక వర్గం, నేడు పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాల కారణంగా పని గంటలు తగ్గాల్సింది పోయి పని గంటల పెంపుదల అన్నది అత్యంత బానిసత్వంతో సమానం. పని గంటల పెంపుదల వలన కార్మిక వర్గానికి ఓటి (ఓవర్ టైం) పని కాలం నష్టపోవడం జరుగుతుంది. పని గంటల పెంపు పారిశ్రామికవేత్తలకు లాభం చేకూర్చడం కొరకు పాలకవర్గాలు ముందుకు తీసుకొచ్చాయి. ఈ సిగ్గుమాలిన చర్యని అదేదో గొప్పగా కేంద్ర ప్రభుత్వం ఫోజులు పెడుతుంది.సమ్మె హక్కు, కనీస వేతనాల హక్కు, సామాజిక భద్రతపై ఉక్కు పాదం మోపుతున్న పాలకవర్గాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గము దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను ఫిబ్రవరి 12వ తేదిన జరుప తలపెట్టారు. ఈ సమ్మెలో మనమంతా భాగస్వామ్యం అవుదామన్నారు. ఈ సందర్భంగా నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి.కనీస వేతనాలు 26 వేలుగా నిర్ణహించాలి.మున్సిపల్, జీపీ కార్మికులందరిని రెగ్యులరైజ్ చేయాలి.గ్రామ పంచాయితీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలి.ప్రతి నెలా సకాలంలో వేతనాలివ్వాలి. జీవో 51ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు..కార్యక్రమంలో కారోబార్ జగపతి రావు, అంజి, వాజీద్,రాజు, అశోక్, సాయమ్మ, కుర్మయ్య, అంజి తదితరులు పాల్గొన్నారు..

# నేడు మల్లికార్జున స్వామి దేవస్థానానికి నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

## డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చొరవతో దేవాదాయ శాఖ నుండి ఉత్తర్వులు జారీ చేసిన అధికారులు

## నూతన పాలకవర్గం ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ డిప్యూటీ సీఎంకు ధన్యవాదాలు తెలిపిన గ్రామ శాఖ నాయకులు, కార్యకర్తలు.

## గాలి చిన్న నరసింహారావు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు వల్లాపురం

**విజేత ముదిగొండ:** ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వల్లాపురం గ్రామంలో వేంచేసి ఉన్న స్వయంభు శ్రీ మల్లికార్జున స్వామి వారి దేవస్థానానికి నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేస్తూ దేవాదాయ శాఖ నుండి అనుమతులు వెలువడటం జరిగింది, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అయినాల నరసింహారావు, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు తాటికొండ రమేష్ స్థానిక శాసనసభ్యులు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ని కలిసి ఆలయ పాలకవర్గ ఆవశ్యకతను వివరించగ సానుకూలంగా స్పందించి




పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా దేవదాయ శాఖ అధికారులకు ఆదేశించడం జరిగింది ఈ సందర్భంగా గ్రామ శాఖ నాయకులు మరియు కార్యకర్తలు నూతనంగా ఎన్నికైన పాలకవర్గ చైర్మన్ మరియు సభ్యులు మల్లు భట్టి విక్రమార్క కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు

**మల్లికార్జున స్వామి దేవస్థానం యొక్క పాలకవర్గం: –**

1. గాలి గోపి (చైర్మన్)
2. తాటికొండ రామారావు (సభ్యులు)
3. అనసూరి సతీష్ (సభ్యులు)
4. పాపినేని రామయ్య (సభ్యులు)
5. గువ్వలగుంటి పుల్లయ్య(సభ్యులు)
6. కనగాల గౌరమ్మ (సభ్యులు)
7. ఎడ్లపల్లి పద్మ (సభ్యులు)

(10-02-2026) ఉదయం 10 గంటలకు నూతనంగా ఎన్నికైన పాలకవర్గ చైర్మన్ మరియు సభ్యులు దేవాదాయ శాఖ అధికారి చేత ప్రమాణ స్వీకార కార్యక్రమం మల్లికార్జున స్వామి వారి దేవస్థానంలో జరుగును కావున కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుకుంటున్నాము.

# క్రీడలు విద్యార్థులలో శారీరక దృఢత్వంతో పాటు క్రీడాకారులుగా రాణిస్తారు



ప్రగతి పాఠశాలలో 40వ వార్షిక క్రీడా మహోత్సవం





**విజేత,రాయికల్ :** రాయికల్ పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాల 40 సం: ప్రస్థానాన్ని ఘనంగా జరుపుకుంటూ నిర్వహించిన 40వ వార్షిక క్రీడలు మీట్ కార్యక్రమం సోమవారం కన్నుల పండుగ గా జరిగింది. విద్య, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు సమతుల్యతనిచ్చే విధంగా ఏర్పాటు చేసిన ఈ వేడుకలు విద్యార్థుల తల్లిదండ్రులు, అతిథుల నుంచి విశేష ప్రశంసలు అందుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల నాలుగు దశాబ్దాల విజయగాథను వివరిస్తూ రూపొందించిన ప్రత్యేక గీతాన్ని ముఖ్య అతిథిగా హాజరైన రాయికల్ మండల తహసిల్దార్ నాగార్జున తన చేతుల మీదుగా ఆవిష్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఆహ్లాదకరమైన స్వాగత నృత్యం సభకు హాజరైన అతిథులను ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులు నిర్వహించిన శాసనబద్ధమైన పరేడ్, రిబ్బన్స్, రింగ్స్, శారీ యాక్టివిటీ, యోగ చాప్ ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. బాలబాలికలు రూపొందించిన పిరమిడ్స్, సూర్య నమస్కారాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులు ప్రదర్శించిన మాస్ డ్రిల్, ఏరోబిక్స్ కార్యక్రమాలు సభలో ఉత్సాహాన్ని నింపాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథి తహసిల్దార్ నాగార్జున మాట్లాడుతూ, క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, సహనం, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. విద్యతో పాటు శారీరక దృఢత్వానికి ప్రాధాన్యతనిస్తూ ప్రగతి పాఠశాల నిర్వహిస్తున్న ఇలాంటి కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. పాఠశాల చైర్మన్ మోర హన్మాండ్లు మాట్లాడుతూ, గత నాలుగు దశాబ్దాలుగా ప్రగతి పాఠశాల విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతూ సమాజానికి సేవలందిస్తున్నదని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయశ్రీ, అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్, ఉపాధ్యాయులు,పిఈటిలు విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రగతి పాఠశాల 40వ వార్షికోత్సవ వేడుకలు రాయికల్ పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో గందరగోళం..

## అసలైన పేదలను అయోమయానికి గురి చేస్తున్నారని ఆరోపణలు

**విజేత, హైదరాబాద్ బ్యూరో:** కంటోన్మెంట్ నియోజకవర్గం మారేడుపల్లిలో పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు ఐదు సంవత్సరాలు పూర్తయినా ఇప్పటికీ పూర్తిస్థాయిలో పంపిణీ జరగకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ఇళ్ల కోసం ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న అర్హులైన లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై స్పందించిన స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక ఇటీవల బాధిత కుటుంబాలతో కలిసి ధర్నా నిర్వహించి, అర్హులైన పేదలకు వెంటనే ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్ధంగా ఉన్న ఇళ్లను పంపిణీ చేయకపోవడం అన్యాయమని ఆమె పేర్కొన్నారు. ఆదివారం ఓల్డ్ మారేడుపల్లి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద, ఎమ్మెల్యే మరియు రెవెన్యూ అధికారులు విడుదల చేసిన రెండో లబ్ధిదారుల జాబితాను కార్పొరేటర్ కొంతం దీపిక ఆధ్వర్యంలో బస్తీ సభ నిర్వహించి పరిశీలించారు. బస్తీలోని అసలైన లబ్ధిదారుల సమక్షంలో జాబితాను చదివి వినిపించగా, మొత్తం 150 మంది పేర్లతో ఉన్న జాబితాలో దాదాపు 30 మంది బినామీ, స్థానికేతరుల పేర్లు ఉన్నట్లు బస్తీ వాసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కొంతం దీపిక మాట్లాడుతూ, రెండో జాబితాలో నాన్‌లోకల్‌గా గుర్తించిన సుమారు 30 మంది పేర్లు ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. బస్తీ సభ ద్వారా గుర్తించిన ఈ పేర్లను రెవెన్యూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, అసలైన లబ్ధిదారులకు మాత్రమే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. జాబితా వెనుక రాజకీయ కుంభకోణం దాగి ఉందని స్థానికులు ఆరోపిస్తుండగా, అసలైన లబ్ధిదారులను అయోమయానికి గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ స్థానిక సమస్యలను విస్మరించి మున్సిపల్ ఎన్నికలలో భాగంగా మంచిర్యాల్ నియోజకవర్గానికి ఎన్నికల కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తూ ఎన్నికల కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. తనను




గెలిపించిన ప్రజల సమస్యలపై దృష్టి పెట్టకుండా ఎన్నికల రాజకీయాల్లో మునిగిపోయారని ఆరోపిస్తున్నారు. మారేడుపల్లి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని బాధితులు హెచ్చరిస్తున్నారు.



# మల్లన్న స్వామి జాతరలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ

**అక్షర విజేత, దుండిగల్ :–** దుండిగల్ సర్కిల్ పరిధిలోని డిపోచంపల్లిలో అంగరంగ వైభవంగా నిర్వహించిన మల్లన్న స్వామి జాతర కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మల్లన్న స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మాట్లాడుతూ భక్తుల సందడి మధ్య సంప్రదాయబద్ధంగా జరుగుతున్న మల్లన్న స్వామి జాతరలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఇటువంటి జాతరలు ప్రజల్లో ఆధ్యాత్మిక భావాన్ని, సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మహేందర్ యాదవ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్, నాయకులు రాజశేఖర్ యాదవ్, సుదర్శన్, యూత్ నాయకులు విష్ణు యాదవ్, శ్రీకాంత్ యాదవ్, గణేశ్, రాజు, శ్రీధర్, అభి, భాను, మహేష్ యాదవ్, కుమ్మరి మహేష్, శ్రీకాంత్, నవీన్ యాదవ్ తో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# కీసరగుట్టలో 13 తారీకు లోగా ఏర్పాట్లు పూర్తి చేయాలి- మాను చౌదరి





**విజేత,మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ :** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కీసర మండలం పరిధిలోని శ్రీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవా లలో విఐపి దర్శనాలతో సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. కీసర శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 13 వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో సోమవారం కీసర గుట్టకు వెళ్ళిన కలెక్టర్ మన చౌదరి, మల్కాజ్గిరి డిసిపి శ్రీధర్ , ట్రాఫిక్ డిసిపి రాహుల్ రెడ్డి ఐపీఎస్, ఆర్డీఓ రాజేష్, ఆలయ కమిటీ ఛైర్మన్ తటాకం వెంకటేశ్, ఆలయ ఈవో సుధాకర్ రెడ్డి లతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు పూర్ణ కుంభంతో కలెక్టర్ కు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గల సమావేశ మందిరంలో కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు క్యూలైన్ లను పెంచాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున ఆర్టీసీ బస్సులు పెంచాలన్నారు. భద్రతా లోపం తలెత్తకుండా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు. భక్తులకు అత్యవసర చికిత్సకై అవసరమైన వైద్య సిబ్బంది, మందులు అందుబాటులో ఉండాలన్నారు. బ్యారీకేడ్, దర్శనం క్యూ లైన్, పార్కింగ్కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, ప్రస్తుతం ఎండలు పెరుగుతున్నాయని అందుకు జాతరలో భక్తులకు అందుబాటులో అవసరమైన అన్ని చోట్ల త్రాగునీటిని అందుబాటులో ఉంచాలని వాటర్ వర్క్స్ వారికీ తెలిపారు. జాతరలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారు ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దర్శనార్థం వచ్చే వృద్ధులు దివ్యాంగులకు ప్రత్యేక వాహన సదుపాయం కల్పించాలని ట్రాఫిక్ పోలీస్ అధికారులకు సూచించారు. జాతరలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూడాలని అందుకు సంబంధించి ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయాలని ఈ విషయంలో అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిందిగా కలెక్టర్ తెలిపారు. కీసర గుట్ట బ్రహ్మోత్సవాల జాతరలో పూజ సామాగ్రి , ఆహార పదార్థాల నుంచి మొదలుకొని అన్ని రకాల వస్తువుల విక్రయానికి సంబంధించి ధరలు భక్తులకు అందుబాటులో ఉండేలా చూడాలని, ఎక్కువ ధరలకు విక్రయించకుండా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత శాఖ అధికారులు వ్యాపారులకు తెలపాలన్నారు. జాతర రోజుల్లో ఆలయ పరిసరాల్లో అగ్నిమాపక సిబ్బందితో పాటు ఫైరింజన్ను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కీసర ఆలయంకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని ఆలయ ఈవో, ఛైర్మన్ కు తెలిపారు. మహాశివరాత్రికి కీసరగుట్టలో రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి విజయవంతం చేయాలని కలెక్టర్ సమావేశంలో స్పష్టం చేశారు.ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందుర్తిలో ఘనంగా శ్రీ యాలాల మల్లికార్జున స్వామి జాతర







## స్వామివారిని దర్శికున్న

## చుట్టుపక్కల గ్రామాల ప్రజలు

**విజేత: చిగురుమామిడి :** చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి గ్రామంలో శ్రీ యాలాల మల్లికార్జున స్వామి జాతరను సోమవారం యాదవ కులస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుండే మల్లన్న స్వామిని దర్శించుకునేందుకు ఇందుర్తి చుట్టు పక్కల గ్రామాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. స్వామి వారికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించి సల్లంగ చూడో మల్లన్న స్వామి అంటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంటలు బాగ పండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించారు. ఆలయం ముందు స్వామి వారి కళ్యాణం, ఓగ్గు పూజారులు వేసిన మల్లన్న పట్నాలు, అగ్నిగుండాలు, మల్లన్న స్వామి చరిత్ర భక్తులను ఎంతగానో ఆలోచింపజేసి ఆకట్టుకున్నాయి.స్వామి వారిని దర్శించుకునేందకు చుట్టూ పక్కల గ్రామల ప్రజలు వచ్చి దర్శించుకున్నారు.లక్ష్మి చారిట్రబుల్ ట్రస్ట్ చైర్మన్, సీనియర్ జర్నలిస్ట్ గాదె రఘు నాథ్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమ శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్ ద్వారా ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాకారం అందిస్తామని సర్పంచ్ సర్పంచ్ చింతపూల నరేందర్ తెలిపారు. యాలల మల్లన్న జాతర సందర్భంగా మల్లికార్జున స్వామి ఆలయం వద్ద ఇందుర్తి గ్రామ ఐదవ వార్డు సభ్యులు నడిగొట్టు కిరణ్ 108 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ చింతపూల నరేందర్, లక్ష్మీ చారిటబుల్ ట్రస్టు ఛైర్మెన్ సీనియర్ జర్నలిస్టు గాదె రఘునాథ్ రెడ్డి యాదవ సంఘము నాయకులు సంధావేణి మల్లయ్య, చెన్నవేని వెంకట్ పోతరవేని బాలయ్య కొమురయ్య ముక్కెర బిక్షపతి యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# అహింసా ప్రవక్త ఆకుపచ్చని ఆలోచనలు




మన మహాత్ముడు అహింసా ధర్మ ప్రవక్త మాత్రమే కాదు, హరిత ద్రష్ట కూడా. ఇంచుమించు మూడు దశాబ్దాల క్రితం గాంధీజీ రచనల సంకలనం 'ఇండస్ట్రియలైజ్ అండ్ పెరిష్' చదువుతుండగా అందులోని కొన్ని వ్యాఖ్యలు నన్ను అమితంగా ఆకట్టుకున్నాయి. 'పాశ్చాత్య ప్రపంచం వలే పారిశ్రామికీకరణకు భారత్ పూనుకోవడాన్ని భగవంతుడు అడ్డుకోవాలి. ఒక చిన్న ద్వీప రాజ్య (ఇంగ్లాండ్) ఆర్థిక సామ్రాజ్యవాదం శృంఖలాలలో ప్రపంచం నేడు నలిగిపోతోంది. ముప్పై కోట్ల మందికి పైగా జనాభా ఉన్న ఒక దేశం ఇంగ్లాండ్ తరహా ఆర్థిక దోపిడీకి పూనుకుంటే అది ప్రపంచంపై మిడతల దండు దాడే అవుతుంది' (ఈ వ్యాఖ్యలు తొలుత 20, డిసెంబర్, 1928 'యంగ్ ఇండియా' సంచికలో ప్రచురితమయ్యాయి). పర్యావరణ ఉద్యమాల వెలుగులో ఈ వ్యాఖ్యలను పరిశీలిస్తే అవి మరింతగా అర్థమవుతాయి. సహజవనరుల సాంద్ర, ఇంధన సాంద్ర పారిశ్రామికాభివృద్ధి విపరీత పోకడలకు వ్యతిరేకంగా గాంధీ చేసిన హెచ్చరికే ఆ వ్యాఖ్యల సారాంశం.మనుషుల దురాశా తత్వ విమర్శకుడుగా, వికేంద్రీకృత, గ్రామ%-%కేంద్రిత (తత్కారణంగా తక్కువ విధ్వంసకరమైన) ఆర్థిక వ్యవస్థ ప్రతిపాదకుడుగా, హానికరమైన, వినాశకరమైన ప్రభుత్వ విధానాలపై అహింసాయుత పద్ధతులలో పోరాట పథనిర్ణేతగా గాంధీ తమకు స్ఫూర్తిప్రదాత అని పర్యావరణ ఉద్యమాలు నొక్కి చెప్పుతున్నాయి. మన దేశ ప్రజలలో పర్యావరణ చైతన్యాన్ని రగిలించి, పెంపొందించిన చిప్కో, నర్మదా బచావో ఉద్యమాలను నిర్వహించిన వ్యక్తులు గాంధేయవాదులే. ఆలోచనలోనూ, కార్యాచరణలోనూ తాము గాంధీజీ అడుగుజాడల్లో నడుస్తున్నామని వారు స్వయంగా చెప్పుకున్నారు. పాశ్చాత్య పర్యావరణ వేత్తలు మహాత్ముడిని తమ మార్గదర్శిగా అంగీకరించారు. 'స్మాల్ ఈజ్ బ్యూటిఫుల్' అని ఘోషించిన ఆర్థికవేత్త ఇ.ఎఫ్ షూమాకర్ (1911%-%77) జర్మన్ గ్రీన్ పార్టీ సైద్ధాంతికవేత్తలు గాంధీ హరిత వివేచన ప్రభావితులే. కాలానికి ముందే ప్రభవించిన పర్యావరణవేత్తగా గాంధీజీ విశిష్టతను ధ్రువీకరించి, దృఢపరచడమే నా యీ వ్యాస లక్ష్యం. ఇందులో భాగంగా, మన ప్రస్తుత ఆందోళనలను ఎంతో ముందుగానే ఊహించిన ఆయన ఆలోచనలలోని కొన్ని ఇతర అంశాలను ప్రస్తావించదలుచుకున్నాను. మరీ ముఖ్యంగా వృక్షజాలం ప్రాముఖ్యత, ధరిత్రికి ఆకుపచ్చ ఆచ్ఛాదనం ఆవశ్యకత గురించి ఆయన చేసిన (ఎవరికీ పెద్దగా తెలియని) కొన్ని వ్యాఖ్యలను విపులంగా ప్రస్తావిస్తాను. 1925 డిసెంబర్‌లో గుజరాత్‌లోని కచ్ ప్రాంతానికి గాంధీ వెళ్లారు. అదొక ఎడారి సీమ. ఆయన ఆతిథేయి జయకృష్ణ ఇంద్రాజీ ('గుజరాత్ రత్నం'గా ఇంద్రాజీని గాంధీ అభివర్ణించారు). 1849లో జన్మించిన జయకృష్ణ స్వీయ శిక్షణతో రూపొందిన వృక్ష శాస్త్రవేత్త. పోర్‌బందర్ సంస్థాన ఉద్యోగి (ఇదే సంస్థానాధిపతులకు గాంధీ పూర్వీకులు కూడా తమ సేవలందించారు). ధరిత్రికి అద్భుత శోభను సమకూర్చే వృక్ష సంపదపై భారతీయులలో ఆసక్తి కొరవడడం గాంధీజీ మిత్రునికి ఆశ్చర్యం గొలిపింది. ఆయన ఇలా వ్యాఖ్యానించారు: 'ఈ దేశంలోని అపార, వైవిధ్య పూరితమైన వృక్ష జగత్తు గురించి యూరోపియన్లు విపులంగా రాశారు. మరి నా దేశస్తులకేమో తమ గృహావరణంలోని మొక్కల గురించి గానీ తమ కాళ్లకింద నలిగిపోతున్న గడ్డి మొక్కల గురించి తెలిసింది దాదాపుగా పూజ్యం'.జయకృష్ణ ఆతిథ్యంలో గడిపిన అనంతరం గాంధీ ఇలా రాశారు: 'బర్డా కొండ ప్రాంతాల్లోని ప్రతీ చెట్టు గురించీ, ప్రతీ ఆకు గురించి జయకృష్ణకు బాగా తెలుసు. మొక్కల పెంపకంలో ఆయనకు సంపూర్ణ విశ్వాసం ఉన్నది. ఆ కార్యక్రమానికి ఆయన అధిక ప్రాధాన్యమిస్తున్నారు. మొక్కలను నాటి పెంచడం ద్వారా అనేక సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఆయన విశ్వసిస్తున్నారు ఈ విషయంలో ఆయన ఉత్సాహం, నమ్మకం అపూర్వమైనవి. ఆయన సహచర్యంలో అవి నాకూ సంక్రమించాయి'.

జయకృష్ణ ఒక అందమైన ప్రదేశంలో గాంధీ చేత ఒక మొక్కను నాటించారు. 'ఇదే కచ్‌లో నేను నిర్వహించిన ఆనందదాయకమైన, ప్రయోజనకరమైన పని' అని మహాత్ముడు రాశారు. జయకృష్ణ చేస్తున్న కృషి గాంధీకి దక్షిణాఫ్రికా పట్టణం ఒక దానిలో తాను స్వయంగా చూసిన మార్పులను జ్ఞప్తికి తెచ్చింది. మహాత్ముడు ఇలా రాశారు: 'జోహాన్నెస్‌బర్గ్ కూడా ఇటువంటి ప్రాంతమే. అక్కడ ఒకప్పుడు గడ్డి మినహా ఏమీ పెరిగేది కాదు. అక్కడ ఒక భవనం కూడా ఉండేది కాదు. నలభై ఏళ్ల వ్యవధిలో అదొక స్వర్ణనగరంగా అభివృద్ధి చెందింది. అంతకు ముందు ఒక బకెట్ నీటి కోసం పన్నెండు అణాలు చెల్లించేవారు. కొన్ని సందర్భాలలో సోడా %-%నీటినీ కొనుక్కునేవారు. సోడా నీటితోనే తమ ముఖాలు, చేతులు కడుక్కునే సందర్భాలు కూడా ఉండేవి. ఇప్పుడు అక్కడ నీరు ఉన్నది, చెట్లు ఉన్నాయి. బంగారు గనుల యజమానులు మొదటి నుంచీ ఆ ప్రాంతాన్ని హరిత ప్రదేశంగా అభివృద్ధిపరిచేందుకు ప్రాధాన్యమిచ్చారు. దూర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి నాటి, పెంచిన మొక్కలతో అక్కడ వర్షపాతం కూడా పెరిగింది. అడవులను నరికివేసిన చోట వర్షపాతం తగ్గడమూ, అడవులను అభివృద్ధిపరిచిన చోట వర్షపాతం పెరగడమూ సహజ ఉదంతాలు కదా'. కొన్ని సంవత్సరాల అనంతరం సబర్మతీ ఆశ్రమంలో ఒక రోజు రాత్రి గాంధీ కోరికపై తుమ్మ చెట్టు కొమ్మలను తీసుకువచ్చారు. 'వాటి చిన్ని ఆకులు అన్నీ నిద్రపోతున్నాయి' అని మహాత్ముని శిష్యురాలు మీరా బెన్ వ్యాఖ్యానించారు. దానిపై గాంధీ ఇలా ప్రతిస్పందించారు: 'చెట్లు కూడా మనలాంటి ప్రాణులే. మన మాదిరిగానే అవీ ఊపిరి పీలుస్తాయి, ఆహారం తింటాయి, నీళ్లు తాగుతాయి. మన మాదిరిగానే వాటికి కూడా నిద్ర పోవలసిన అవసరం ఉన్నది. రాత్రిపూట విశ్రాంతి తీసుకుంటున్న చెట్టు కొమ్మలు నరికి వేసి వాటి ఆకులు తెంచుకోవడం చాలా క్రూరమైన పని'. అలా రాత్రిపూట విశ్రమిస్తున్న చెట్టు కొమ్మలను తీసుకురావడం గాంధీకి చాలా బాధ కలిగించిందని మీరా బెన్ రాశారు. ఇంకా ఈ విషయమై ఇంగ్లీష్, గుజరాతీ భాషలలో ఏక కాలంలో ప్రచురితమైన ఒక వ్యాసంలో గాంధీ ఇలా రాశారు: 'కసాయివాడు కూడా కొంత మేరకు మానవీయ దృష్టితో వ్యవహరిస్తాడు. గొర్రె మాంసం తినడానికి ఇష్టపడే వ్యక్తి రాత్రిపూట నిద్రపోతున్న గొర్రెల మందను సంహరించడు. జంతువులు గానీ, మొక్కలు గానీ సృష్టిలోని ప్రాణులు అన్నిటి పట్ల మనం సమదృష్టితో వ్యవహరించాలి. కేవలం తన ఆనందానికే ప్రాధాన్యమిచ్చి, ఇతర ప్రాణుల శ్రేయస్సును పట్టించుకోనివాడు మనిషి కాడు. ఆలోచనారహితుడు'.సహజ వనరుల వినియోగంలో సంయమనం అవసరమని స్పష్టం చేసిన తరువాత భారతీయ సంస్కృతిలో చెట్టూ చేమకు గల సమున్నత స్థానాన్ని గాంధీ ప్రశంసించారు. ఆయన ఇలా రాశారు: 'వృక్షాలు, ఇతర చైతన్యశీల జీవులను పరిపూర్ణంగా గౌరవించే తత్వాన్ని భారతీయులు అలవరచుకున్నారు. అడవిలోని ప్రతీ చెట్టు వద్దకు వెళ్లి దమయంతి తన బాధను చెప్పుకున్న తీరును కవి వర్ణించాడు. శకుంతలకు పూల మొక్కలు, ఫల వృక్షాలే కాదు పక్షులు, జంతువులు కూడా ఆత్మీయ నేస్తాలే. అత్తవారింటికి వెళ్లే సందర్భంలో వాటినుంచి దూరమవుతున్నందుకు ఆమె ఎంతగా పరితపించిందో కాళిదాస మహాకవి హృద్యంగా అభివర్ణించాడు'. ఈ సందర్భంగా, చెట్ల ప్రాధాన్యాన్ని వివరిస్తూ నవీన పర్యావరణవేత్త ఒకరు అన్న మాటలను పేర్కొనడం సముచితంగా ఉంటుంది. 'వాతావరణంలోని బొగ్గు పులుసు వాయువును వేరుచేసే సామర్థ్యం వృక్షాలకు స్వతస్సిద్ధమైనది. అలా వేరుచేసిన ఆ వాయువును అవి తమ దారువుల్లో దాచిపెడతాయి. వాతావరణ విపత్తు నెదుర్కొనే సులభ, సుసాధ్య మార్గం వృక్షాలే' అని ఆ పర్యావరణవేత్త అనడం గమనార్హం. మానవాళి విచక్షణారహిత కార్యకలాపాల వల్లే భూమి అంతకంతకూ వేడెక్కిపోతోందని, వాతావరణంలో విపత్కర మార్పులు చోటుచేసుకుంటున్నాయని శాస్త్రవేత్తలు కనుగొనడానికి దశాబ్దాలకు పూర్వమే పర్యావరణ పరిరక్షణ విషయమై మహాత్మాగాంధీ మన సమాజాన్ని జాగృతం చేశారు. మొక్కలు విరివిగా నాటి, మన భూమికి పచ్చని ఆచ్ఛాదనం కల్పించాలని ఆయన నొక్కి చెప్పారు. 'మనం నాటిన మొక్కలు మహా మానులై మనకు నీడ, ఆశ్రయాన్ని ఇస్తాయి. భూమిని సారవంతంగా ఉంచేందుకు, జలవనరుల సంరక్షణకు తోడ్పడతాయి. అంతకంటే ముఖ్యంగా మానవేతర ప్రాణుల శ్రేయస్సు పట్ల మన శ్రద్ధాసక్తులకు అవి తార్కాణాలుగా ఉంటాయని' మహాత్ముడు రాశారు.

# మెదక్ మున్సిపాలిటీ ఎన్నికలు ప్రచారం

## 19వ వార్డులో ఇంటింటా ప్రచారం

## ప్రజలను ఆకట్టుకున్న అభ్యర్థి గంట సంపత్



**అక్షర మెదక్ :** మెదక్ మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో ప్రచారం సోమవారం చివరి రోజు రాజకీయ వేడి తారస్థాయికి చేరుకుంది. ముఖ్యంగా 19వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి గంట సంపత్ చేపట్టిన ఇంటింటా ప్రచారం విశేషంగా ఆకట్టుకుంది. ఉదయం నుంచే కార్యకర్తలు, అభిమానులతో కలిసి కాలనీలు, వీధులు, బస్తీలు సందర్శించిన గంట సంపత్ ప్రజలను నేరుగా కలుసుకుని మద్దతు కోరారు. ప్రచారం చివరి రోజు కావడంతో 19వ వార్డులో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. మహిళలు, యువత, వృద్ధులు పెద్ద సంఖ్యలో బయటకు వచ్చి అభ్యర్థిని కలుసుకుని తమ సమస్యలను వివరించారు. తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ప్రజలు ప్రాధాన్యత ఇవ్వాలని కోరగా, ఎన్నికైన వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గంట సంపత్ హామీ ఇచ్చారు. ప్రచారంలో భాగంగా స్థానికులతో మమేకమవుతూ ప్రతి ఇంటికి వెళ్లి ఓటు అభ్యర్థించడం ప్రజలలో విశ్వాసాన్ని పెంచిందని కార్యకర్తలు తెలిపారు. "ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడు కావాలి. సమస్యలు చెప్పగానే స్పందించే వ్యక్తి అవసరం" అని పలువురు స్థానికులు అభిప్రాయపడ్డారు. గంట సంపత్ మాట్లాడుతూ, "19వ వార్డు అభివృద్ధి నా ప్రధాన లక్ష్యం. పారిశుద్ధ్యం, తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెడతాను. ప్రజల ఆశలు నెరవేర్చడమే నా ధ్యేయం" అని పేర్కొన్నారు. ప్రచారం చివరి రోజు కావడంతో కార్యకర్తలు భారీగా పాల్గొని ప్రచారాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. నినాదాలతో వీధులు మార్మోగాయి. యువత పెద్ద సంఖ్యలో ప్రచారంలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# పిట్లం నూతన ఏపీఎం గా గంగారం



**విజేత,పిట్లం :** పిట్లం మండల ఏపీఎంగా గంగారాం బాధితులు స్వీకరించారు. ఆయన జుక్కల్ ఏపీఎం గా పనిచేసే బదిలీగా పిట్లం వచ్చి బాధితులు స్వీకరించారు. పిట్లంలో ఏపీఎం గా విధులు నిర్వహించిన మెదక్ జిల్లాకు బదిలీ అయినట్లు తెలిపారు. అనంతరం ఏపీఎం మాట్లాడుతూ గ్రామ సంఘాలకు సంఘాలకు తీసుకున్న అప్పులు సకాలంలో కడితే ఎలాంటి ఒత్తిడి ఉండదని ఆయన అన్నారు, సంఘాలు అభివృద్ధి చెందాలంటే బ్యాంకు లోన్ తీసుకుని ఏదో ఒకటి వ్యాపారం చేస్తూ అభివృద్ధి చెందాలని ఆయన కోరారు. మహిళలు అభివృద్ధి చెందుతేనే గ్రామ సంఘాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఆయన వెంట సీసీలు ముత్యం రెడ్డి, ఉత్తంకుమార్, దత్తు ఉన్నారు.

# యాప్ ద్వారానే యూరియా అమ్మకాలు

## వ్యవసాయ అధికారి




**విజేత,పిట్లం :** ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ అందుబాటులోకి వచ్చింది కావున రైతులు ఇక నుంచి యాప్ డౌన్లోడ్ చేసుకుని నచ్చిన డీలర్ లేదా ప్రాథమిక సహకార సంఘాలు వద్ద యూరియా బుక్ చేసుకోవలెను, బుక్ చేసుకున్న 24 గంటల వరకు ఐడీ ద్వారా యూరియా తీసుకోవడానికి సమయం ఉంటుందని తెలిపారు.ఇందులో భాగంగా సోమవారం రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. రైతు పట్టాదారు పాస్ బుక్, ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్ మరియు బుకింగ్ ఐడీ చూపించి యూరియా కొనుగోలు చేయాలని సూచించారు. బుక్ చేసుకున్న రైతులకు కచ్చితంగా ఇవ్వాలని లేనిచో చట్ట పరమైన చర్యలు తీసుకోడానికి ఉన్నత అధికారులకు నివేదిస్తామని తెలియచేశారు. బుకింగ్ లో ఏమైనా సందేహాలు ఉన్నచో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి లేదా వ్యవసాయ అధికారి నీ సంప్రదించాలి అని తెలియచేయడం జరిగింది. 2-3 రోజులలో ప్రాథమిక సహకార సంఘాల కి యూరియా వస్తుంది అని తెలిపారు. ఇందులో మండల వ్యవసాయ అధికారి వినోద్, వ్యవసాయ విస్తరణ అధికారులు సురేష్, వీణ, ప్రదీప్ మరియు రైతులు పాల్గొన్నారు.

# చింతచిగురు - చింత చెదురు



దింత్రిణి పల్లవోత్కరముంగూడ,బొరంటి..." వానాకాలపు సొగసును, ముసురుబడిన గగనాన్ని, రైతుల సహజ జీవనాన్ని రాజకవి రాయలవారు ఆముక్తమాల్యదలో ఇలా వర్ణించారు. గురుగు, చెంచలి, తుమ్మి, తమిరిశ, చింతచిగురుతో కూడిన ఐదాకుల కూర గురించి ఇందులో చెప్పారు. వీటిలో చింతచిగురు రుతుచక్రాన్ని అనుసరించే ఆహార సాంప్రదాయంలో భాగం! తలచుకోగానే నోట్లో నీళ్లూరుతాయి కాబట్టి 'చింత' అన్నారు! "తింత్రిణీ పల్లవయుక్తమౌ నుడుకు బచ్చలి శాకము జొన్నకూటితో మెల్లన యొక్కముద్ద దిగమింగుమ నీ పసకాననయ్యెడిన్" అని శ్రీనాథుడు జొన్నకూటి మీద అక్కసు వెళ్ల బోశాడు. నిజానికి జొన్నన్నం, జొన్న రొట్టెల్లోకి చింతచిగురు బచ్చలి పప్పు మంచి జోడీ! "చింతచెట్టు చిగురుచూడు ... చిన్నదాని పొగరుచూడు.." అంటూ ఆరుద్ర రాసిన సినిమా పాట నేటికీ ప్రసిద్ధి! చింతచెట్టు రోడ్డు పక్కన పెరిగే మహా వృక్షమే అయినా, దాని పైకి ఎక్కి చిగురు కోయటమే పెద్ద పని. అందుకే ఇంత ఖరీదు! చింతచిగురు అమ్మే స్త్రీ కుమారుణ్ణి పొట్టన పెట్టుకున్న తన కొడుకుకి విష్ణుకుండిన ప్రభువు మాధవవర్మ శిక్ష విధించాడు. ఆ ధర్మనిర్ణయంతో బెజవాడ మీద బంగారు వర్షం కురిపించి దుర్గమ్మ కనకదుర్గమ్మ అయ్యిందని ఐతిహ్యం! చింతచిగురు అమ్మకం తెలుగునాట అనాదిగా ఉన్నదనే చారిత్రక సత్యాన్ని ఈ కథ చాటుతోంది! గాత్రశుద్ధికి, గొంతునొప్పులకు, చింతచిగురు ఉపయోగకారి! అక్బరు ఆస్థాన గాయకుడు తాన్సేన్ సమాధిని గ్వాలియర్లో ఓ చింతచెట్టు నీడన నిర్మించారు. చింతచిగురు పప్పు, చింత చిగురు పచ్చడి, గోంగూర లాగానే నిల్వపచ్చడి ఇవన్నీ తెలుగు వంటకాలే! చింతచిగురు వగరుగా కొద్దిగా పుల్లగా ఉంటుంది. వేసవి కాలంలో దొరుకుతుంది. చెమటను తగ్గించే గుణం దీనికుంది కాబట్టి, వేసవి కాలంలో దీని అవసరం ఎంతైనా ఉంది. ఏ రుతువులో దొరికేవి ఆ రుతువులకు అనుకూలంగా ఉంటాయి. ఇది ప్రకృతి ధర్మం! ఫిల్లిప్పీన్స్ లో చింతచిగురు రసాన్ని మలే రియా జ్వరం తగ్గటానికి తాగిస్తారు. ఈజిప్టులో వేసవి పానీయంగా తాగుతారు. మిగతా కాలంలో కూడా చింతచిగురు రావటానికి తాటాకు మంట వేసి సెగ చూపిస్తే మళ్ళీ చిగురిస్తుంది. తాటాకు చప్పుళ్లకు చింత కాయలు రాలవనే సామెత దీన్నుంచే పుట్టింది. రక్తధాతు వృద్ధికీ, కాలేయాన్ని శక్తిమంతం చేయటానికీ చింతచిగురు బాగా పనికొస్తుంది. ఒక మట్టిముంతలో గ్లాసు నీళ్లు పోసి గుప్పెడంత చింత చిగురు వేసి తుప్పు పట్టని కొత్త ఇనుప మేకును ఆ నీళ్లలోవేసి బాగా మరిగించి వడగట్టి రోజూ తాగుతుంటే కామెర్లు, ఇతర లివర్ వ్యాధులు, రక్త హీనత తగ్గుతాయి. మర్నాడు ఆ మేకుని శుభ్రపరచి తిరిగి వాడుకోవచ్చు! అపకారం చేసే తార్తారిక్ యాసిడ్, గ్లూకోజు, అందులో తాలింపు గింజలు నేతితో వేగించి ఈ చింతగారు చారులో చుయ్యి మనేలా తిరగమోత పెట్టి ఆ వేడి మీదే తాగితే బాగా పనిచేస్తుందంటారు.

## "జ్ఞానదంతం" తొలగిస్తే కంటిపై ప్రభావం

# నిపుణులు ఏమంటున్నారో తెలుసా

జ్ఞాన దంతాల నొప్పికి కారణమేంటి - వాటిని తొలగించుకోవడం మంచిదేనా



సాధారణంగా మనిషికి 32 పళ్లు ఉంటాయి. కానీ, యుక్త వయసు వరకు 28 దంతాలే ఉంటాయి. 20 ఏళ్లు దాటిన తర్వాత ఎగువ, దిగువ దవడలలో రెండు కొత్త దంతాలు వస్తూ ఉంటాయి. వీటినే జ్ఞాన దంతాలని పిలుస్తారు. ఇక జ్ఞానదంతాలు వచ్చేప్పుడు విపరీతమైన నొప్పి ఉంటుంది. దీంతో కొంతమంది వైద్యుల సలహా మేరకు తీయించుకుంటారు. ఇలా జ్ఞానదంతాలను తొలగించడం వల్ల కళ్లకు హాని కలుగుతుందేమో అనే భయం చాలామందిలో ఉంటుంది. ఈ క్రమంలో జ్ఞానదంతాలు వచ్చేప్పుడు నొప్పి ఎందుకు వస్తుంది? వీటిని తీసేస్తే నిజంగానే కళ్లు దెబ్బతింటాయా? నిపుణులు ఏం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం!

నొప్పి ఎందుకు వస్తుంది :

జ్ఞానదంతాల్లో నొప్పి రావడానికి మన శరీర ఎదుగుదల ఓ కారణం. ఎలాగంటే, చిన్నప్పుడు దవడలో జ్ఞానదంతం మొలవటానికి అవసరమైనంత చోటుండదు. అందుకే, వయసుతో పాటు దవడ సైజూ పెరుగుతూ వస్తుంది. ఈ క్రమంలో దవడ తగినంత సైజు పెరిగాక జ్ఞానదంతం రావడం స్టార్ట్ అవుతుంది. అయితే, కొంత మందిలో ఈ దవడ సైజు అవసరమైనంత పొడవుగా పెరగదట. అలాంటి వారికి నొప్పి వస్తుందని నిపుణులు చెబుతున్నారు.

చూపు తగ్గిపోతుందా :

చాలామందికి పళ్లు తొలగిస్తే కళ్లు దెబ్బతింటాయనీ, చూపూ తగ్గుతుందనీ నమ్ముతుంటారు. అంతేకాకుండా, నాడులకు, మెదడుకు నష్టం కలుగుతుందని భావిస్తుంటారు. అలాగే, జ్ఞానదంతం కూడా తొలగిస్తే చూపు తగ్గుతుందని అనుకుంటారు. కానీ, ఇది నిజం కాదంటున్నారు నిపుణులు. జ్ఞానదంతాలు అనేవి నోట్లో అన్నింటికన్నా వెనకాల ఉంటాయి. ఇవి దవడ ఎముకలు లేదా చిగుళ్లలో కూరుకుపోయి ఉంటాయి. సాధారణంగా 17 - 25 ఏళ్ల వయసులో పైకి ఉబికి వస్తుంటాయి. శాస్త్రవేత్తలు, వైద్యులు వీటిని అనవసర అవయవాలుగా పరిగణిస్తారు. ఈ క్రమంలో మన పూర్వీకులు జ్ఞానదంతాలతో పచ్చి ఆకులు, గింజ పప్పులు, దుంపలు, మాంసం వంటివి నమిలేవారట. కానీ, ఇప్పుడు వండిన ఆహారమే ఎక్కువగా తింటున్నాం. పండ్లు, కూరగాయలను చిన్న ముక్కలుగా కోసి తింటున్నాం. దీంతో మనకు జ్ఞానదంతాల అవసరమే లేకుండా పోయిందంటున్నారు నిపుణులు. ఇవి చిగుళ్లలోంచి పైకి ఉబికి వచ్చేటప్పుడు తీవ్రమైన నొప్పి కలగడంతో పాటు తినటమే కష్టమవుతుందట. దంతాలు, కళ్లు, ముఖంలోని నాడులు అన్నీ దగ్గర దగ్గరగా ఉండటం వల్ల పన్ను తీసేస్తే చూపు దెబ్బతింటుందనేది అపోహ మాత్రమే. నిజానికి చూపును నియంత్రించే దృశ్యనాడులు దంతాలకు, దవడలకు చాలా దూరంలో ఉంటాయి. ఈ నాడులు అనేవి పరస్పరం సమాచారమేమీ ఇచ్చిపుచ్చుకోవు. దంతాలను తొలగించినా వీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదు - డా. వికాస్ గౌడ్, డెంటల్ సర్జన్ కొన్నిసార్లు జ్ఞానదంతాలు పక్క వైపుల నుంచి పొడుచుకురావొచ్చు. తినే ఆహార పదార్థాల ముక్కలు అక్కడ చిక్కుకుపోవచ్చు. కొద్దిగా మొలిచిన జ్ఞానదంతాలు కొందరిలో పుచ్చిపోవచ్చు. మరికొందరికి వీటి పక్కల నీటి తిత్తులూ ఏర్పడొచ్చు. అంతేకాదు, చుట్టుపక్కల దంతాలూ దెబ్బతినొచ్చు. ఇలాంటి ఇబ్బందులు తలెత్తినప్పుడు డాక్టర్లు శస్త్రచికిత్సతో జ్ఞానదంతాన్ని తొలగిస్తుంటారని నిపుణులు చెబుతున్నారు. దీన్ని తీసే క్రమంలో దంతాన్ని, నోట్లో దాని చుట్టుపక్కల భాగాలను మాత్రమే తొలగిస్తారని అంటున్నారు. కళ్లు, మెదడు ఇతర వ్యవస్థలకు వచ్చిన ప్రమాదమేమీ లేదట. జ్ఞానదంతాల అమరికను పరిశీలించినా ఇవి కళ్లకు, కంటి నాడులకు చాలా దూరంలో ఉంటాయి. కాబట్టి, వీటికి తీసివేసే ఎలాంటి చికిత్సలైనా చూపును దెబ్బతీసేవి కావు. వీటిని తొలగించటం పూర్తిగా సురక్షితమని నిపుణులు చెబుతున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

## కొత్త రూల్ తీసుకొచ్చిన ఇలా

# ఈజీగా "స్కామ్ కాల్స్" గుర్తించండి!

సైబర్ నేరాలను తగ్గించడానికి కీలక నిర్ణయం - ఈ నంబర్ గుర్తుంటే స్కామ్ కాల్స్ సింపుల్‌గా కనిపెట్టేయొచ్చు!




నేటి డిజిటల్ యుగంలో ప్రజలను సైబర్ నేరాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఎప్పటికప్పుడు కొత్త పంథాను ఎంచుకుంటున్న సైబర్ నేరగాళ్లు ప్రస్తుతం బ్యాంకింగ్ సేవలను ఆసరాగా తీసుకుని భారీ మోసాలకు పాల్పడుతున్నారు. మనందరికీ బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నాం లోన్ కావాలా, క్రెడిట్ కార్డ్ ఇస్తామంటూ కాల్స్ వస్తుంటాయి. అంతేకాదు, మీకు లక్కీ డిప్‌లో భారీ మొత్తంలో బోనస్ అలాట్ అయ్యిందని, కేవైసీ అప్డేట్ చేయాలని చెబుతుంటారు. అలాగే, కేవైసీ అప్డేట్ కోసం మీరు బ్యాంక్‌కు కూడా రావాల్సిన పని లేదు. జస్ట్ మీ ఫోన్‌కు వచ్చే చిన్న ఓటీపీ చెప్తే చాలు అని నమ్మబలుకుతుంటారు. ఈ క్రమంలోనే చాలా మంది నిజంగా బ్యాంకు వాళ్లే చేశారేమోనని నమ్మి ఓటీపీ చెప్పేస్తుంటారు. తర్వాత కాసేపటికే అకౌంట్ నుంచి మనీ కట్ అయినట్లు ఫోన్ కు మెస్సేజ్ వస్తుంది. దాంతో మోసపోయామని లబోదిబోమంటూ ఏడ్చేస్తుంటారు. అయితే, ఇకపై ఇలాంటి మోసాలు, ఫేక్ కాల్స్‌కి చెక్ పెట్టేందుకు టెలికాం రెగ్యులేటరీ సంస్థ "ట్రాయ్" ఒక కీలక నిర్ణయం తీసుకుంది. కొత్తగా తీసుకొచ్చిన ఈ రూల్స్ గురించి తెలిసి ఉంటే చాలు. సింపుల్ గా స్కామ్ కాల్స్ ను గుర్తించి సైబర్ నేరాల నుంచి తప్పించుకోవచ్చంటున్నారు నిపుణులు. మరి, ఆ రూల్స్ ఏంటి? స్కామ్ కాల్స్ ను ఎలా గుర్తించాలో ఈ స్టోరీలో తెలుసుకుందాం. బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామంటూ ఖాతాదారులను మోసగిస్తూ ఓటీపీ/నెట్ బ్యాంకింగ్ వివరాలు తీసుకుని, అకౌంట్స్ లో ఉన్న అమౌంట్ దోచేస్తున్న వారికి చెక్ పెట్టేందుకు కొత్త రూల్స్ తీసుకొచ్చింది. జనవరి 1,2026 నుంచి అమలులోకి వచ్చిన ఈ రూల్స్ ప్రకారం బ్యాంకులన్నీ తమ వినియోగదారులకు చేసే ఫోన్‌కాల్స్ "1600 సిరీస్" నంబరు నుంచే రావాలని నిర్ణయించింది. అదేవిధంగా, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ(ఎన్‌బీఎఫ్‌సీ)లు, మ్యూచువల్ ఫండ్లు కూడా '1600' నంబర్ సిరీస్‌నే వినియోగించడానికి దశలవారీ గడువులను నిర్దేశించింది ట్రాయ్. ఏప్రిల్ 1 నుంచి "ఫాస్టాగ్ కొత్త రూల్" - తెలియకపోతే వాహనదారులకు ఇబ్బందులే! ప్రస్తుతం పెరుగుతున్న ఆర్థిక నేరాలను తగ్గించాలనే లక్ష్యంతో 1600 సిరీస్ తీసుకొచ్చింది ట్రాయ్. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తమ ఖాతాదారులను సంప్రదించేందుకు ఈ 1600 సిరీస్ నుంచి ఫోన్ చేయడం ద్వారా వినియోగదారుల్లో ఆర్థిక సేవలకు సంబంధించిన కాల్స్ ఒక అవగాహన ఏర్పడుతుంది. అందులో భాగంగానే 1600 సిరీస్ నంబర్లను బ్యాంకింగ్, బీమా, ఫైనాన్షియల్ రంగాలకు కేటాయించింది టెలికాం విభాగం డాట్. తద్వారా కస్టమర్లు ఆర్థిక మోసాల బారినపడే అవకాశాలు తగ్గుతాయని తెలిపింది ట్రాయ్.స్కామ్ కాల్స్ ఈజీగా కనిపెట్టేయండిలా! ట్రాయ్ తీసుకొచ్చిన నిబంధనల ప్రకారం ఇకపై బ్యాంక్స్, ఇన్సూరెన్స్ లకు సంబంధించిన సర్వీస్ కాల్స్ "1600" సిరీస్ నెంబర్ నుంచి స్టార్ట్ అవుతాయి. అంటే, "+91-1600"తో మొదలయ్యే నెంబర్ నుంచి మీకు కాల్ వస్తే అది నిజమైన, చట్టబద్ధమైన కాల్ అని నిర్ధారించుకోవాలని చెబుతోంది ట్రాయ్. సో మీరు ఈ చిన్న విషయం తెలుసుకుని ఉన్నారంటే ఏది నమ్మదగినది, ఏది మోసపూరిత ఫోన్ కాలో ఈజీగా కనిపెట్టేయొచ్చంటున్నారు నిపుణులు. స్కామ్ కాల్స్ ద్వారా జరిగే సైబర్ మోసాల నుంచి బయటపడవచ్చంటున్నారు. ఆర్థిక రంగంలోని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, అన్ని మ్యూచువల్ ఫండ్లు, అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు మాత్రమే కాకుండా బీమా రంగంలోని సంస్థలూ ఈ సిరీస్‌ను అమలు చేసేందుకు నిర్ణయం తీసుకుంది ట్రాయ్. అందులో భాగంగానే గడువును నిర్ణయించేందుకు ఐఆర్‌డీఏఐతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఆ అంశంపై టెలికాం రెగ్యులేటరీ సంస్థ ట్రాయ్ ప్రకటన విడుదల చేయనుంది.

# వరల్డ్ కప్ చరిత్రలో అరుదైన ఫీట్- రెండుసార్లు ౹20 ట్రోఫీ నెగ్గిన 'ఏకైక' కెప్టెన్ ఎవరో తెలుసా

## టీ20 వరల్డ్ కప్ చరిత్రలో రెండుసార్లు ట్రోఫీని గెలిచిన కెప్టెన్- భారత్, ఇంగ్లాండ్ జట్లతో పాటు ఆ జట్టు కూడా రెండుసార్లు ఛాంపియన్- కానీ కెప్టెన్ ఒకడే



క్రికెట్ ప్రపంచంలో ప్రతి ప్లేయర్‌కు ఒక వరల్డ్ కప్ గెలవాలనేది పెద్ద డ్రీమ్. అలాంటిది కెప్టెన్‌గా తన జట్టును రెండుసార్లు విశ్వవిజేతగా నిలబెట్టడం అంటే అది మామూలు విషయం కాదు. 2007 నుంచి 2024 వరకు జరిగిన టీ20 వరల్డ్ కప్ ప్రయాణంలో ఎందరో దిగ్గజ కెప్టెన్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. కానీ ఒక్కరు మాత్రం ఒక అరుదైన రికార్డును తన పేరిట రాసుకున్నారు. ఎంఎస్ ధోనీ నుంచి రోహిత్ శర్మ వరకు ఎందరో సక్సెస్‌ఫుల్ కెప్టెన్లు ఉన్నా, ఈ ఘనత సాధించిన ఆ వ్యక్తి ఎవరు? అతని నాయకత్వంలో ఆ జట్టు ఎలా చరిత్ర సృష్టించిందో ఇప్పుడు వివరంగా చూద్దాం!

ధోనీ మార్క్ కెప్టెన్సీతో మొదలైన టీమ్ఇండియా ప్రస్థానం

టీ20 వరల్డ్ కప్ అంటేనే మనకు మొదట గుర్తొచ్చేది 2007 ఎడిషన్. ఎంఎస్ ధోనీ నాయకత్వంలో టీమ్ఇండియా అరంగేట్రం టోర్నీలోనే సంచలనం సృష్టించింది. సౌతాఫ్రికా వేదికగా జరిగిన ఆ టోర్నీలో యువ భారత్ పాకిస్థాన్‌ను ఓడించి మొదటిసారి ఛాంపియన్‌గా నిలిచి చరిత్ర సృష్టించింది. ధోనీ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలు, యువ ప్లేయర్ల పట్టుదల భారత్‌కు ఆ అరుదైన ట్రోఫీని అందించాయి. టీమ్ఇండియా భవిష్యత్తు కూడా ఆ విజయం నుంచి మరో స్థాయికి వెళ్లింది.

రోహిత్ శర్మ సారథ్యంలో మళ్ళీ విశ్వవిజేతగా భారత్

ధోనీ తర్వాత ఆ రేంజ్ కెప్టెన్సీతో భారత్‌ను మళ్లీ వరల్డ్ కప్ విజేతగా నిలిపాడు రోహిత్ శర్మ. 2024లో జరిగిన గత సీజన్‌లో రోహిత్ తన పక్కా ప్లానింగ్‌తో టీమ్ఇండియాను ఓటమి లేకుండా నడిపాడు. ఫైనల్‌లో ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికాను ఓడించి భారత్ రెండోసారి టీ20 వరల్డ్ కప్‌ను ముద్దాడింది. రోహిత్ శర్మ ప్లేయర్‌గా 2007లో, కెప్టెన్‌గా 2024లో ట్రోఫీని గెలిచిన ఏకైక భారత ప్లేయర్‌గా అరుదైన రికార్డును కూడా తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ విజయంతో భారత్ మళ్లీ టీ20 ఫార్మాట్‌లో తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది.

డారెన్ సామి కెప్టెన్సీలో వెస్టిండీస్ ఫస్ట్ విక్టరీ

వెస్టిండీస్ జట్టు టీ20 ఫార్మాట్‌లో ఎంత ప్రమాదకరమో 2012లో ప్రపంచానికి తెలిసింది. డారెన్ సామి సారథ్యంలో విండీస్ తన మొదటి టీ20 వరల్డ్ కప్ సాధించింది. శ్రీలంక వేదికగా జరిగిన ఆ టోర్నీ ఫైనల్‌లో హోస్ట్ టీమ్ శ్రీలంకను ఓడించి కరీబియన్లు కప్పును కైవసం చేసుకున్నారు. సామి తన నాయకత్వంతో జట్టును ఏకతాటిపైకి తీసుకువచ్చి అద్భుతమైన ఫలితాలను సాధించారు.

సామి మరో గొప్ప రికార్డ్

2016లో డారెన్ సామి మరొక చరిత్రాత్మక ఘనతను అందుకున్నాడు. భారత్ వేదికగా జరిగిన ఆ టోర్నీలో వెస్టిండీస్ రెండోసారి విశ్వవిజేతగా నిలిచింది. ఫైనల్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో కార్లోస్ బ్రాత్‌వైట్ వరుస సిక్సర్లతో విండీస్‌ను గెలిపించాడు. ఈ విజయంతో డారెన్ సామి టీ20 వరల్డ్ కప్ చరిత్రలో రెండుసార్లు ట్రోఫీని గెలిచిన ఏకైక కెప్టెన్‌గా ప్రపంచ రికార్డు సృష్టించారు. అతని నాయకత్వంలో విండీస్ జట్టు టీ20 క్రికెట్‌లో రారాజుగా వెలుగొందింది. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే? అదే సీజన్ మహిళల వెస్టిండీస్ జట్టు కూడా టీ20 వరల్డ్ కప్ గెలిచుకుంది. ఆ ఏడాది వెస్టిండీస్ క్రికెట్‌కు గోల్డెన్ ఇయర్.

సామి తర్వాత వెస్టిండీస్ ఒడుదొడుకులు

వెస్టిండీస్ క్రికెట్‌లో డారెన్ సామి కెరీర్ ముగిసిన తర్వాత ఆ జట్టు మళ్లీ చెప్పుకోదగ్గ రీతిలో రాణించలేకపోయింది. ముఖ్యంగా సామి లాంటి పవర్‌ఫుల్ ఆల్ రౌండర్, బెస్ట్ కెప్టెన్ దొరకకపోవడం ఆ జట్టుకు పెద్ద మైనస్‌గా మారింది. ఆ తర్వాత జరిగిన ఎడిషన్లలో విండీస్ చెప్పుకోదగ్గ రీతిలో ఆడింది లేదు. జట్టులో అద్భుతమైన ప్లేయర్లు ఉన్నా, వారిని ఒక తాటిపైకి తీసుకువచ్చే నాయకత్వం లేకపోవడంతో కరీబియన్లు గత 10ఏళ్లలో ఒక్కసారి కూడా టీ20 వరల్డ్ కప్ కొట్టలేదు.

2026లో హోప్ సేనపై ఆశలు

ప్రస్తుతం జరుగుతున్న 2026 వరల్డ్ కప్‌లో వెస్టిండీస్ మళ్లీ తన పాత వైభవాన్ని వెతుక్కునే పనిలో పడింది. షై హోప్ సారథ్యంలో బరిలోకి దిగిన కరేబియన్ జట్టు స్క్వాడ్ చాలా బలంగా కనిపిస్తోంది. జట్టులో జాన్సన్ చార్లెస్, రోస్టన్ చేజ్, మత్తీ ఫ్రాడ్, షిమ్రాన్ హెట్మెయర్, జేసన్ హోల్డర్, అకీల్ హుస్సేన్, షమర్ జోసెఫ్, బ్రాండన్ కింగ్, గుడకేష్ మోటీ, రోవ్‌మాన్ పావెల్, షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్, క్వెంటిన్ సాంప్సన్, జేడెన్ సీల్స్, రొమారియో షెపర్డ్ వంటి స్టార్ ప్లేయర్లు ఉన్నారు. ఇప్పటికే ఈ టీమ్ స్కాట్లాండ్‌పై 35 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించి టోర్నీని ఘనంగా ప్రారంభించింది.

# మెక్‌కల్లమ్ 'వాకీ టాకీ' కాంట్రవర్సీ- మ్యాచ్ మధ్యలో అలా మాట్లాడొచ్చా- నిబంధనలు ఏంటంటే

## వరల్డ్ కప్ - ఇంగ్లాండ్ వర్సెస్ నేపాల్ మ్యాచ్- 'వాకీ టాకీ'తో కమ్యూనికేట్ చేసిన మెక్ కల్లమ్- ఇంగ్లాండ్ కోచ్ పై ట్రోల్స్- రూల్స్ ఏం చెబుతున్నాయంటే




టీ20 వరల్డ్ కప్‌లో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో బలమైన ఇంగ్లాండ్‌కు పసికూన నేపాల్ చుక్కలు చూపించింది. ఆదివారం ముంబయి వేదికగా జరిగిన మ్యాచ్ లో ఇంగ్లాండ్‌ను ఓడించినంత పని చేసింది. 185 పరుగుల టార్గెట్ తో బరిలో దిగిన నేపాల్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 180 రన్స్ చేసి దాదాపు విజయం అంచుల దాకా వెళ్లింది. దీంతో కేవలం 4 పరుగులు స్వల్ప తేడాతో ఇంగ్లాండ్ గట్టెక్కింది. మ్యాచ్ అయితే గెలిచింది, కానీ ఇంగ్లాండ్ హెడ్ కోచ్ బ్రెండన్ మెక్ కల్లమ్ మాత్రం ఇప్పుడు విమర్శలు ఎదుర్కొంటున్నాడు. మరి అసలేం జరిగిందంటే 185 లక్ష్య ఛేదనలో నేపాల్ అద్భుతంగా పోరాడింది. ఓపెనర్ ఆసిఫ్ షేక్ (7) త్వరగానే ఔటైనా కుషాల్ భుర్తేల్ (29 పరుగులు), రోహిత్ పౌడెల్ (39 పరుగులు), దీపేంద్ర సింగ్ (44 పరుగుల) రాణించడంతో నేపాల్ 14 ఓవర్లకే 120 పరుగులు దాటింది. ముఖ్యంగా రోహిత్- దీపేంద్ర 82 పరుగులు భాగస్వామ్యం నెలకొల్పి గెలుపునకు బాటలు వేశారు. ఇక చివర్లో లోకేశ్ బమ్ (39 పరుగులు, 20 బంతుల్లో) ధనాధన్ ఇన్నింగ్స్‌తో ఇంగ్లాండ్‌కు చెమటలు పట్టించాడు. 12 బంతుల్లో 24 పరుగులు కావాల్సిన దశలో మ్యాచ్ లో హై డ్రామా జరిగింది. నేపాల్ ను అడ్డుకునేందుకు ఇంగ్లాండ్ మాస్టర్ ప్లాన్‌లు వేసినా వికెట్ తీయలేకపోయింది. దీంతో ఇంగ్లాండ్ కోచ్ మెక్ కల్లమ్ రంగంలోకి దిగాడు. 19వ ఓవర్లో డ్రెస్సింగ్ రూమ్ నుంచి మెక్‌కల్లమ్ వాకీ టాకీ లో మాట్లాడుతూ కనిపించాడు. కెప్టెన్ బ్రూక్ తో కమ్యూనికేట్ చేసేందుకు మెక్ కల్లమ్ వాకీ టాకీ వాడాడు! అయితే అందులో అతడు ఏం మాట్లాడాడో తెలియదు. కానీ, తన సందేశాన్ని బ్రూక్ కు అందించాలని, డగౌట్ లో కూర్చొని ఉన్న ఎక్స్ ట్రా ప్లేయర్లకు మెక్ కల్లమ్ ఆదేశించాడని సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది. దీనికి సంబంధించి ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే మ్యాచ్ జరుగుతుండగా ఒక కోచ్ వాకీ టాకీ వాడొచ్చా మెక్ కల్లమ్ నిబంధనలు బ్రేక్ చేశాడు! అంటూ విమర్శలు వస్తున్నాయి. మరి ఐసీసీ రూల్స్ ఏం చెబుతున్నాయంటే ఇదీ రూల్ ఐసీసీ నిబంధన 4.3.1 ప్రకారం, మ్యాచ్ జరుగుతున్న సమయంలో గ్రౌండ్ లో ఆడుతున్న ప్లేయర్లు మాత్రం అస్సలు వాకీ టాకీ వాడకూడదు. కానీ, కోచింగ్ స్టాఫ్ వీటిని వాడవచ్చు. జట్టు మెడికల్ టీమ్, కోచ్ డగౌట్ లో ఉండే సిబ్బందితో కమ్యూనికేషన్ చేసుకునేందుకు వాకీ టాకీ వాడుకోవచ్చు. ఇందులో గేమ్ స్ట్రాటజీలు, మెడికల్ ఎమర్జెన్సీ సంబంధించి మాట్లాడుకోవచ్చు. ఇక్కడ కూడా మెక్ కల్లమ్ డగౌట్ లో ఉన్న ప్లేయర్లతోనే మాట్లాడాడు. అందుకే మెక్‌కల్లమ్ తన పరిధి మేరకే వాకీ టాకీ వాడాడు. దీంతో ఈ విషయంలో అతడు ఐసీసీ రూల్స్ బ్రేక్ చేయనట్లే! వాకీ- టాకీ వాడడంపై ఐసీసీ నిబంధన ఇక మ్యాచ్ విషయానికొస్తే, మొదట టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 184 పరుగులు చేసింది. జాకబ్ బెటెల్ (55 పరుగుల), హ్యారీ బ్రూక్ (53 పరుగులు) అర్ధశతకాలు సాధించారు. బట్లర్ (29) వేగంగా పరుగులు జోడించగా, విల్ జాక్స్ (39లి) చివర్లో రాణించాడు. 185 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నేపాల్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 180 పరుగులు చేసి విజయానికి దగ్గరగా వచ్చింది. దీంతో ఇంగ్లాండ్ 4 పరుగుల తేడాతో నెగ్గింది.

# జస్ట్ మిస్ చేసుకున్న నేపాల్ - 4 పరుగులతో ఇంగ్లాండ్ విక్టరీ




## టీ20 వరల్డ్ కప్ టోర్నీ- ముంబయి వేదికగా మ్యాచ్ - నేపాల్ పై విజయం సాధించిన ఇంగ్లాండ్

టీ20 ప్రపంచకప్‌లో పసికూన జట్టుగా బరిలోకి దిగిన నేపాల్ అద్భుత పోరాటంతో అందరినీ ఆకట్టుకుంది. అయితే సంచలన విజయానికి కేవలం నాలుగు పరుగుల దూరంలో నిలిచిపోయి ఓటమిని చవిచూసింది. ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత గ్రూప్ మ్యాచ్‌లో బలమైన ఇంగ్లాండ్‌కు గట్టి పోటీ ఇచ్చిన నేపాల్ 4 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. చివరి బంతి వరకు సాగిన ఈ మ్యాచ్ ప్రేక్షకులను కుర్చీలకు అతుక్కుపోయేలా చేసింది.

నిలకడైన ఇన్నింగ్స్ తో హ్యారీ బ్రూక్

మొదట టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 184 పరుగులు చేసింది. ఆరంభంలోనే వికెట్లు కోల్పోయినా మధ్య ఓవర్లలో జట్టు బలంగా పుంజుకుంది. ఓపెనర్ ఫిలిప్ సాల్ట్ (1) నిరాశపరిచినా, జాకబ్ బెటెల్ దూకుడుగా ఆడుతూ 55 పరుగులతో అర్ధశతకం సాధించాడు. అతనికి తోడుగా హ్యారీ బ్రూక్ (53) నిలకడైన ఇన్నింగ్స్ ఆడడంతో ఇంగ్లాండ్ స్కోరు వేగంగా పెరిగింది.

200 పరుగుల దిశగా వెళ్లకుండా!

మధ్యలో బట్లర్ (29) వేగంగా పరుగులు జోడించగా, విల్ జాక్స్ (39లి) చివర్లో ఆఖరి ఓవర్లలో బౌండరీలతో స్కోరును మరింత పెంచాడు. అయితే నేపాల్ బౌలర్లు కూడా తమ వంతు పోరాటం చేశారు. దీపేంద్ర సింగ్, నందన్ యాదవ్ చెరో రెండు వికెట్లు తీసి ఇంగ్లాండ్‌ను అదుపులో ఉంచారు. షేర్ మల్ల, సందీప్ ఒక్కో వికెట్ సాధించారు. దీంతో ఇంగ్లాండ్ 200 పరుగుల దిశగా వెళ్లకుండా 184 వద్దే ఆగింది.

మ్యాచ్ ఇటు తిప్పిన రోహిత్, దీపేంద్ర

185 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నేపాల్ ఆరంభం జాగ్రత్తగా సాగింది. మొదటి వికెట్ త్వరగా కోల్పోయినా, తర్వాత బ్యాటర్లు పట్టుదలగా నిలబడ్డారు. దీపేంద్ర సింగ్ అద్భుతంగా ఆడుతూ 44 పరుగులు చేశాడు. అతనికి రోహిత్ పౌడెల్ (39) మంచి సహకారం అందించాడు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు 82 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను పూర్తిగా నేపాల్ వైపు తిప్పారు.

చివరి బంతికి ఆరు పరుగులు

మధ్య ఓవర్లలో కుశాల్ (29) విలువైన పరుగులు జోడించగా, చివర్లో లోకేశ్ బామ్ (39లి) ఒంటరి పోరాటం చేశాడు. ఆసిఫ్ (7), ఆరిఫ్ (10) కొంత సహకారం అందించినా, కీలక సమయాల్లో వికెట్లు పడిపోవడంతో ఒత్తిడి పెరిగింది. చివరి రెండు ఓవర్లలో మ్యాచ్ మరింత ఉత్కంఠగా మారింది. చివరి ఓవర్‌కు నేపాల్‌కు 12 పరుగులు అవసరమయ్యాయి. ప్రతి బంతి ఉత్కంఠ రేపింది. ఆఖరి బంతికి ఆరు పరుగులు కావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జస్ట్ మిస్

విజయం కోసం సిక్స్ కొట్టాల్సి ఉన్నా, బ్యాటర్ ఒక్క పరుగే తీయగలిగాడు. దీంతో నేపాల్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 180 పరుగులకే పరిమితమై, కేవలం నాలుగు పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. ఇంగ్లాండ్ బౌలర్లలో లియామ్ లివింగ్‌స్టోన్ రెండు వికెట్లు తీసి కీలక పాత్ర పోషించాడు. జోఫ్రా ఆర్చర్, విల్ జాక్స్, సామ్ కరన్, ల్యూక్ వుడ్ చెరో వికెట్ సాధించి మ్యాచ్‌ను ఇంగ్లాండ్ వైపు తిప్పారు.

పెద్ద జట్లకు నేపాల్ సవాల్ గా మారుతుందా

ఓటమి ఎదురైనా నేపాల్ ఆటతీరు మాత్రం అభిమానుల ప్రశంసలు అందుకుంది. బలమైన జట్టుకు ఎదురొడ్డి చివరి బంతి వరకు పోరాడిన తీరు క్రికెట్ ప్రపంచాన్ని ఆకట్టుకుంది. చిన్న జట్టుగా భావించిన నేపాల్ తన ప్రతిభతో భవిష్యత్తులో పెద్ద జట్లకు సవాల్‌గా మారనుందని ఈ మ్యాచ్ స్పష్టం చేసింది. విజయం చేజారినా, ఈ పోరాటం నేపాల్‌కు విజయం లాంటిదే.

printed , published and owned by DR.B.ANILKUMAR ,@ 407 THARNAKA , HYDERABAD , Telangana state.published at DAIWIK PUBLICATIONS pvt.ltd.printed at SNEHITHA PRINTERS H.NO : 2-6 , Warangal Dist.Telangana state ,EDITOR DR.B.ANILKUMAR ,RNI NO TELTEL/2021/ 81079 , cell : 7702866885 ,vijethatelugudaily@gmail.com